ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 09.04.2026 | సంపుటి :12 సంచిక : 260 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## ఎట్టకేలకు
# కాల్పుల విరమణ

### రెండు వారాలపాటు యుద్ధ విరామం

## ట్రంప్ కీలక నిర్ణయం

పది సూత్రాలతో కూడిన ఇరాన్ ప్రతిపాదనను అంగీకరించిన అమెరికా అధ్యక్షుడు

- ప్రపంచశాంతికి ఇదో గొప్ప రోజని వెల్లడి
- సాయుధ దళాల పర్యవేక్షణలో హర్మూజ్‌లో రాకపోకలకు ఇరాన్ అనుమతి
- ఇది యుద్ధానికి ముగింపు కాదు: మొజ్తాబా ఖమేనీ
- హర్మూజ్ దాటడానికి ఎలాంటి టోల్ ఫీజ్ వద్దు: ఒమన్



వాషింగ్టన్/టెహ్రాన్(జనంసాక్షి):ఇరాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రెండు వారాలపాటు కాల్పుల విరమణ ప్రకటించారు. హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్‌కు మరో రెండు వారాలు గడువు ఇచ్చారు. ఈ విషయాన్ని ట్రూత్ సోషల్ వేదికగా వెల్లడించారు. గడువు పొడిగించాలన్న పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రతిపాదనను ట్రంప్ అంగీకరించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు."పాక్ ప్రధాని షరీఫ్, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌తో మాట్లాడాను. ఇరాన్‌కు ఇచ్చిన గడువును రెండు వారాలపాటు పొడిగించాలని, దాడులను నిలిపివేయాలని కోరారు. హర్మూజ్ జలసంధిని తెరవాలనే షరతుకు లోబడి రెండు వారాల గడువు ఇచ్చేందుకు, కాల్పుల విరమణకు అంగీకరించాను. ఇరుదేశాల వైపు నుంచి ఈ కాల్పుల విరమణ ఉంటుంది. ఇరాన్ పది సూత్రాలతో ఒక ప్రతిపాదనను పంపించింది. అవన్నీ సానుకూలంగానే ఉన్నాయి. దీంతో చర్చలు కీలక దశకు చేరుకున్నాయి. ఇరాన్‌తో శాశ్వత శాంతి ఒప్పందానికి, పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పడానికి ఈ రెండు వారాల గడువు ఉపయోగపడుతుంది. ఈ దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి చేరువవ్వడం గౌరవంగా భావిస్తున్నా"అని ట్రంప్ పేర్కొన్నారు.కాగా గత 40 రోజు లుగా అమెరికా – ఇరాన్ మధ్య మిగతా 2లో..

### ఇరాన్‌కు ఆయుధాలిస్తే
## 50 శాతం టారిఫ్‌లు
కాల్పుల విరమణ అనంతరం ట్రంప్ హెచ్చరికలు

### కాల్పుల విరమణ
## లెబనాన్‌కు వర్తించదు
- స్పష్టం చేసిన అమెరికా, ఇజ్రాయెల్
- ఆ దేశంపై కొనసాగుతున్న దాడులు

## అటు కాల్పుల విరమణ.. ఇటు క్షిపణి దాడులు
వివరాలు 2 పేజీలో..

### మరోసారి హర్మూజ్
## మూసివేత
లెబనాన్‌పై దాడులకు నిరసనగా ఇరాన్ నిర్ణయం
2లో..

### పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి
## దారితీస్తుంది
2లో..
- అమెరికా- ఇరాన్ సీజ్‌ఫైర్ స్పందించిన భారత్
- ఇరాన్ నుంచి తక్షణమే బయటపడండి: కేంద్రం అడ్వైజరీ
- ఇరాన్ చమురు కొనుగోలుకు భారత రిఫైనరీలు ఆసక్తి

# సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా చూడకండి
### దానిని భాగస్వామ్యంగా పరగణించండి: సీఎం రేవంత్

- ప్రాధాన్య రంగాలను మీరే ఎంచుకోండి
- అవసరమైన సహకారం ప్రభుత్వం తరపున మేం అందిస్తాం
- కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమీక్ష



హైదరాబాద్(జనంసాక్షి): సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీలు సీఎస్ఆర్‌కు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుందని తెలియజేశారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకొని సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని సూచించారు. ప్రభుత్వంతో పాటు కంపెనీలు కలిపి చేసే వ్యయంతో తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యం ఉన్న వారిగా తీర్చిదిద్ది భవిష్యత్ అవకాశాలను వారు అందిపుచ్చుకునేలా తయారు చేయగలమని సీఎం అన్నారు. విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్ నగరంలోనే 44 శాతం ఉన్నారని.. వారికి నాణ్యమైన మిగతా 2లో..

### జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై హైకోర్టు విచారణ
# తీర్పు 22కు వాయిదా



హైదరాబాద్(జనంసాక్షి): కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ కమిషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పును ఈ నెల 22కు వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, మిగతా 2లో..

### మతంలోని మూఢనమ్మకాలను గుర్తించే
# అధికారం మాకుంది



### శబరిమల కేసులో కేంద్రం వివరణపై సుప్రీం కోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):'శబరిమలలో స్త్రీల ప్రవేశం' అంశంపై జరుగుతున్న విచారణ సందర్భంగా బుధవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మతపరమైన ఆచారాల్లో ఏది మూఢనమ్మకమో, కాదో నిర్ణయించే అధికారం, హక్కు న్యాయస్థానానికి ఉందని పేర్కొంది.' న్యాయమూర్తులు చట్టం విషయంలో మాత్రమే నిపుణులు, మత విషయాల్లో కాదు. కాబట్టి న్యాయస్థానాలు మత ఆచారాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేవు' అన్న కేంద్ర ప్రభుత్వ వాదనకు ప్రతిస్పందనగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో, 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం శబరిమల కేసును విచారణ చేస్తోంది. ఈ ధర్మాసనంలో జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్, జస్టిస్ ప్రసన్న బి.వరాలే,



జస్టిస్ ఆర్ మహదేవన్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ ఉన్నారు. ఈ బెంచ్ ఆధ్వర్యంలో కేరళలోని శబరిమల ఆలయంతో సహా, వివిధ మత ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షపై, అలాగే వివిధ మతాల్లో ఉన్న స్త్రీ మత స్వేచ్ఛ పరిధిపై విచారణ జరుగుతోంది.

**కోర్టులకు ఆ అధికారం ఎక్కడిది?**

కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, "ఒక ఆచారం మూఢనమ్మకమని కోర్టు ఎలా నిర్ణయిస్తుంది? ఒక వేళ అది మిగతా 2లో..

### నాదర్‌గుల్ భూముల్లో వాటా రాకపోవడంతోనే
# హరీశ్ దుష్ప్రచారం
### అబద్దాలరావు చెప్తున్న కంపెనీల్లో నా కుటుంబ సభ్యులెవరూ లేరు

- వేల కోట్ల అవినీతి జరిగిందనే పచ్చి అబద్ధం
- మంత్రులపై బురదజల్లడమే బీఆర్ఎస్ పని
- వారికున్న బురదను మాకు అంటించాలని యత్నం
- నాదర్ గుల్, వట్టినాగులపల్లి భూములుపై నిందలు
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి



హైదరాబాద్(జనంసాక్షి):నాదర్‌గుల్ భూముల విషయంలో భారత రాష్ట్ర సమితి నేత హరీశ్ రావు దుష్ప్రచారం చేస్తున్నారని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సర్వే నంబర్ 613లోని భూములను 2014లో మూడు సంస్థలకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసిందని తెలిపారు. భూముల మ్యుటేషన్ జరిగిన 2016లోనూ వారి ప్రభుత్వమే ఉందన్నారు. 2014, 2016లో జరిగిన రిజిస్ట్రేషన్లతో ఈ ప్రభుత్వానికి ఏం సంబంధమని ప్రశ్నించారు. హరీశ్ రావు చెబుతున్న భూముల్లో 2022లోనే నిర్మాణాలు ప్రారంభించారు. భూములు పొందిన వారు నాలా కన్వర్షన్ ఇవ్వట్లేదని 2022లోనే సుప్రీంకోర్టుకు వెళ్లారు. వాళ్లు కోర్టుకు వెళ్తే బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. అవి ప్రభుత్వ భూములు అని చెప్పి మేం కౌంటర్ వేశాం అని అన్నారు.. ఆనాడు వాటాల ఒప్పందం చేసుకుని భూములు కట్టబెట్టి ఇవాళ మా మీద నిందలు వేస్తున్నారు. నాదర్ గుల్ భూముల్లో వాటా రాకపోవడంతో హరీశ్ రావు ఇవాళ తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. ప్రొహిబిటెడ్ భూముల్లో ఈ ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేయలేదు. హరీశ్ రావు చెబుతున్న కంపెనీల్లో నా కుటుంబ సభ్యులెవరూ లేరు. మిగతా 2లో..

### ఆదిలాబాద్‌లో అతిపెద్ద
# ఎయిర్‌పోర్టు
### నిర్మించే యోచనలో కేంద్రం ప్రభుత్వం

- కొత్తగూడెం ఎయిర్‌పోర్టు ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తున్నాం
- మామునూరు ఎయిర్‌పోర్టుకు మరో 3 నెలల్లో శంకుస్థాపన
- పెద్దపల్లి జిల్లా అంతర్గాం వద్ద ఎయిర్‌పోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన
- వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు సంబంధించి వస్తోన్న అన్ని డిమాండ్లను పరిశీలిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డితో కలిసి రామ్మోహన్ నాయుడు సమావేశమయ్యారు. అనంతరం కిషన్‌రెడ్డితో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఫీజబులిటి ఉన్న చోట ఎయిర్‌పోర్టులు నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. మిగతా 2లో..



### వనపర్తి పర్యటనకు హరీశ్‌కు
# గ్రీన్ సిగ్నల్
### జిల్లా ఎస్పీ ఆదేశాలను తోసిపుచ్చిన హైకోర్టు

హైదరాబాద్(జనంసాక్షి): సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు వనపర్తి పర్యటనకు తెలంగాణ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హరీశ్ రావుకు వనపర్తి జిల్లాలో పర్యటించేందుకు అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేసింది. హరీశ్ రావు పర్యటనకు అనుమతి లేదన్న జిల్లా ఎస్పీ ఆదేశాలను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. గొల్లపల్లి రిజర్వాయర్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక రైతులు మిగతా 2లో..

### కాళేశ్వరం మోటర్లను
## ధ్వంసం చేసే కుట్ర
- సరైన నిర్వహణ లేకుండా చేస్తే ఎలా?
- మంత్రి ఉత్తమ్‌కు హరీశ్ బహిరంగ లేఖ

2లో..



### ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీకి
# రూ.41 వేల కోట్లు
### జైపూర్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం • కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారంనాడు జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 5 కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,533.81 కోట్లు కేటాయించారు. ఇది 2025 ఖరీఫ్ సీజన్‌లో బడ్జెటరీ కేటాయింపుల కంటే రూ.4,313 కోట్ల రూపాయలు అధికం. 2025 ఖరీఫ్ బడ్జెట్ రూ.37,216.15 కోట్లుగా ఉంది. కాగా, జైపూర్ మెట్రో ఫేజ్–2కు కేంద్ర క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. రూ.13,038 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడతారు. ప్రహ్లాద్‌పుర నుంచి తోడి–మోడ్ వరకూ 36 స్టేషన్లను కలుపుతూ 41 కిలోమీటర్ల పొడవైన నార్త్–సౌత్ కారిడార్‌గా దీన్ని నిర్మించనున్నారు. కేంద్ర, రాజస్థాన్ ప్రభుత్వం జాయింట్ వెంచర్‌గా రాజస్థాన్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ దీనిని చేపడుతుంది. రాజస్థాన్‌లో హెచ్‌పీసీఎల్ రిఫైనరీ కోసం రూ.79,459 కోట్లను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుణాచల్ మిగతా 2లో..

### కొత్త పార్టీతో సామాన్యలకు
# అండగా నిలుస్తాం

- ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణయే ఏటీఎం
- కాంగ్రెస్ అవినీతిపై ఇక నిరంతరంగా నిలదీస్తాం
- ఏప్రిల్ 25 చరిత్రను మార్చే రోజు అవుతుంది
- జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్(జనంసాక్షి): దేశంలో ఎక్కడ ఎన్నికలు వచ్చినా సరే కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఢిల్లీకి ఘోరమైన గులాంగిరి చేస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేస్తే ఫోన్‌లో మాట్లాడేటప్పుడు కూడా రేవంత్‌రెడ్డి నిలబడే మాట్లాడుతున్నారని.. లేదంటే తన కుర్చీకి ఎక్కడ ఎసరు వస్తుందోనని భయపడుతున్నారని సెటైర్లు గుప్పించారు. బుధవారం తెలంగాణ జాగృతిలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మిగతా 2లో..

# భానుడి భగ భగ



- రాబోయే రోజుల్లో రాష్ట్రంలో నిప్పుల వర్షం
- అన్ని జిల్లాల్లోనూ 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత
- పలు జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు • హెచ్చరించిన ఐఎండీ

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో వేసవి ప్రారంభంలో అధిక ఉష్ణోగ్రతలు ప్రజలను భయపెట్టాయి. మరికొన్ని రోజులకు ఉరుములు, మెరుపుల వానల కారణంగా వాతావరణం చల్లబడింది. ఈ నేపథ్యంలో మరి కొద్ది రోజుల్లో రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగతుందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. రేపటి నుంచి గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. రెండు నుంచి నాలుగు డిగ్రీల మేర అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల తో పాటు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయంటున్నారు

# మొదలైన ఎన్నికల సందడి



### నామినేషన్ దాఖలు చేసిన సీఎం మమత

కోల్‌కతా(జనంసాక్షి):పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల హడావుడి నెలకొంది. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన సొంత నియోజకవర్గం భవానీపూర్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. తన జీవితంలో అంతా ఇక్కడినుంచే మొదలైందని ఈ సందర్భంగా ఆమె వ్యాఖ్యానించారు. నామినేషన్ వేయడానికి ముందు ఖాళీఘాట్‌లోని నివాసం నుంచి అలీపూర్ సర్వే భవనం మిగతా 9లో..

# మరోసారి హర్మూజ్ మూసివేత

## లెబనాన్‌పై దాడులకు నిరసనగా ఇరాన్ నిర్ణయం

టెహ్రాన్(జనంసాక్షి):హర్మూజ్ జలసంధిని ఇరాన్ మరోసారి మూసివేసింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికాతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరి 24 గంటలు గడవక ముందే ఇరాన్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. దీంతో పశ్చిమాసియా పరిస్థితులు మరోసారి ఆందోళనకరంగా మారనున్నాయి.లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీతావహ దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. 10 నిమిషాల వ్యవధిలో లెబనాన్‌లోని పలు ప్రదేశాలపై సుమారు 100 ఎయిర్ స్ట్రయిక్స్ చేసింది. ఈ దాడుల్లో వందల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. క్షతగాత్రుల హాహాకారాలతో అక్కడి పరిస్థితులు దారుణంగా మారాయి. 1982 తర్వాత లెబనాన్‌పై ఇదే అతిపెద్ద దాడి అని స్థానిక అధికారులు పేర్కొన్నారు.

## కాల్పుల విరమణ లెబనాన్‌కు వర్తించదు

టెల్అవీవ్(జనంసాక్షి):అమెరికా– ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పందించారు. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మద్దతిస్తామన్నారు. అయితే, ఈ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని స్పష్టంచేశారు. నెతన్యాహు కార్యాలయం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.హర్మూజ్ జలసంధిని ఇరాన్ తిరిగి తెరవడం, ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపై దాడులు నిలిపివేయడం వంటి షరతులకు లోబడి.. రెండు వారాల కాల్పుల విరమణకు ట్రంప్ తీసుకున్న నిర్ణయానికి మద్దతిస్తున్నట్లు పేర్కొంది. దీంతోపాటు ఇరాన్ అణు, క్షిపణి, ఉగ్రవాదం నుంచి ప్రపంచానికి ముప్పు కలగకుండా అమెరికా చేస్తున్న ప్రయత్నాలను సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఇరాన్‌తో జరగబోయే చర్చల్లో.. యూఎస్, ఇజ్రాయెల్, దాని మిత్రదేశాల లక్ష్యాలను సాధించేందుకు తాము కట్టుబడి ఉన్నామని అగ్రరాజ్యం తమకు హామీ ఇచ్చినట్లు వెల్లడించింది. అయితే, ఈ కాల్పుల విరమణ లెబనాన్ కు వర్తించదని తేల్చి చెప్పేసింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటన ఇందుకు విభిన్నంగా ఉంది. అమెరికా– ఇరాన్ అంగీకరించిన కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌కు కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

లెబనాన్‌పై దాడులు..

లెబనాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. దక్షిణ లెబనాన్‌లోని ఓ నగరం లక్ష్యంగా ఐడీఎఫ్ దళాలు దాడులు చేశాయి. తమ మిత్రదేశాలపై కూడా ఎలాంటి దాడులు చేయకూడదని ఇరాన్ ప్రతిపాదించిన తన 10 పాయింట్‌లలో పేర్కొంది. అయినప్పటికీ.. ఇజ్రాయెల్ తన దాడులను కొనసాగించడం గమనార్హం.

# మతంలోని మూఢనమ్మకాలను గుర్తించే అధికారం మాకు ఉంది

మూఢనమ్మకమని భావించినప్పటికీ, దానిని నిర్ధరించాల్సింది కోర్టు కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25(2)(బి) ప్రకారం చట్టసభలు (లెజిస్లేచర్) మాత్రమే సంస్కరణ (రిఫార్మ్‌లా) చట్టాలను తీసుకురావాల్సి ఉంటుంది. ఎలా అంటే, ఒక నిర్దిష్ట ఆచారం మూఢనమ్మకం అని, దానికి సంస్కరణ అవసరమని శాసనసభలు చెప్పవచ్చు. చేతబడి లాంటి ఆచారాలను నిరోధించడానికి ఇప్పటికే అనేక చట్టాలు ఉన్నాయి" అని పేర్కొన్నారు.మెహతా వాదనపై జస్టిస్ అమానుల్లా స్పందిస్తూ, "ఏదైనా మతాచారం మూఢనమ్మకమా, కాదా అని నిర్ణయించే హక్కు న్యాయస్థానానికి ఉంది. ఆ తర్వాత ఏం చేయాలనేది శాసనసభ చూసుకుంటుంది. కానీ శాసనసభ నిర్ణయమే అంతిమం అని కోర్టులో చెప్పలేరు" అని పేర్కొన్నారు.దీనిపై మెహతా స్పందిస్తూ, "మీరు లా విషయంలో నిపుణులు. మత విషయాల్లో కాదు. కనుక ఒక ఆచారాన్ని కేవలం మూఢనమ్మకంగా కోర్టు తేల్చలేదు. మనం ఎంతో వైవిధ్యమైన సమాజంలో ఉన్నాం. నాగాలాండ్?లో మతపరమైన అంశంగా భావించేది, నాకు మూఢనమ్మకంగా అనిపించవచ్చు. మహారాష్ట్రలో 'బ్లాక్ మ్యాజిక్? చట్టం' ఉంది. అది మా ప్రాంతంలో ఉన్న ఆచారం, అందుకే మేము దానిని ఆర్టికల్ 25(2)(బి) కింద రక్షిస్తామని వారు అనవచ్చు" అని వాదించారు.

### నాదర్‌గుల్ భూముల్లో వాటా రాకపోవడంతోనే

# హరీశ్ దుష్ప్రచారం

నా కుటుంబ సభ్యులు ఉన్నారని నిరూపించాలని సవాల్ చేస్తున్నా. వట్టి నాగులపల్లి భూముల్లోనూ హరీశ్ రావు పూర్తిగా దుష్ప్రచారం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివాదాన్ని కూడా ఈ ప్రభుత్వానికి అంటగట్టారని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేయడమే బీఆర్ఎస్ నేతలు పనిగా పెట్టుకున్నారంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిలో అవకతవకలని ఉప ముఖ్యమంత్రిపై తప్పుడు ప్రచారం చేశారని అన్నారు. సన్న బియ్యం పట్ల ప్రజల్లో వచ్చిన ఆదరణ జీర్ణించుకోలేక పౌర సరఫరాలో అవినీతి అంటూ మంత్రి ఉత్తమ్ పై మరో పుకారు పుట్టించారని అన్నారు. లిక్కర్ బాటిల్స్ కి వేసే స్టిక్కర్ల విషయంలో, టెండర్ల విషయంలో అవకతవకలు అంటూ లిక్కర్ విషయంలో ఎక్సయిజ్ శాఖ మంత్రి జూపల్లి మీద కూడా అదే రకంగా నిందలు వేశారని మండిపడ్డారు. దేశంలో కొన్ని రాష్ట్రాల్లో చేపట్టే హ్యామ్ సిస్టంలో రోడ్ల నిర్మాణం చేపడితే... బీఆర్ఎస్ ఉనికికి ప్రమాదం వస్తుందని.. మంత్రి కోమటిరెడ్డిపై తప్పుడు ప్రచారం చేశారని.. క్రషర్లు అంటూ తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని పొంగులేటి అన్నారు. ఇలా ప్రతి మంత్రి మీద తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల మీద ఉన్న బురదను ప్రభుత్వం మీద చల్లితే..వారు శుభ్రంగా ఉంటామని భ్రమలలో బతుకుతూ అసత్యాలని నిజాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు.

# ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీకి రూ.41వేలకోట్లు

ప్రదేశ్‌లోని కమ్లే, క్రా దాది-కురుంగ్ కుమే జిల్లాల్లో రూ.26,069.50 కోట్లతో 1720 మెగావాట్ల ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు 96 నెలల్లో పూర్తవుతుందని అంచనా వేశారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో 1200 మెగావాట్ల కళాయి–2 హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.14,105.83 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

## కొత్త పార్టీతో సామాన్యులకు అండగా నిలుస్తాం

గౌంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు చేరారు. కందువా కప్పి జాగృతిలోకి కవిత ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. రాసి పెట్టుకోండి.. తెలంగాణ భవిష్యత్, చరిత్రను మార్చే రోజు ఏప్రిల్ 25 అవుతోందని కవిత ఉద్ఘాటించారు. కొత్త నెత్తురు, కొత్త రాజకీయాలను ఈ గడ్డకు పరిచయం చేస్తానని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తాం, పోరాడుతాం, పరిష్కరిస్తామని చెప్పుకొచ్చారు. పప్పన్నం తింటాం, ప్రజల మధ్యలో ఉంటామని.. వారితోనే కలిసి పనిచేస్తామని మాటిచ్చారు. సామాన్యులతో, సామాన్యుల కోసం, సామాన్యులే ఉండేలా రాజకీయం తెస్తామని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అధికార పక్షం కాంగ్రెస్, ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. ప్రజల సమస్యల గురించి ప్రశ్నించేదెవరు అంటే ప్రతినోట జాగృతియే అనే మాట వస్తోందని చెప్పారు. ప్రజల సమస్యల గురించి కాంగ్రెస్ హై కమాండ్‌ని పైసలు అడిగితే నో రాహుల్ జీ అని రేవంత్‌రెడ్డికి సమాధానం చెబుతున్నారని అన్నారు. కానీ కేరళ ఎన్నికల కోసం ఎంత ఖర్చయినా పెడుతున్నారని విమర్శించారు. అప్పర్ తుంగభద్రకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇస్తే రేవంత్‌రెడ్డి ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు.

# కాల్పుల విరమణ

కొనసాగుతోన్న భీకర దాడులకు ఎట్టకేలకు బ్రేక్ పడింది. రెండు వారాల పాటు కాల్పుల విరమణకు ఒప్పందం జరిగింది. దీనిపై తాజాగా అమె రికా అధ్యక్షుడు ట్రంప్ తన సోషల్ మీడియా వేదికగా స్పందిం చారు. ప్రపంచ శాంతికి ఇదో గొప్ప రోజు అంటూ ఆయన రా సుకొచ్చారు."పశ్చిమాసియాలో ఇది సువర్ణాధ్యాయం కాబోతోం ది. ఇరాన్‌కు ఇక చాలు అనిపించింది. అంతేకాకుండా ప్రపం చం మొత్తం కూడా యుద్ధం ఆగిపోవాలనే కోరుకుం టోంది. హర్మూజ్ జలసంధిని తిరిగి అందుబాటు లోకి తెచ్చేందుకు ఇరాన్‌కు అమెరికా సాయం చేస్తుంది. సానుకూల చర్యలు చేపట్టి వాణిజ్యపరంగా ముందడుగు వేసేందుకు ఇదో గొప్ప అవకాశం. ఇక ఇరాన్‌తమ దేశాన్ని పునర్నిర్మించుకునే పనిని మొదలుపెట్టొచ్చు. ఇవన్నీ సవ్యంగా సాగేందుకు అమెరికా తప్పకుండా కృషి చేస్తుంది. మా దేశం లాగానే ఇరాన్‌కు కూడా మంచి రోజులు రానున్నాయి" అని ట్రంప్ పేర్కొన్నారు.

**ఇరాన్‌కు సర్దిచెప్పిన చైనా..**

ఇదిలాఉండగా.. అమెరికాతో కాల్పుల విరమణ చేసుకునేలా ఇరాన్‌ను చైనా ఒప్పించినట్లు వార్తలు వస్తున్నాయి. వీటిని తాను కూడా నమ్ముతున్నట్టు ట్రంప్ తెలిపారు. 'టెహ్రాన్‌ను కాల్పుల విరమణపై చర్చలకు ఒప్పించడంలో బీజింగ్ ప్రమేయం ఏమైనా ఉందా?' అని ట్రంప్‌ను ప్రశ్నించగా 'నేను కూడా విన్నాను. అవుననే అనుకుంటున్నా' అంటూ పేర్కొన్నారు. .

**సాయుధ దళాల పర్యవేక్షణలో హర్మూజ్‌లో రాకపోకలు: ఇరాన్**

అమెరికా అంగీకరించిన రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ సమ్మతించింది. పాక్ ప్రధాని అభ్యర్థన మేరకు అమెరికాతో చర్చలకు అంగీకరిస్తున్నామని వెల్లడించింది. సోదరభావంతో యుద్ధం ముగింపునకు కృషి చేస్తున్న పాక్‌కు ఇరాన్ కృతజ్ఞతలు తెలిపింది. సాయుధ దళాల పర్యవేక్షణలో 2 వారాలపాటు హర్మూజ్‌లో రాకపోకలు సాగుతా యని పేర్కొంది. ఈ విరామం కేవలం దౌత్యపరమైన చర్చల కోసమేనని, యుద్ధం శాశ్వతంగా ముగిసినట్లు కాదని ఇరాన్ స్పష్టం చేసింది.

**ఇరాన్‌కు 2 వారాలు గడువు ఇవ్వండి..**

హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు విధించిన గడువును పొడిగించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కోరారు. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలకు పాక్ మధ్యవర్తిత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఇరాన్‌కు 2 వారాలు గడువు ఇవ్వాలని ట్రంప్‌ను షరీఫ్ కోరారు. ఈ గడువులోపు హర్మూజ్ జలసంధిని తెరవాలని ఇరాన్‌కు పాక్ సూచించింది. "శాంతియుత పరిష్కారం కోసం జరుగుతున్న దౌత్య ప్రయత్నాలు స్థిరంగా, బలంగా, శక్తిమంతంగా కొనసాగుతున్నాయి. త్వరలో ఇవి గణనీయమైన ఫలితాలు సాధించే అవకాశాలున్నాయి. దౌత్య ప్రయత్నాలు కొనసాగించడానికి వీలుగా.. ఇరాన్‌కు విధించిన గడువును మరో రెండు వారాల పాటు పొడిగించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను మనస్ఫూర్తిగా అభ్యర్థిస్తున్నాను"అని షరీఫ్ పేర్కొన్నారు.పాక్ ప్రధాని అభ్యర్థనపై వైట్‌హౌస్ స్పందించింది. ఇరాన్‌కు సంబంధించి తదుపరి ప్రణాళికలు కేవలం దేశాధ్యక్షుడు ట్రంప్‌నకు మాత్రమే తెలుసంది. రెండు వారాల గడువు ఇవ్వాలనే ప్రతిపాదన ట్రంప్ దృష్టికి వచ్చిందని దీనిపై ఆయనే స్వయంగా స్పందిస్తారని పేర్కొంది.

ఇది యుద్ధానికి ముగింపు కాదు: మొజ్తాబా ఖమేనీ

అమెరికా– ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలో ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ కీలక ప్రకటన చేశారు. ఈ కాల్పుల విరమణ యుద్ధానికి ముగింపు కాదని స్పష్టంచేశారు. కాల్పుల విరమణ ప్రకటన అనంతరం మొజ్తాబా విడుదల చేసిన ప్రకటనను ఆ దేశ మీడియా చదివి వినిపించింది. 'ఇది యుద్ధం ముగింపునకు సంకేతం కాదు. మా వేళ్లు ఇంకా ట్రిగ్గర్ పైనే ఉన్నాయి. శత్రుదేశాలు ఏవిధంగానైనా దురాక్రమణకు పాల్పడితే.. పూర్తి బలంతో ధీటుగా స్పందిస్తాం' అని పేర్కొంది. తక్షణమే కాల్పులు నిలిపివేయాలని అన్ని సైనిక విభాగాలను సుప్రీం నేత ఆదేశించినట్లు వెల్లడించింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రతిపాదన మేరకు రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. హర్మూజ్‌ను తెరిచేందుకు ఇరాన్ అంగీకరించిందని.. దీంతో రెండు వారాల పాటు దానిపై ఎలాంటి దాడులు చేయమని స్పష్టంచేశారు. ఇరాన్‌తో శాశ్వత శాంతి ఒప్పందానికి, పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పడానికి ఈ గడువు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. హర్మూజ్ జలసంధిపై తమ నియంత్రణ కొనసాగించడం, అమెరికా విధించిన ప్రాథమిక ఆంక్షలు ఎత్తివేయడం, తమపై ఎలాంటి దురాక్రమణలకు పాల్పడకుండా ఉండటం వంటి 10 పాయింట్లను ఇరాన్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలు కూడా సానుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇరాన్ కూడా ఈ కాల్పుల విరమణకు అంగీకారం తెలిపింది.

**నౌకలు హర్మూజ్ దాటడానికి ఎలాంటి టోల్ ఫీజ్ వద్దు: ఒమన్**

నౌకలు హర్మూజ్ జలసంధిని దాటడానికి ఎలాంటి టోల్ ఫీజ్ వద్దని ఒమన్ తేల్చిచెప్పింది. ఇరాన్ చేసిన ప్రతిపాదనను ఆ దేశం వ్యతిరేకించింది. హర్మూజ్‌కు ఇరువైపులా ఉన్న ఈ రెండు దేశాలు.. టోల్ విధించే విషయంపై చర్చించాయి. అనంతరం జలసంధిని దాటే నౌకలపై ఎలాంటి రుసుము విధించబోమని హామీ ఇచ్చే ఒప్పందాలపై ఒమన్ ప్రభుత్వం సంతకాలు చేసినట్లు ఆ దేశ రవాణా శాఖ మంత్రి వెల్లడించారు. .

**అటు కాల్పుల విరమణ.. ఇటు క్షిపణి దాడులు**

టెహ్రాన్(జనంసాక్షి):అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ.. పశ్చిమాసియాలోని పలు ప్రాంతాల్లో దాడులు కొనసాగడం ఆందోళన రేకెత్తిస్తోంది. తమ దేశానికి చెందిన లావన్ ద్వీపంపై బుధవారం దాడులు జరిగినట్లు ఇరాన్ వెల్లడించింది. ఈ దీవిలోని చమురు శుద్ధి కేంద్రాన్ని శత్రువులు లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. ఈ దాడి కారణంగా ఆయిల్ రిఫైనరీలో మంటలు చెలరేగాయని, అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఇరాన్ మీడియా కథనాలు వెల్లడించాయి. దాడిలో ఆస్తి, ప్రాణ నష్టం వివరాలు తెలియరాలేదు. మరోవైపు ఈ దాడులు ఎవరు చేశారన్న దానిపై కూడా స్పష్టత లేదు.

**కువైట్‌లోనూ దాడులు..**

అటు కువైట్‌లోని పలు చమురు, విద్యుత్ క్షేత్రాల పైనా బుధవారం దాడులు కొనసాగాయి. దాదాపు 28 ఇరాన్ డ్రోన్లను తమ గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకుందని కువైట్ రక్షణ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. చమురు శుద్ధి కేంద్రాలు, విద్యుత్ ప్లాంట్లపై డ్రోన్ దాడులు జరగడంతో భారీ నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని కొన్ని ప్రాంతాలపై క్షిపణి దాడులు జరిగాయి. వీటిని సమర్థంగా అడ్డుకున్నట్లు ఆ దేశ అధికారులు వెల్లడించారు. కాల్పుల విరమణకు ఒప్పందం జరిగిన అనంతరం కూడా ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గందరగోళానికి దారితీసింది.

## ఇరాన్‌కు ఆయుధాలిస్తే 50శాతం టారిఫ్‌లు

**వాషింగ్టన్(జనంసాక్షి):**ఇరాన్‌తో కాల్పుల విరమణ అనంతరం ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. టెహ్రాన్‌కు ఆయుధాలు సరఫరా చేసే దేశాలపై 50శాతం సుంకాలు విధిస్తానని ప్రకటించారు. ఇరాన్‌కు ఆయుధాలిస్తూ తమ దేశానికి ఉత్పత్తులు ఎగుమతి చేసే దేశాలకు ఈ టారిఫ్‌లు వర్తిస్తాయన్నారు. ఇందులో ఎలాంటి మినహాయింపులు లేవంటూ ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. ఇరాన్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను ట్రంప్ ప్రయోజనకరమైన పాలనాపరమైన మార్పుగా అభివర్ణించారు.

# పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి దారితీస్తుంది

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అమెరికా– ఇరాన్ మధ్య కాల్పుల విరమణపై భారత్ స్పందించింది. ఈ సీజ్‌ఫైర్‌ను ఇరుదేశాలు అంగీకరించడాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొంది. ఈ నిర్ణయంతో పశ్చిమాసియాలో శాంతి నెలకొంటుందని ఆశిస్తున్నట్లు విదేశాంగ శాఖ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది.'అమెరికా– ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించడాన్ని మేం స్వాగతిస్తున్నాం. ఇది పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి దారితీస్తుందని ఆశిస్తున్నాం. ఉద్రిక్తతలను తగ్గించడం, నిరంతరం సంప్రదింపులు జరపడం, దౌత్యం ద్వారానే ఈ సంఘర్షణకు ముగింపు లభిస్తుందని మేము ఇంతకుముందే స్పష్టంచేశాం. ఈ యుద్ధం వల్ల ఇప్పటికే ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రపంచ ఇంధన సరఫరా, వాణిజ్య నెట్‌వర్క్‌లకు అంతరాయం కలిగింది. తాజా ఒప్పందం నేపథ్యంలో హర్మూజ్ జలసంధి మీదుగా నౌకల రవాణాకు ఏ ఆటంకం ఉండదని ఆశిస్తున్నాం' అని విదేశాంగ శాఖ పేర్కొంది. దాదాపు 40 రోజులుగా అమెరికా– ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర పోరు కొనసాగింది. దీనికి అడ్డుకట్ట వేస్తూ.. కాల్పుల విరమణకు అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. హర్మూజ్‌ను తిరిగి తెరిచేందుకు, ఈ కాల్పుల విరమణకు ఇరాన్ కూడా అంగీకారం తెలిపింది.

ఇరాన్ నుంచి తక్షణమే బయటపడండి: కేంద్రం అడ్వైజరీ

ఇరాన్‌లోని భారత పౌరులకు కేంద్రం మరోసారి అడ్వైజరీ జారీ చేసింది. వెంటనే ఆ దేశం నుంచి బయటపడాలని సూచించింది ప్రస్తుత పరిణామాల దృష్ట్యా ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. రాయబార కార్యాలయాన్ని ముందుగా సంప్రదించకుండా.. ఏ అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోకి రావొద్దని పౌరులను హెచ్చరించింది. ఇరాన్–అమెరికా రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఈ సూచనలు జారీ కావడం గమనార్హం. నిన్న రాత్రి కూడా కేంద్ర విదేశాంగశాఖ అడ్వైజరీ జారీ చేసింది. అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. ఇళ్లల్లోనే ఉండాలని, అన్ని విద్యుత్, సైనిక స్థావరాలు, బహుళ అంతస్తుల భవనాలకు దూరంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం యుద్ధం తాత్కాలికంగా ఆగడంతో స్వదేశానికి రావాలనుకునేవారికి ఇదొక అవకాశంగా మారింది.

రూటు మార్చి..భారత్‌కు ఇరాన్ చమురు

ఇంటర్నెట్ డెస్క్: యుద్ధం కారణంగా సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ ముడి చమురుపై ఆంక్షలను అమెరికా ఇటీవల ఎత్తివేసింది. దీంతో ఇరాన్ చమురు కొనుగోలుకు భారత రిఫైనరీలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల ఇరాన్ నుంచి చైనా బయల్దేరిన ఓ ఆయిల్ ట్యాంకర్ రూటు మార్చి భారత్ వైపు వస్తున్నట్లు లండన్ స్టాక్ ఎక్స్ఛేంజి గ్రూప్ షిప్పింగ్ డేటా వెల్లడించింది. దీంతో ఏడేళ్ల అనంతరం తొలిసారి ఇరాన్ చమురు భారత్‌కు రానున్నట్లు తెలుస్తోంది. అతిపెద్ద చమురు రవాణా నౌక 'జయ' మొదట ఇరాన్ నుంచి ఆగ్నేయాసియా జలాల వైపు ప్రయాణం మొదలు పెట్టింది. తన గమ్యస్థానాన్ని చైనాగా చూపించింది. తాజాగా నౌక రూటు మార్చి భారత్ వైపు వస్తోంది. ఇరాన్ నుంచి వస్తున్న ఈ చమురును ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఉపయోగించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# వనపర్తి పర్యటనకు హరీశ్‌కు గ్రీన్ సిగ్నల్

ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే, వారికి మద్దతుగా మాజీ మంత్రి అక్కడి పర్యటించి భారీ బహిరంగ సభ పెట్టాలని నిర్ణయించారు.ఈ సభకు తొలుత జిల్లా ఎస్పీ అనుమతులు ఇచ్చారు. అనంతరం అకస్మాతుగా అనుమతులు రద్దు చేస్తున్నట్లు బుధవారం నాడు ప్రకటించారు. దీనిపై ఆగ్రహించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు.. తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తొలుత అనుమతులు ఇచ్చి ఆపై నిరాకరించారంటూ పిటిషన్ వేశారు. సభకు అనుమతులు ఇప్పించాలని న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై నేడు ధర్మాసనం విచారణ చేపట్టగా.. శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందనే హరీశ్ రావుకి అనుమతి నిరాకరించినట్లు పోలీసుల తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ముందస్తు అనుమతి తీసుకున్నా చివరి నిమిషంలో నిరాకరించారని హరీశ్ రావు తరఫు న్యాయవాది తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం సభకు పర్మిషన్ ఇస్తూ ఆదేశాలిచ్చింది.

# కాళేశ్వరం మోటర్లను ధ్వంసం చేసే కుట్ర

- సరైన నిర్వహణ లేకుండా చేస్తే ఎలా?
- మంత్రి ఉత్తమ్‌కు హరీశ్ బహిరంగ లేఖ

హైదరాబాద్(జనంసాక్షి): కాళేశ్వరానికి సంబంధించి భారీ నీటిపారుదల మోటార్లను ధ్వంసం చేసే కుట్ర సాగుతోందంటూ కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ధ్వజమెత్తారు. భారీ నీటిపారుదల మోటార్లను ఇష్టానుసారంగా ఆన్, ఆఫ్ చేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.ప్రాజెక్టుల్లోని భారీ మోటార్లను నిబంధనలకు విరుద్ధంగా పదే పదే ఆన్, ఆఫ్ చేస్తూ అశాస్త్రీయంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇలా చేస్తే వైబ్రేషన్స్ వచ్చి పంపులు, ఇంప్లర్స్, మోటార్స్ పాడయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెపం నెట్టేందుకే ఉద్దేశపూర్వకంగా మోటార్లను పాడు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ పాలనాపరమైన నిర్లక్ష్యమా లేక కావాలనే చేస్తున్న కుట్రనా అని నిలదీశారు. భారీ మోటార్లు నిరంతరాయంగా నడిచేలా డిజైన్ చేసినవి, పదే పదే ఆపితే తీవ్ర నష్టం తప్పదని హరీశ్‌రావు హెచ్చరించారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులను ఇలా నిర్లక్ష్యంగా వాడటం శోచనీయమని మండిపడ్డారు. చందలాపూర్ సహా ప్యాకేజీ 6, 8, 10, 11, 12 లలో మోటార్ల ఆపరేషన్ తీరు తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. తక్షణమే మోటార్లను పదే పదే ఆన్, ఆఫ్ చేసే అశాస్త్రీయ విధానాన్ని ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ నిబంధనల ప్రకారం, డిజైన్ కు అనుగుణంగా నిరంతరాయంగా పంపులు నడిపించాలని తెలిపారు. మీ రాజకీయాల కోసం తెలంగాణ రైతుల జీవనాడి అయిన ప్రాజెక్టులతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు.

# సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా చూడకండి

విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్ని మౌలిక వసతులను వినియోగించుకుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటి వరకు సరైన విధానం లేనందున తాము ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఇందుకు నియమించామని సీఎం తెలిపారు. కంపెనీల ప్రతినిధులు ఆయనతో సమన్వయం చేసుకొని తమకు ఆసక్తి ఉన్న విద్యా, వైద్యం, జల వనరులు, నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణ ఇలా దేనికైనా సీఎస్ఆర్ నిధులు వినియోగించవచ్చని సీఎం తెలిపారు. ఇప్పటికే రహేజా గ్రూప్ రూ.50 కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50 కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10 కోట్లు విద్యాభివృద్ధికి కేటాయించేందుకు ముందుకు వచ్చాయని.. వారికి సీఎం అభినందనలు తెలిపారు. కంపెనీల ప్రతినిధులు స్పందిస్తూ సీఎస్ఆర్ నిధుల విషయంలో ఇప్పటి వరకు ఇలా ఎవరూ తమను సంప్రదించలేదని తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యా, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు వారు ఆసక్తి చూపారు.. సమావేశంలో రహేజా ఫౌండేషన్ నుంచి శ్రావణ్ కుమార్, రాంకీ ఫౌండేషన్ నుంచి దాక్షయణి ఆళ్ల, యశోద ఆసుపత్రి నుంచి డాక్టర్ గోరుకంటి సురేందర్ రావు, గోరుకంటి ఫల్గుణ్ రావు, మేఘా నుంచి సుధా రెడ్డి, అపోలో ఆసుపత్రి నుంచి అపర్ణా రెడ్డి, కామినేని భాస్కర్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి శేఖర్ రెడ్డి, ఔంఆంఓ ఫౌండేషన్ నుంచి పగిడిపాటి దేవయ్య, రుద్రమదేవి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

### జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై హైకోర్టు విచారణ

# తీర్పు 22కు వాయిదా

సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణల్లో అవకతవ కలపై విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై ఇప్పటికే కోర్టు వాదన లు విన్నది. బుధవారం తీర్పు వెలువరించాల్సి ఉండగా.. తీర్పును వాయిదా వేసింది. జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ ప్రభుత్వం 2024 మార్చి 14న జీవో 6ను జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్, ఐఏఎస్ మాజీ అధి కారి ఎస్.కె.జోషిలు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మా సనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నా రం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెల్లుబాటుపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. అయితే, ఈ వ్యవహారంపై తీర్పును ధర్మాసనం ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది. కాళేశ్వరం అవకతవకలపై విచారణ కోసం 2024 మార్చి 14వ తేదీన ప్రభుత్వం జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. ఈ జీవోను సవాల్ చేస్తూ రాష్ట్రంలోని పలువురు కీలక నేతలు, అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చేపట్టిన విచారణ ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని పిటిషనర్లు పేర్కొన్నారు. తమపై అభియోగాలు మోపే ముందు, తమ వాదనలను కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా విచారణ సాగుతోందని వారు కోర్టుకు విన్నవించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలను వెలికితీసేందుకే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కమిషన్ తన నివేదికను అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగానే సిద్ధం చేసిందని కోర్టుకు తెలిపింది. విచారణలో భాగంగా పిటిషనర్లందరికీ నోటీసులు ఇచ్చి, నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్తున్నామని, కాబట్టి ఈ పిటిషన్లను కొట్టివేయాలని ప్రభుత్వం కోరింది.చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని బెంచ్ ఇరుపక్షాల వాదనలను సుదీర్ఘంగా విన్న తర్వాత, నేడు వెలువరించాల్సిన తీర్పును ఈ నెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

# ఆదిలాబాద్‌లో అతిపెద్ద ఎయిర్‌పోర్టు

"మామునూరు ఎయిర్‌పోర్టుకు మరో 3 నెలల్లో శంకుస్థాపన చేయాలని భావిస్తున్నాం. ఆదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్‌పోర్టు ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తున్నాం. ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు అంశంపై ఇవాళ కూడా కీలక చర్చ జరిగింది. ఆదిలాబాద్‌లో అతిపెద్ద ఎయిర్‌పోర్టు నిర్మించాలని కేంద్రం భావిస్తోంది. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖకు 300 ఎకరాల భూమి కూడా ఉంది. సివిల్ ఏవియేషన్‌తో కలిసి జాయింట్ వెంచర్‌కు సిద్ధంగా ఉన్నామని రక్షణ శాఖ చెప్పింది. సైన్యానికి శిక్షణతోపాటు సివిల్ ఏవియేషన్ అవసరాల కోసం వాడాలని రక్షణ శాఖ మంత్రి చెప్పారు. ఈ నెల 17న క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలని అధికారులు నిర్ణయించారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం 450 ఎకరాలు ఇవ్వాల్సి ఉంటుంది. భూసేకరణకు ఎలాంటి ఇబ్బంది లేదని ఆదిలాబాద్ జిల్లా నేతలు చెప్తున్నారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కావాల్సిన అన్ని అనుకూలతలు ఆదిలాబాద్‌కు ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా అంతర్గాం వద్ద ఎయిర్‌పోర్టు ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం పంపించింది" అని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

# చేనేతలో టెండర్ల విధానం రద్దు చేయండి

### సిఎం రేవంత్‌కు ఎమ్మెల్సీ రమణ లేఖ

హైదరాబాద్(జనంసాక్షి): చేనేత రంగంలో ఏకీకృత టెండర్ల విధానాన్ని రద్దు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్. రమణ లేఖ రాశారు. పాత విధానంలోనే టీఎస్‌సీవో ద్వారా దుస్తులు కొనుగోలు చేయాలని కోరారు. మార్చి 11 న ఇచ్చిన జీవోను యథాతథంగా అమలు చేయాలని , విద్యార్థుల యూనిఫామ్ తయారీ కి సంబంధించిన 105 కోట్ల రూపాయల ఆర్డర్‌ను టీఎస్‌సీవోకు ఇవ్వాలన్నారు. వివిధ సంక్షేమ శాఖలకు అవసరమయ్యే దుస్తులను టీఎస్‌సీవో ద్వారానే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చేనేత రంగం అనేది కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాకుండా, వేలాది కుటుంబాల జీవనాధారమని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక అని వెల్లడించారు. ఈ రంగాన్ని కాపాడేందుకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు చేనేత కళాకారులకు, కార్మికులకు ఎంతో మేలు చేశాయని గుర్తు చేశారు.గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ సంస్థలకు చేనేత వృత్తికి సంబంధించిన ఏ వస్తువు అవసరమైనా, రాష్ట్ర చేనేత సహకార సంస్థ ద్వారా చేనేత సహకార సంఘాల నుంచి కొనుగోలు చేసే విధానం అమల్లో ఉండేదని పేర్కొన్నారు.

# బిజెపి చెప్పుచేతల్లో ఈసీ

### ఢిల్లీ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు

న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత ఎన్నికల సంఘం బిజెపి కింద పనిచేస్తోందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదని ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇసిపై తీవ్ర విమర్శలు చేశారు. బుధవారం ఉదయం తృణమూల్ కాంగ్రెస్ బృందం భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ని కలిసి.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఎన్నికలు భయరహితంగా, హింసారహితంగా, బెదిరింపులు, ప్రలోభాలు, దాడులు లేకుండా జరపాలని కోరింది. అయితే ఇసికి, టిఎంసి బృందానికి మధ్య ఏడు నిమిషాల పాటు సమావేశం జరిగింది. ఈ చర్చల్లో తాము చెప్పినవి వినకుండా ఇసి చీఫ్ జ్ఞానేశ్ కుమార్ ఇక్కడి నుంచి వెళ్లిపోండి అని అవమానించినట్లుగా టిఎంసి బృందం వెల్లడించింది. టిఎంసి బృందానికి జరిగిన అవమానంపై ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ స్పందించారు. ఎన్నికల సంఘం బిజెపికి అనుకూలం. బిజెపి చెప్పినట్టే పనిచేస్తుంది. బిజెపి నుంచి నేరుగా అందే ఆదేశాలను ఇసి తీసుకుంటుంటోందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ విషయం ఇప్పుడు బహిరంగమైంది. ఇది అత్యంత దురదృష్టకరం అని కేజ్రీవాల్ ఎక్స్ పోస్టులో ఇసిని విమర్శించారు.

## 2 బీహెచ్‌కే కాలనీల్లో దుకాణాల విక్రయాలు

- అందుబాటులో 36 కాలనీల్లోని 1400 కు పైగా షాపులు
- వచ్చే ఆదాయం ఆయా కాలనీల అభివృద్ధికే వినియోగం




**హైదరాబాద్, ఏప్రిల్8 (జనంసాక్షి) :** హైదరాబాద్ పరిసరాల్లోని క్యూర్ పరిధిలోని డబుల్ బెడ్ రూం కాలనీల్లోని 1400 కు పైగా దుకాణాలను బహిరంగ వేల ద్వారా విక్రయించే ప్రక్రియ ఏప్రిల్ 9 వ తేదీగురువారం నుంచి ప్రారంభం కానున్నది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని 36 కాలనీల్లో ఉన్న దుకాణాలను వేలం ద్వారా విక్రయించడానికి ఆయా జిల్లా కలెక్టర్లు నోటిఫికేషన్లు కూడా ఇచ్చారు. ఈ ప్రక్రియలో భాగంగా తొలుత రంగారెడ్డి జిల్లా పరిధిలోని 8 కాలనీల్లోని 273 షాపులకు ఈ నెల 9,10 తేదీల్లో వేలం ప్రక్రియను నిర్వహించ నున్నారు. వందలాది కుటుంబాలు నివసించే కాలనీల్లో, స్థానికుల అవసరాలకు అనుగు ణంగా వ్యాపార కార్యక్రమాలు నిర్వహిం చుకునేలా 60-400 చదరపు అడుగుల విస్తీర్ణంలో పలు దుకాణాలను నిర్మించారు. వీటిని ఉన్నవి ఉన్నట్లుగా అన్న ప్రాతిపదికన విక్రయిస్తున్నట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వి.పి.గౌతం తెలిపారు. వీటికి కనీస ధరలను కూడా బహిరంగ మార్కెట్ కంటే తక్కువగా నామమాత్రంగానే నిర్ధారించారు. ఆసక్తి ఉన్న వారు ఆయా కాలనీలను సందర్శించి, తమకు నచ్చిన, అనువైన దుకాణాలను ఎంపిక చేసుకోవచ్చన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు నిర్ణీత మొత్తం ధరావతు (ఇంఎండి) తో వేలం నిర్వహించే తేదీల్లో ఉదయం గం.11.00 లోగా సంబంధిత ఆర్డీవో కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవచ్చని ఆయన వివరించారు. పేదల వర్గాల ప్రజల కోసం మంచి వసతులతో, ఆహ్లాదకరమైన పరిసరాలతో అన్ని సదుపాయాలను కల్పిస్తూ ప్రభుత్వం డబుల్ బెడ్ ఇండ్ల కాలనీలను నిర్మిస్తున్నది. ఈ కాలనీల నిర్వహణ నిమిత్తం, ఈ దుకాణాల వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని వినియోగించనున్నారు.

## అర్బన్ నక్సలైట్ పేరుతో వేధింపులా?

- ప్రజాస్వామ్యం అంటూనే ప్రజలను అణచే కుట్రలు
- పోటు రంగారావుకు ఎన్‌ఐఎ నోటీసులపై గుమ్మడి ఆగ్రహం



**ఖమ్మం, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుకు ఎన్ఐఏ నోటీసులు ఇవ్వడాన్ని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఖండించారు. తాము బహిరంగ ఉద్యమాలు చేశామే తప్ప ఎక్కడా సంఘ విద్రోహ కార్యకలాపాలు నిర్వహించలేదని ఆయన అన్నారు. అలాంటి తమపై అక్రమ కేసులు పెట్టడం తప్పంటూ ఆగ్రహించారు. ఖమ్మంలోని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ కార్యాలయంలో పోటు రంగారావు, గుమ్మడి నర్సయ్య మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటు రంగారావుకు ఎన్ఐఏ నోటీలు ఇవ్వడాన్ని ఆయన తప్పుపట్టారు. ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. 'పోటు రంగారావుపై రాజద్రోహ కుట్ర కేసు ఎలా పెడతారు?. అక్రమ కేసులపై భవిష్యత్తులో నిరసన కార్యక్రమాలు చేపడతాం. ప్రజాస్వామ్య దేశం అంటూనే ప్రజలు, ప్రజల కోసం పనిచేస్తున్న వారిపై అణచివేతకు పాల్పడుతున్నారు. నక్సల్స్ రహిత దేశంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించడం దానికి సాక్ష్యం. ఎంపీ రాహుల్ గాంధీని కూడా అర్బన్ నక్సలైట్‌గా అభివర్ణిస్తున్నారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారు. సాయిబాబా అనే వికలాంగుడిని, వరవరరావును, జర్నలిస్టు మేధావులపైనా ఎన్నో అక్రమ కేసులు బనాయించారు. ఇదేనా మన ప్రజాస్వామ్యం. దేశంలో స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నాయి. మా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేసు వెనక్కి తీసుకోకుంటే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఎన్ఐఏ ఇచ్చిన నోటీసును వెనక్కి తీసుకోవాలి. కమ్యూనిస్టులు కుట్రదారులు కాదు. తమ అభిప్రాయాలను దాచుకోరు. ధనిక వర్గాలకే ప్రజాస్వామ్యం నడుస్తోంది. దశాబ్దాల కాలం నుంచి మా అభిప్రాయాలు వ్యక్తపరుస్తున్నాం. మేము ఎక్కడా కుట్రలు చేయలేదు. మాపై ఉన్న పోడు భూముల కేసులు, ఉద్యమ కేసులన్నీ కొట్టివేశారు. అయినా నిన్న మా స్వగ్రామం సూర్యాపేట జిల్లాలో మా ఇంటికి రిజిస్టర్ పోస్టు పంపారు. ఉపా, అక్రమ ఆయుధాల కేసు ఉందని.. విచారణకు రావాలని ఆ లేఖ సారాంశం. మా జీవితం ప్రజలకు, ప్రజా పోరాటాలకు అంకితం. అత్యున్నత న్యాయస్థానం క్రైస్తవులకు రిజర్వేషన్లు చెల్లవని తీర్పునిస్తే దాన్ని ఖండించాం. పౌర హక్కులను కాలరాయె?ద్దని అన్నాం. ఇది ముమ్మాటికి గొంతు నొక్కే కుట్ర అన్నారు. ఇటీవల కాలంలో గాదె ఇన్నయ్య అరెస్టయినప్పుడు తప్పు అన్నాం. అందుకే కేసు పెట్టారని మా భావన. మాట్లాడే వారు లేకుండా చేయాలనే ఈ తప్పుడు నోటీసు. అడవిలో నక్సలైట్లు అయిపోయారు.. అర్బన్ నక్సలైట్ల పేరుతో మమ్మల్ని అంతం చేయాలనా మీ కుట్రలు అంటూ మండిపడ్డారు.




## ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్ఈబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

- విద్యుత్ సంస్థలో ఒకే రూల్ ఉండాలి
- విద్యుత్ ఎస్ ఈ కార్యాలయం ముందు ఆర్టిజన్ కార్మికుల ధర్నా

**మంచిర్యాల ప్రతినిధి, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్ఈబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని,విద్యుత్ సంస్థలో అందరికీ ఒకే రూల్ అమలు చేయాలని మంచిర్యాల విద్యుత్ ఎస్ ఈ కార్యాలయం ముందు ఆర్టిజన్ కార్మికుల ధర్నా చేశారు. బుధవారం మంచిర్యాల పట్టణంలోని విద్యుత్ శాఖ ఎస్సీ కార్యాలయం ముందు ఆర్టిజన్ కార్మికులు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు .ఈ సందర్భంగా టీవీఎఈజెఎసి జిల్లా చైర్మన్ పసుల తిరుపతి, కన్వీనర్ తోట నగేష్ మాట్లాడుతూ.....మంచిర్యాల జిల్లా పరిదిలోని ఆర్టిజన్స్, వాచ్మేన్స్, వినెట్, ఆర్ సి లు ఎస్పిమం, ఫాట్ బిల్లరీ కార్మికులు, టీవీఎఈజెఎసి రాష్ట్రా నాయకత్వం ఇచ్చిన సమ్మె బాగంగా సుమారు 300 వందల కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. విద్యా అర్హతను బట్టి ఆర్టిజన్ కార్మికులను కన్వెన్షన్ చేయాలని పేర్కొన్నారు. అనుమ్యాండ్ కార్మికులను ఆర్టిజన్ కార్మికులగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పీస్ రేట్ కార్మికులకు జిఓ 11 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 2016 కంటే ముందుగా విద్యుత్ సంస్థలు పనిచేస్తున్న కార్మికులను ఆర్టిజన్ కార్మికుల గా గుర్తించాలని డిమాండ్ చేశారు. 2026 పిఆర్సి వేతన సవరణ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆర్టిజన్ కార్మికులు మహేష్ . మహేందర్, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

### హిందీ వ్యాప్తి ద్వారా జాతీయ సమైక్యతకు

# మోటూరి సత్యనారాయణ కృషి



**డా. మోటూరి సత్యనారాయణ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో గవర్నర్**

- హిందీకి ప్రోత్సాహం, జాతీయ సమైక్యతలో డా. మోటూరి సత్యనారాయణ పాత్రకు గవర్నర్ ప్రశంసలు

**హైదరాబాద్, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** దక్షిణ భారతదేశంలో హిందీ వ్యాప్తి ద్వారా జాతీయ సమైక్యతకు బలమైన పునాది వేసిన మహనీయుడు పద్మభూషణ్ దివంగత డా. మోటూరి సత్యనారాయణ అని రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. సికింద్రాబాద్ బోయినపల్లి బాపూజీ నగర్‌లోని కేంద్రీయ హిందీ సంస్థాన్ ప్రాంగణంలో బుధవారం గవర్నర్ డా. మోటూరి సత్యనారాయణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని, కేంద్రీయ హిందీ సంస్థాన్ త్రైమాసిక మ్యాగజైన్ సమన్వయ దక్షిణిలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, భాషా సేవకుడిగా డా. మోటూరి సత్యనారాయణ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. తెలుగు వ్యక్తి అయినప్పటికీ అందరినీ కలిపే, అందరికీ అర్థమయ్యే భాషగా హిందీని ఎంపిక చేసుకుని దాని ప్రాచుర్యానికి ఉత్తర భారతదేశానికి వెళ్లి ఆగ్రాలో కేంద్రీయ హిందీ సంస్థాన్ స్థాపించిన మహనీయుడు పద్మభూషణ్ డా. మోటూరి సత్యనారాయణ అని రాష్ట్ర గవర్నర్ కొనియాడారు. హిందీ ప్రోత్సాహం, జాతీయ చైతన్యానికి ఆయన చేసిన కృషి కారణంగా జైలుశిక్షలు ఎదురైనా ఆయన సంకల్పం ఏమాత్రం దెబ్బతినలేదన్నారు. భారతదేశ జాతీయ ఐక్యతకు హిందీ వ్యాప్తి అవసరమనే విశ్వాసంతో ఆయన నిరంతరం కృషి చేశారని చెప్పారు. రాజ్యాంగ సభలో భారతీయ భాషలకు గౌరవం కల్పించడంలో, హిందీని అధికార భాషగా స్థాపించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గవర్నర్ తెలిపారు. తన ఆలోచనలకు రూపమిస్తూ కేంద్ర హిందీ బోధనా మండలిని స్థాపించారని, నేటికీ ఆ సంస్థ హిందీ వ్యాప్తికి నాయకత్వం వహిస్తోందన్నారు. ఈ విగ్రహావిష్కరణ, జీవిత చరిత్ర ఆవిష్కరణ కేవలం లాంఛనప్రాయ కార్యక్రమం కాదని, భాషా సామరస్యం, జాతీయ చైతన్యానికి స్ఫూర్తిదాయకమైన ప్రతీకగా నిలుస్తుందని గవర్నర్ పేర్కొన్నారు. హిందీని ఎవరిపైనా రుద్దకుండా భావ ప్రసారానికి, సమన్వయానికి మాధ్యమంగా తీర్చిదిద్దడం ఆయన గొప్పతనమని అన్నారు. బహుభాషాల దేశమైన భారత్‌లో భాషల మధ్య గౌరవం, సామరస్యాన్ని పెంపొందించిన వ్యక్తిగా ఆయన నిలిచారని తెలిపారు. భాషా సేవయే శక్తివంతమైన జాతీయ సేవ అని, డా. మోటూరి సత్యనారాయణ ఆదర్శాలను అనుసరించి జాతీయ ఐక్యత, సంస్కృతి, భాషా పరిరక్షణకు కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెంట్రల్ హిందీ ఇన్‌స్టిట్యూట్ ఆగ్రా డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ బాబురావు కులకర్ణి, సెంట్రల్ హిందీ టీచింగ్ బోర్డ్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సురేంద్ర దుబే, డా. మోటూరి సత్యనారాయణ కుమార్తె శ్రీమతి సుజాత కుమార్ తో పాటు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిందీ సభ్యులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె

- విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మెన్ శివప్రసాద్
- విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సమ్మె ప్రారంభం




**జోగులాంబ గద్వాల (జనంసాక్షి) :** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ శివప్రసాద్ తెలిపారు. ఆర్టిసన్ ఉద్యోగులకు తక్షణమే ఏపీ ఎస్ ఇబీ రూల్స్ వర్తింపజేసి, విద్యార్హతను బట్టి కన్వర్షన్ చేయాలని, 04-12-2016 నుండి మిగిలిపోయిన కార్మికులను ఆర్టిసన్లు గా గుర్తించాలని,పీసురేటు కార్మికులకు 30 రోజుల పని దినాలను కల్పించి జీవో. నెం.11 ప్రకారం వేతనాలు అమలు చేసి తమ డిమాండ్లను పరిష్కరించే వరకు తమ సమ్మె కొనసాగుతుందని జిల్లా చైర్మన్ శివప్రసాద్ తెలిపారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్టిసన్ ఉద్యోగులు తమ విధులను బహిష్కరించి పట్టణంలోని డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం ముందు సమ్మె చేపట్టారు. పలు దఫాలుగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ధర్నాలు నిర్వహించిన కూడా విద్యుత్ యాజమాన్యం, ప్రభుత్వం తమ నాయకులతో చర్చలు జరుపకుండా డిమాండ్లను పరిష్కరించకపోవడంతో ఆర్టిసన్ ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. విద్యుత్ యాజమాన్యం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేవరకు సమ్మె కొనసాగుతుందని జేఏసీ జిల్లా కో చైర్మన్ రాజు, కన్వీనర్ రఫీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాముడు జిల్లా ఆర్టిసన్ జేఏసీ నాయకులు రామకృష్ణ,అనంత్ రెడ్డి, సతీష్, చందు, కుమార్, మద్దిలేటి, వాజీద్, లోకేష్, కొండల్, నరేంద్ర, రాఘవేంద్ర, అధిక సంఖ్యలో ఆర్టిసన్ కార్మికులు పాల్గొన్నారు.




### గోవుల అక్రమ రవాణాను

## అడ్డుకున్న వ్యక్తి

- కత్తులు, రాడ్లతో దాడి చేసిన దుండగులు

**హైదరాబాద్, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** గోవుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంద మల్లమ్మ చౌరస్తా వద్ద ఈ సంఘటన జరిగింది. గోవులను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న ప్రేమ్ కుమార్ అనే వ్యక్తి వాటిని అడ్డుకోవడానికి యత్నించాడు. ఈ క్రమంలో గోవుల వాహనం వెంట వచ్చిన కారులోని దుండగులు అతనిపై దాడికి దిగారు. కత్తులు, కర్రలు, రాళ్లతో ప్రేమ్ కుమార్‌పై ఏడుగురు వ్యక్తులు విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో ప్రేమ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. వారి నుంచి తప్పించుకుని గాయాలతో బయటపడిన బాధితుడు వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. గోవుల అక్రమ రవాణా, దాడి ఘటనపై మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గాయపడిన ప్రేమ్ కుమార్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

## నూజివీడు సీడ్స్ విన్నర్ కంపెనీతోనే అధిక దిగుబడి



**సారంగాపూర్, ఏప్రిల్ 8 (జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం లోని కౌట్ల (బి) గ్రామంలో నూజివీడు సీడ్స్ కంపెనీ మొక్కజొన్న విన్నర్ గోల్డ్ (చీవీఎ- 8413) అనే రకమును గ్రామానికి చెందిన మధుకర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రైతులతో క్షేత్ర ప్రదర్శన మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కంపెనీ ఎస్ఆర్ఎం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ నూజివీడు సీడ్స్ రైతు సేవలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు శుభకాంక్షలు తెలియజేస్తూ నూతన విన్నర్ గోల్డ్ మొక్కజొన్న వంగడం మిగతా రకాల హైబ్రిడ్ వంగడాల కంటే అధిక దిగుబడి వస్తుందన్నారు. అంతేకాకుండా విన్నర్ యొక్క ముఖ్యమైన లక్షణాలు అయినటువంటి కండే చివరి వరకు నిండడం, మంచి రంగు మరియు నాణ్యత తో కూడిన గింజలు అలాగే తెగుళ్ళని తట్టుకుని రైతుకి మంచి ఆదాయాన్ని చేకూరుస్తుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు టీఎం జయకుమార్, ఎండిఓ వివేక్, మాక్స్ ప్రెసిడెంట్ భూమారెడ్డి డైరెక్టర్లు, స్థానిక డీలర్స్,రైతులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంత సమస్యలపై మానవతా దృక్పథంతో పనిచేయండి

- మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు పెద్దపీట వేయాలి
- గిరిజన జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే ప్రభుత్వం సంకల్పం
- ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా చిత్తశుద్ధితో పనిచేయండి
- అధికారులకు దిశానిర్దేశం చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**హైదరాబాద్, ఏప్రిల్8 (జనంసాక్షి) :** గిరిజన ప్రాంత సమస్యల పరిష్కారంలో అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయాలని, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. గిరిజన జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పమని, ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం పేద గిరిజనులు నివసించే ప్రతి ప్రాంతానికి చేరుకునే త్రోవ, నివసించేందుకు గూడు , అడవుల్లో చీకట్లు తొలగించే విద్యుత్ సౌకర్యం, తాగునీటి కోసం బోర్లు వంటి ప్రాథమిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ మౌలిక సదుపాయాలే గిరిజనుల జీవన ప్రమాణాల పెరుగుదలకు పునాది అని పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలో గిరిజన ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి వివిధ జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలు, అటవీ శాఖ అధికారులు, గిరిజన ప్రాంతాల ప్రజాప్రతినిధులతో విస్తృతంగా చర్చించారు. గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం మౌలిక వసతుల కోసం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ, అమలు దశలో ఎదురవుతున్న అడ్డంకులపై మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగు పర్చాలంటే శాఖల మధ్య సమన్వయం అత్యవసరమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిరిజనుల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో, కేటాయించిన నిధులు లక్ష్యానికి చేరేలా అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. నిధులు ఉన్నా పనులు జరగక పోవడం సహించబోమని హెచ్చరించారు. అటవీ భూములు, పోడు సాగు, ఫారెస్ట్ రైట్స్ చట్టం కింద హక్కుల పత్రాల జారీ విషయంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్నారు. అటవీ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేసి సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలని సూచించారు. అవసరమైతే ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి వేగంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అటవిని నమ్ముకొని జీవిస్తున్న గిరిజనులకు వారికి కేవలం వ్యవసాయం ఒక్కటే ఆధారం కాబట్టి అటవీ చట్టం అనుసరించి వారికి ఎక్కడ వీలు అయితే అక్కడ వారికి వ్యవసాయం చేసుకునేలా సాగు భూమిని అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి అటవీశాఖ అధికారులను ఆదేశించారు. గిరిజన యువతను ప్రభావితం చేస్తున్న కుల ధ్రువీకరణ సమస్యలపై మంత్రి ప్రత్యేక చొరవ చూపారు. హైకోర్టు అడ్వకేట్ జనరల్‌తో సంప్రదించి ఎస్టీ సర్టిఫికెట్ వ్యవహారంలో శాశ్వత పరిష్కారం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ధ్రువీకరణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా సరళమైన విధానాన్ని అమలు చేయాలని సూచించారు. జిల్లాస్థాయిలో కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులు, అటవీ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక సమీక్షలు నిర్వహించి సమస్యలను స్థానికంగానే పరిష్కరించే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఇసుక రవాణా సమస్యలు గిరిజనులకు అడ్డంకి కాకూడదని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైన చోట ప్రత్యేక అనుమతులు ఇచ్చి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అలాగే తాగునీటి సమస్య నివారణకు కొత్త బోర్లు త్రవ్వడం, పాత వనరులను పునరుద్ధరించడం చేపట్టాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలని మంత్రి నిర్ణయించారు. గిరిజన గ్రామాలను స్వయంగా సందర్శించి వాస్తవ పరిస్థితులను తెలుసుకుంటానని తెలిపారు. నెలాఖరులోగా గిరిజన ప్రాంతాల్లో ముఖ్య సమస్యల పరిష్కారం దిశగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు ప్రారంభించాలని మంత్రి గడువు విధించారు. ఒక ప్రాంత సమస్యను రాష్ట్రవ్యాప్తంగా వర్తింపజేయకుండా, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ గిరిజన సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించినందుకు మంత్రిని ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్యసాచి ఘోష్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణ , ఎమ్మెల్యేలు బాలు నాయక్, రామచంద్ర నాయక్, డా. చిక్కుడు వంశీకృష్ణ, మురళి నాయక్, కోవ లక్ష్మి, అనిల్ కుమార్ యాదవ్ తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులు, డిఎఫ్ఓలు ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
9 ఏప్రిల్ 2026

## ట్రంప్, నెతన్యాహుల గర్వభంగం

# ఇరాన్‌దే జయకేతనం

ఫిబ్రవరి 28, 2026న, అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్తంగా సైనిక శక్తితో ఇరాన్ పై దాడి ప్రారంభిస్తూ, డొనాల్డ్ ట్రంప్ ప్రపంచానికి చేసిన వాగ్ధానం ఇదీ: "మేము పూర్తి చేసిన తర్వాత, మీ ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోండి. అది మీదే" . ఇరాన్ ప్రజలు తమ పాలకులపై తిరుగుబాటు చేస్తారని, దాడి ముగిసే సమయానికి తెహ్రాన్ లో కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందని అతడి ఊహ. ఐదు వారాలు గడిచాయి. ఇరాన్ పై 10,000కి పైగా అమెరికన్ దాడులు, 15,000 ఇజ్రాయెల్ బాంబులు పడ్డాయి . కానీ ట్రంప్ ఊహించిన విప్లవం ఎక్కడా చోటుచేసుకోలేదు. బదులుగా, ఆ దాడులు మరింతగా ఇరాన్ జాతీయ ఐక్యతను పటిష్ఠం చేశాయి. రాబోయే ఎన్నికల్లో ట్రంప్ ఘోర పరాజయం ఖాయమనే వాదన కేవలం రాజకీయ అంచనా మాత్రమే కాదు, అది నేటికీ ప్రతిధ్వనిస్తున్న చారిత్రక వైఫల్యాన్ని సూచిస్తుంది.

మొదటి నుంచీ ఈ యుద్ధం తీవ్రమైన వ్యూహాత్మక దురాలోచనపై నిర్మించబడింది. ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ మొస్సాడ్, ఇరాన్ అంతర్గత అశాంతిని రెచ్చగొట్టడానికి "రెవోల్ట్–బేస్డ్" వ్యూహంపై భారీగా పందెం వేసింది . అత్యున్నత నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న దాడులు ప్రజా తిరుగుబాటుకు ఉత్ప్రేరకంగా మారతాయని వారి విశ్వాసం. ఈ అంచనా ఎంత పొరబాటో ఇప్పుడు స్పష్టమవుతోంది. న్యూయార్క్ టైమ్స్ నివేదిక ప్రకారం, యుద్ధం ప్రారంభమైన మూడు వారాలకు, అమెరికన్, ఇజ్రాయెల్ బాంబులు నేలమీద పడుతుండగా ఇరాన్ ప్రజలు తమ నాయకత్వానికి వ్యతిరేకంగా తిరగబోరనే నిర్ణయాత్మక మూల్యాంకనాన్ని అమెరికా ఇంటెలిజెన్స్ ట్రంప్ కు అందించింది . విదేశీ దాడులు, ముఖ్యంగా కుర్దిష్ విభేదాల మద్దతుతో కూడిన రెజిమ్ చేంజి ప్రయత్నాలు, ఇరాన్ లోపల అత్యంత అప్రియమైనవిగా మారాయని ఆ నివేదిక నొక్కి చెప్పింది.

ఈ పొరపాటు అంచనాల ఫలితంగా, ఇప్పుడు యుద్ధ లక్ష్యాలు నిరంతరం మారుతున్నాయి. లాస్ ఏంజిల్స్ టైమ్స్ లోని ఒక కఠినమైన విశ్లేషణ ఇలా అంటోంది: "స్ట్రయిట్ ఆఫ్ హోర్ముజ్ గుండా పరిమితమైన ఓడల రాకపోకలను కూడా ట్రంప్ ఇరాన్ 'గౌరవ సూచన'గా అభివర్ణిస్తున్నారు... ఇది వ్యూహాత్మక స్పష్టత కాదు. ఇది ఒక ప్రభుత్వం విజయానికి గల ప్రమాణాలను తగ్గించుకుంటూ, భాషా వైభవంతో వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నం" . ప్రారంభంలో ఇరాన్ న్యూక్లియర్ ప్రోగ్రామ్ ను నిర్మూలించడం, రెజిమ్ మార్పు సాధించడం లక్ష్యాలుగా ఉన్నాయి. ఇప్పుడు, కొన్ని వంతెనలు కూల్చివేయడం, విద్యుత్ ప్లాంట్లను ధ్వంసం చేయడం వంటి వ్యూహాత్మక విజయాలు ప్రధానమయ్యాయి. అసలు రాజకీయ అంతిమ లక్ష్యం ఏమిటో ప్రశ్నించిన ప్రతిసారీ, ఆ లక్ష్యం మరింత కుంచించుకుపోతోంది.

ట్రంప్ బెదిరింపుల్లోని విధ్వంసకర ఛాయను చూసిన ప్రపంచ మీడియా, ఆయన నిర్ణయాలను సవాల్ చేయడంలో వెనుకాడలేదు. ఏప్రిల్ 5న, ట్రంప్ తన ట్రూత్ సోషల్ అకౌంట్లో "ఓపెన్ ది ఫ్ – ---- స్ట్రయిట్, యు క్రేజీ బా...ఆర్ , యూల్ బీ లివింగ్ ఇన్ హెల్" అంటూ అసభ్యకరమైన, మతదూషణ చేస్తూ పోస్ట్ చేశాడు . ఈ దాడికి ప్రతిగా, ఇరాన్ దౌత్య కార్యాలయాలు అద్భుతమైన తెలివైన వ్యంగ్యంతో స్పందించాయి. జింబాబ్వేలోని ఇరాన్ ఎంబసీ సింపుల్ గా "మేము తాళాలు పోగొట్టుకున్నాం" అని ట్వీట్ చేసింది . దక్షిణాఫ్రికా ఎంబసీ ఆ తమాషాను కొనసాగిస్తూ "కీ ఫ్లవర్ పాట్ కింద ఉంది" అని వ్యంగ్యంగా చెప్పింది. బల్గేరియా ఎంబసీ మాత్రం మరింత ముందుకెళ్లి, "ఎప్స్టీన్ ఫ్రెండ్స్ నీడ్ కీస్" అంటూ ట్రంప్ ఎప్స్టీన్ కేసుతో ఉన్న సంబంధాలను ప్రశ్నించింది . దక్షిణాఫ్రికా ఎంబసీ మరో అడుగు ముందుకేసి, ట్రంప్ మానసిక అస్థిరతను ప్రశ్నిస్తూ 25వ సవరణ, సెక్షన్ 4 ను అమెరికా అధికారులు పరిశీలించాలని సూచించింది . ప్రెసిడెంట్ పదవి నుండి తొలగింపుకు సంబంధించిన ఈ రాజ్యాంగ నిబంధనను ప్రతిపాదించడం ద్వారా, ఇరాన్ దౌత్యం ట్రంప్ ప్రవర్తన అమెరికా స్వంత చట్టాల ప్రకారమే ఆందోళనకరమని సూచించింది.

ఈ యుద్ధంలో మరో పెద్ద ఓటమి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుదే. యుద్ధం ప్రారంభంలో 70 శాతం ఇజ్రాయెలీలు ఇరాన్ రెజిమ్ కూలిపోతుందని లేదా బలహీనపడుతుందని నమ్మారు. నేడు, ఆ సంఖ్య కేవలం 43.5 శాతానికి పడిపోయింది . ఇరాన్ న్యూక్లియర్ ప్రోగ్రామ్ ను దెబ్బతీయగలమనే విశ్వాసం 62 శాతం నుండి 48 శాతానికి, బాలిస్టిక్ మిస్సైల్ ఆర్సెనిక్ ను నాశనం చేయగలమనే నమ్మకం 73 శాతం నుండి 57 శాతానికి పతనమైంది . ఇజ్రాయెల్ లోపలా నెతన్యాహుపై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిపక్ష నాయకుడు యాయిర్ లాపిడ్, నెతన్యాహు ప్రసంగాన్ని 'అహంకారం'గా ఖండిస్తూ, "నెతన్యాహు వ్యూహాత్మక నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. అతడు కేవలం అసమర్థుడు" అని విమర్శించాడు . దీనికి తోడు, నెతన్యాహు ప్రభుత్వం యుద్ధ సమయంలోనూ తన రాజకీయ మనుగడ కోసం వివాదాస్పద బడ్జెట్ ను ఆమోదించుకుంది – అల్ట్రా–ఆర్థడాక్స్ మిత్రులకు నిధులు కేటాయిస్తూ, విద్య, ఆరోగ్య రంగాలపై కోతలు విధించింది. 15,000 మంది సైనికుల కొరతను అంగీకరిస్తున్న సైన్యానికి ఊరట కలిగించే బదులు, మతపరమైన మినహాయింపులను కొనసాగిస్తూ నెతన్యాహు ప్రభుత్వం మరింత విభేదాలను సృష్టిస్తోంది .

ట్రంప్ చేసిన అత్యంత విధ్వంసకరమైన, నేరపూరితమైన పని ఏమిటంటే, ఇరాన్ సంస్కృతి, వారసత్వ సంపదపై దాడి. మార్చి 29 నాటికి, అమెరికా – ఇజ్రాయెల్ దాడులలో కనీసం 131 చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాలు ధ్వంసమయ్యాయని ఇరాన్ ప్రకటించింది . ట్రంప్ ప్రత్యక్షంగా "ఈ రాత్రే మొత్తం నాగరికత చనిపోతుంది" అని బెదిరించాడు . ఇది యుద్ధ నేరమే కాదు, మానవాళి మొత్తం మీద చేసిన దాడి. ఇరాన్ ఉపరాష్ట్రపతి మొహమ్మద్ రెజా ఆరెఫ్, ట్రంప్ బెదిరింపులకు చక్కని జవాబిస్తూ, "ఇరాన్ చరిత్రలో ఒక ఘట్టం మాత్రమే కాదు, ఇరాన్ స్వయంగా చరిత్ర. వేల సంవత్సరాలుగా దుష్టశక్తుల తుఫానులు, భ్రమలను తట్టుకున్న నాగరికత ట్రంప్ రాళ్లయుగపు వాక్చాతుర్యం ముందు వణకదు" అని




ప్రతిఘటించాడు . ఇరాన్ చరిత్రను రాతి యుగంలోకి నెట్టేస్తాననే బెదిరింపు, వాస్తవానికి కోల్పోయింది. అమెరికా పరువును నేలమట్టం చేసింది. 10,000 దాడులు, అనేక టన్నుల విలువైన మందుగుండు సామగ్రిని వృథా చేసుకుని, అంతర్జాతీయ వ్యవస్థలో తన నైతిక అధికారాన్ని. మనిలా టైమ్స్ లోని ఒక విశ్లేషణ ప్రకారం, ఈ యుద్ధం "స్ట్రాటజిక్ ఆటోనమీ" అవసరాన్ని నొక్కిచెబుతుంది. అమెరికా స్వంత ప్రాధాన్యతలు అకస్మాత్తుగా మారవచ్చు, దాని 'ఐరన్ డ్ కమిట్మెంట్లు' కూడా రాత్రిరాత్రికే బలహీనపడవచ్చు . ఉక్రెయిన్, ఇప్పుడు ఇరాన్ – రెండు ఫ్రంట్లలోను మందుగుండు సామగ్రిని వినియోగించుకున్న అమెరికా, దక్షిణ చైనా సముద్రంలో మరో సంక్షోభాన్ని ఎదుర్కొనే సామర్థ్యాన్ని కోల్పోయిందని ఆ విశ్లేషణ హెచ్చరిస్తుంది . చివరిగా, డొనాల్డ్ ట్రంప్ ప్రతిరోజూ చేస్తున్న అబద్ధాలు, మాట తప్పడం, చివరకు ఇరాన్ నాగరికతను ఒక రోజులో నాశనం చేస్తానన్న బెదిరింపులు – ఇవన్నీ ఇప్పుడు చరిత్ర పుటలలో ఒక పాఠంగా మారిపోయాయి. ఆ బెదిరింపులు తోకముడిచాయి. రాబోయే ఎన్నికల్లో ట్రంప్ ఘోరంగా ఓడిపోవడం ఖాయమనే విశ్లేషణ కేవలం రాజకీయ ఊహాగానం కాదు; ఇది వ్యూహాత్మక వైఫల్యం, నైతిక పతనం, ప్రపంచ వ్యాప్తంగా పెరిగిపోతున్న విరక్తి యొక్క సహజ పర్యవసానం. అమెరికా పరువు పోయింది. ట్రంప్ పరువు పోయింది. నెతన్యాహు పరువు ప్రతిష్టలు పోయాయి. కానీ అన్నిటికంటే ముఖ్యంగా, ఒక నాగరికతను రాతి యుగంలోకి నెట్టేస్తానన్న అహంకారం, ఆ నాగరికత ముందు తలవంచుకోవడం – ఇదే ఈ యుద్ధం యొక్క నిజమైన చరమగీతం.

డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.



## బడ్జెట్‌లో మీడియా రంగంపై 'నిర్వేదం'




ప్రజాస్వామ్య వ్యవస్థలో కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థలతో సమానంగా గుర్తింపు పొందినది పత్రికా రంగం. సమాజంలోని అట్టడుగు వర్గాల గొంతుకను ప్రభుత్వానికి వినిపించే జర్నలిస్టులు, నేడు తమ గొంతుకను వినేవారు లేక దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన ప్రతి బడ్జెట్ మాదిరిగానే, తాజాగా ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్ కూడా జర్నలిస్టుల ఆశలపై నీళ్లు చల్లింది. వేల కోట్ల రూపాయల కేటాయింపులు జరిగే అంకెల గారడీలో, అక్షర యోధుల సంక్షేమం అట్టడుగున పడిపోవడం గమనార్హం.

**అందని ఇళ్ల స్థలాలు..తీరని దశాబ్దాల కల**

తెలంగాణ జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లలో అత్యంత కీలకమైనది 'ఇళ్ల స్థలాలు'. ఉమ్మడి రాష్ట్రం నుండి నేటి వరకు ప్రతి ప్రభుత్వం హామీలు ఇవ్వడమే తప్ప, అమలు చేసిన దాఖలాలు తక్కువ. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జర్నలిస్టుల హౌసింగ్ కోసం ప్రత్యేక నిధుల కేటాయింపు లేకపోవడం అన్యాయానికి పరాకాష్ట. సుప్రీంకోర్టు తీర్పు సాకుతో గత ప్రభుత్వం కాలయాపన చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో నడవడం జర్నలిస్టు లోకాన్ని విస్మయానికి గురిచేస్తోంది. సొంత గూడు లేక, అరకొర జీతాలతో అద్దె ఇళ్లలో మగ్గుతున్న వేలాది మంది జర్నలిస్టుల గోడు ఈ బడ్జెట్‌లో ప్రతిబింబించలేదు.

**పెరగని కేటాయింపులు - తరిగిపోతున్న ఆశలు**

జర్నలిస్టుల సంక్షేమ నిధికి సంబంధించి గతంలో ప్రకటించిన రూ.100 కోట్ల రూపాయల కార్పస్ ఫండ్ పంపిణీలో ఇప్పటికీ స్పష్టత లేదు. అనారోగ్యంతో ఉన్న జర్నలిస్టులకు, విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు ఇచ్చే ఆర్థిక సాయం మొక్కుబడిగా మారుతోంది. పెరిగిన ధరల దృష్ట్యా, వైద్య ఖర్చుల దృష్ట్యా ఈ నిధిని కనీసం రూ.500 కోట్లకు పెంచాలని జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నా, బడ్జెట్ ప్రసంగంలో ఆ ప్రస్తావనే లేకపోవడం దారుణం.

**హెల్త్ కార్డుల 'అవస్థలు'**

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే హెల్త్ కార్డులు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రులు జర్నలిస్టుల హెల్త్ కార్డులను స్వీకరించడానికి నిరాకరిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వం ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలు. బడ్జెట్‌లో ఈ బకాయిల చెల్లింపు కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడం వల్ల, జర్నలిస్టులు అత్యవసర సమయాల్లో అప్పులపాలవ్వక తప్పడం లేదు. వర్కింగ్ జర్నలిస్టులకే కాకుండా, రిటైర్డ్ జర్నలిస్టులకు కూడా పూర్తిస్థాయి నగదు రహిత వైద్యం అందించేలా బడ్జెట్‌లో వెసులుబాటు కల్పించాల్సి ఉంది.

**అక్రిడిటేషన్ల ప్రక్రియలోనూ జాప్యం**

ప్రస్తుతం జర్నలిజం ముఖచిత్రం మారింది. సోషల్ మీడియా, వెబ్ సైట్లు, డిజిటల్ మీడియా ద్వారా వార్తలు వేగంగా అందుతున్నాయి. కానీ, ప్రభుత్వం అక్రిడిటేషన్ల జారీలో పాత పద్ధతులనే అనుసరిస్తోంది. కొత్తగా వచ్చే జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంలో, అర్హతలను నిర్ణయించడంలో స్పష్టత లేదు. దీనివల్ల వందలాది మంది ఫీల్డ్ జర్నలిస్టులు ప్రభుత్వ రాయితీలకు (బస్సు పాసులు, టోల్ మినహాయింపు వంటివి) దూరమవుతున్నారు. డిజిటల్ మీడియా జర్నలిస్టుల సంక్షేమం కోసం ఈ బడ్జెట్‌లో ఒక చిన్న ప్రకటన కూడా వెలువడకపోవడం విచారకరం.

**క్షేత్రస్థాయి జర్నలిస్టుల పరిస్థితి దారుణం**

హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయాల్లో పనిచేసే వారి కంటే జిల్లాలు, మండల కేంద్రాల్లో పనిచేసే స్ట్రింగర్లు, రిపోర్టర్ల పరిస్థితి వర్ణనాతీతం. వారికి యాజమాన్యాల నుంచి జీతాలు లేవు, ప్రభుత్వం నుండి భరోసా లేదు. కనీసం ప్రమాద బీమా సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం పూర్తిగా తన భుజాన వేసుకోకపోవడం వల్ల, క్షేత్రస్థాయిలో వార్తల కోసం ప్రాణాలకు తెగించి పనిచేసే జర్నలిస్టులు అభద్రతాభావానికి లోనవుతున్నారు.

**ప్రభుత్వానికి సూచనలు**

జర్నలిస్టుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో కనీసం రూ.500 కోట్లు కేటాయించి, దానిని ఒక స్వయం ప్రతిపత్తి గల బోర్డు ద్వారా పర్యవేక్షించాలి. జర్నలిస్టు కాలనీల నిర్మాణానికి గృహ నిర్మాణ శాఖ ద్వారా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి. 60 ఏళ్లు నిండిన జర్నలిస్టులకు గౌరవప్రదమైన పెన్షన్ అందించేలా ఒక శాశ్వత విధానాన్ని రూపొందించాలి. బకాయిలు చెల్లించి హెల్త్ కార్డులను అన్ని ఆసుపత్రులలో చెల్లుబాటు అయ్యేలా చూడాలి.

**జర్నలిస్టుల సంక్షేమం సర్కార్ బాధ్యత**

ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపే జర్నలిస్టులను శత్రువులుగా చూడకుండా, సమాజ శ్రేయస్సులో భాగస్వాములుగా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. బడ్జెట్ అంటే కేవలం అంకెల సంకలనం కాదు, అది ప్రజల ఆకాంక్షల ప్రతిరూపం. అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని బతుకుతున్న జర్నలిస్టులను విస్మరిస్తే, అది ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, అసెంబ్లీ చర్చల అనంతరం జర్నలిస్టులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని ఆశిద్దాం.



సిద్ధగౌని సుదర్శన్,
సెక్రటరీ, తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్
మొబైల్: 9701703684

## అభీష్టసిద్ధి!

వేలసంవత్సరాలక్రితమే
మనువాదులు ముంచేసారు
ప్రజలు యింకాతేరుకోలేదు!
ఆ భక్తి ఆ ముక్తి ఆ రక్తి
గుళ్ళలో భోజనాలకోసం

దైవప్రసాదమనిఎగబడటం!
ఇప్పటికీ అదే నడుస్తోంది!
మధ్యలో ఒక 'కల'వచ్చింది
దానిపేరు ప్రజాస్వామ్యం!
సోషలిస్టు సెక్యులర్
డెమోక్రాటిక్ రిపబ్లిక్
ఆ 'కల' తెల్లారిపోయింది!

మళ్ళీ మనువాదులొచ్చారు!
తంతే బూర్ల బుట్టలో పడ్డారు!
బూర్లన్నీ మనుమహారాజులవి
ఖాళీ బుట్ట మాత్రం ప్రజలది!
యధా శక్తి ప్రజలది భక్తి
పుణ్యలోకాల ముక్తి రక్తి!
యధా విధిగా దేవుడి గుళ్ళు
గుళ్ళలో దేవుడి గుగ్గిళ్ళు!

గుడిముందుముష్టిబతుకులు!
మెట్లమీద దయనీయ ముష్టి!
సూద్రులు అడుక్కుతినాలి!
దళితులు ఊరిచివరేఉండాలి!
పిట్టలదొరలు కొమ్మదాసర్లు
గంగిరెద్దులు బుడుగుజంగాలు

కోతుల్నిపాముల్ని ఆడించటం!
తీగలపై దొమ్మర విన్యాసలు!
అమానవీయ యాచనలు!
ఇంతకంటే ఎదగనివ్వరు!
అప్పటి సంగతి సరే!
ఇప్పుడూ అదే మనోభీష్టం!

స్త్రీలకు వంటిల్లే దిక్కు!
సూద్రులు సేవలు చేసు కోవాలి
సనాతనం కొనసాగాలి
ఇదే వీళ్ళ 'కొత్త' రాజ్యాంగం!
మతమనువాద ఫాసిస్టులారా!
జనాన్ని ముష్టోళ్లను చేసేసారు!
ముష్టి భారతాన్ని మిగిల్చారు!
ప్రజలరక్తంలోఉన్నదిముష్టిభక్తి!

మీ అభీష్టమే జనాభీష్టం!
అందుకే దేశానికీ దరిద్రం!
మీరు ఆడిన మైండ్ గేమ్!
ముష్టిభక్తి భక్తిముష్టి నుండి
సూద్రజనం బైటపడకుండా
మీ ఆట మళ్ళీ మొదలెట్టారు

త్రైవర్ణాల పెత్తనం మీఅభీష్టం
జనానికి ముష్టిబతుకిచ్చారు!
నాదేశానికి దరిద్రం పట్టింది
ఆ దరిద్రం మనుసంస్కృతి
సూద్రుడు నిత్యదరిద్రుడు
సైన్స్ చరిత్ర అవసరంలేదు

ఇదిముక్కోటిదేవతల రాజ్యం




భూసురులు వారి ఏజంట్లు
వీళ్లు భూలోకంలోనే ఉంటారు
మాకు పుణ్యలోకాలం టారు
మాగొర్రెలుకసాయినే
నమ్ముతాయి

వీళ్ళ పుణ్యం పుచ్చింది
మా బతుకుల్లో అజ్ఞానం మస్తు!
వాళ్ల అభీష్టసిద్ధి అస్తు!

-తమ్మినేని అక్కిరాజు, హైదరాబాద్

# రాజ్యాంగ ఆదేశిక సూత్రాలను అమలు చేయడమే మా లక్ష్యం

భారత రాజ్యాంగం ద్వారా ఎన్నో అమలు చేయవచ్చు. రాజ్యాంగం పరిధిలో కృషి చేసి సాధించాల్సినవి ఎన్నో ఉన్నాయి. ఉచిత బియ్యం , ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉచిత గృహ వసతి కల్పన , ఒంటరి మహిళలకు, వృద్ధులకు ఆసరా పథకం మొదలైనవి. వీటన్నిటిని సాధించడానికి రాజ్యాంతర శక్తులు గా, రాజ్యాంగం పరిధి వెలుపల ఉద్యమాలు, అలాంటి భావ జాలాలు అక్కర లేదు. మాకే కనక ఓటు హక్కు ఉంటే సాయుధ విప్లవం అవసరమే లేదు అని మావో స్వయంగా ఎడ్గార్ స్నో తో ఇంటర్వ్యూ చెప్పారు. మన వామ లక్షలు 1934 లో ప్రకటించిన గ్రామాలను విముక్తి చేసి నగరాలకు విస్తరించాలి అనే సాయుధ పోరాటం అనే మాటనే పట్టుకొని వేలాడు తున్నారు. 1934 తర్వాత 1935 రాజ్యాంగం వచ్చింది. అది విస్తరించుకొని 1950 రాజ్యాంగం అమలు లోకి వచ్చింది. రాజ్యాంగం లేని నాటి నినాదాలు కార్యమాలతో, వామ పక్షాలు, ఆర్ఎస్ఎస్ హిందూత్వ శక్తులు కొనసాగడం ఒక విషాద కర వాస్తవం. ఈ ఇరుపక్షాల అవగాహన మారాలి. ఆధునికంగా ఆలోచించాలి.

ఇటీవల కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం అనే నినాదం ప్రాచుర్యం పొందింది. స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వంతో కూడిన రాజ్యాంగం కోటి మంది మహిళలు కోటీశ్వరులు కాగలిగితే ఎంత పెద్ద మార్పు. వారు పారిశ్రామిక వేత్తలుగా, వ్యాపారవేత్తలుగా, ఎంటర్ ప్రెన్యూర్ లుగా కాంట్రాక్టర్లుగా, బిల్డర్లుగా, బ్యాంకర్లుగా ఎదుగుతారు. అలా ఎదగడం ద్వారా కోటీశ్వరులు. అవుతారు. వామ పక్షాలు పేదల పక్షాన, మహిళల పక్షాన, కార్మికులు, కర్షకులు, రైతు కూలీలు, అసంఘటిత వర్గాల పక్షాన, కుల వృత్తి దారుల పక్షాన గిరిజన వర్గాల పక్షాన వందేళ్లుగా ఎవన్నో ఉద్యమాలు చేసారు. నాయకత్వం అందించారు. కోట్లాదిమంది జీవితాల్లో వెలుగులు నింపారు. అయినా వారు కార్మికులను, పేదలను, ఉద్యోగులను, మహిళలను, మొదలైన వారందరినీ కోటీశ్వరులుగా మార్చుతాం, కార్మికుల స్థాయి నుండి పారిశ్రామిక వేత్తలుగా ఎంటర్ ప్రెన్యూర్ లుగా, జాతీయ బూర్జువాలుగా మనవారిని ఎదిరిస్తాం అని ఏనాడూ కనీసం నినాదాలు చేయలేదు. అనగా వారు ఉన్నచోటనే యధాతథ స్థితిలో వుండాలి. కాస్త ఎక్కువ ప్రయోజనాలు కల్గించాలి అనుకున్నారు. అందువల్ల వామ పక్షాలు, మావోయిస్టులతో సహా అందరూ యధాతథ వాదులే . వారు ఆర్గనైజ్ చేసిన ప్రజలనుండి జాతీయ బూర్జువాలను, స్లవయంగా మనమే ఎదగాలి. తద్వారా శాంతియుత పరివర్తన తో సోషలిజానికి మద్దతు ఇచ్చే మనవాళ్ళు ఎదుగుతారు అని ప్రచారం చేయలేదు. కాని నాయకుల బంధు మిత్రులు వీరి ఆసరాతో ఎదిగారు. వామ పక్షాల నేతృత్వంలోని వర్గాలు అలా ఎదిగే కార్యక్రమం తీసుకోలేక పోయింది. తద్వారా జాతీయ నాయకత్వం గా ఎదగలేక పోయారు. దీని వల్ల పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలు. , కాంట్రాక్టర్లు వామ పక్షాల నుండి తమకు పోటీ లేదని సమన్వయంతో జీతాలు సౌకర్యాలు, పెంచుకుంటూ , పార్టీ ఫండ్ ఇచ్చి ప్రత్యక్షంగా పరోక్షంగా రక్షణ కల్పించడం జరుగుతూ వస్తున్నది.

కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చుతాం, కోటి మంది సంఘటిత , అసంఘటిత కార్మికులు ను ఉద్యోగులను కోటీశ్వరులు గా, పారిశ్రామికవేత్తలుగా మార్చుతాం అని రాజ్యాంగం పరిధిలో నే ప్రకటించి చూడండి. భారత రాజకీయాల్లో ఎన్ని మార్పులు వస్తాయో గమనించండి. సరిగ్గా ఇదే పని ఆరెసెస్ , బిజేపీ వర్గాల బీసీ ఎస్సీ ఎస్టీలను వర్ణ వివక్ష కింద నలిగి పోయిన వారిని ఎదిగిస్తాం అని అన మనండి. అపుడే వారు నిజమైన హిందూ సమాజం గురించి పనిచేస్తున్న వారని అంగీకరిస్తాము. వీరు ఆ మాట అనరు. మార్వాడీ గుజరాతీ వర్ణ కుల ఆధిపత్య వర్గాలకు సేవ చేయడానికి హిందూ మతం పేరు వాడుకుంటారు.

అందువల్ల అలాంటి నినాదాలు, ఇవ్వకుండా దేవుళ్లు , ముస్లింలు, పాకిస్తాన్, చైనా దేశ రక్షణ, మన సనాతన ధర్మం సనాతన సంస్కృతి పేరిట ప్రజల చైతన్యాన్ని. పక్కదారి పట్టిస్తారు. వామ పక్షాలు సాయుధ విప్లవం అంతిమ లక్ష్యం పేరిట పక్క దారి పట్టిస్తున్నాయి. ఇలా కుడి ఎడమల రెండు పక్షాలు రాజ్యాంగం పరిధిలో ఎదిగే అవకాశాల గురించి చెప్పకుండా , వారిని ఎదగకుండా చేసి యధాతథ స్థితిని కొనసాగించే ఆందోళనలు, ఉద్యమాలు, భావ జాలాలు ప్రచారం చేస్తున్నారు. ఈ పరిమితులు వారి పరిమితి కావచ్చు వారి కుట్ర కావచ్చు. ఏదైతేనేం

అంతిమంగా స్టేటస్ కోను కొనసాగిస్తూ రాజ్యాంగ అవకాశాలు అంకోకుండా రాజ్యాంగం ను ధిక్కరిస్తూ సాగే ప్రచారం మానసిక స్థితిని నింపుతున్నారు.

**మా ప్రణాళిక - నవ భారత నిర్మాణ హామీలు**

**1. దేశ సమగ్రత మరియు రాష్ట్రాల ఏర్పాటు (ఆర్టికల్స్ 1 – 3)**

అఖండ భారత్ (ఆర్టికల్ 1): భారతదేశం, అంటే భారత్, రాష్ట్రాల యొక్క ఒక బలమైన యూనియన్‌గా ఉంటుందని మేము హామీ ఇస్తున్నాము. దేశంలోని ప్రతి అంగుళం భూభాగం మరియు ప్రతి రాష్ట్రం ఈ సమైక్య శక్తిలో భాగస్వాములుగా ఉంటాయి.నూతన రాష్ట్రాల కల సాకారం (ఆర్టికల్ 2 , 3):ప్రజా అవసరాలు, పరిపాలన సౌలభ్యం దృష్ట్యా కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేయడం, ఉన్న రాష్ట్రాల సరిహద్దులను మార్చడం లేదా పేర్లను సవరించడం వంటి పనులను పార్లమెంటు ద్వారా అత్యంత పారదర్శకంగా చేపడతాము.

**2. పౌరుల ఆత్మగౌరవం – సమానత్వ హక్కు (ఆర్టికల్స్ 12 – 18)**

ప్రభుత్వ బాధ్యత (ఆర్టికల్ 12 ‌ు 13): ప్రభుత్వం (స్టేట్) అంటే కేవలం అధికారం కాదు, అది ప్రజల సేవకుడు. ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉండే ఏ చట్టాన్నైనా రద్దు చేస్తామని, పౌరుల స్వేచ్ఛను కాపాడతామని మేము మాటిస్తున్నాము.

అందరికీ సమానత్వం (ఆర్టికల్ 14 ‌ు 15): చట్టం ముందు అందరూ సమానులే. కులం, మతం, జాతి, లింగం లేదా పుట్టిన స్థలం ఆధారంగా ఎటువంటి వివక్ష చూపని సమాజాన్ని నిర్మిస్తాము.

ఉద్యోగ అవకాశాల్లో సమానత్వం (ఆర్టికల్ 16):ప్రభుత్వ ఉద్యోగాల్లో పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తాము. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుంది.

సామాజిక రుగ్మతల నిర్మూలన (ఆర్టికల్ 17 ‌ు 18):అంటరానితనం వంటి అమానవీయ ఆచారాలను పూర్తిగా రూపుమాపుతాము. సమాజంలో హెచ్చు తగ్గులు తెలిపే బిరుదులు చిహ్నాలు తొలగించి, సామాజిక సమానత్వాన్ని పాటిస్తాము.

**3. వ్యక్తిగత స్వేచ్ఛ మరియు రక్షణ (ఆర్టికల్స్ 19 – 22)**

స్వేచ్ఛా భారత్ (ఆర్టికల్ 19):, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, శాంతియుతంగా సమావేశమవ్వడం, సంఘాలుగా ఏర్పడడం మరియు దేశంలో ఎక్కడైనా నివసించే హక్కును మేము కాపాడుతాము.

**జీవించే హక్కు (ఆర్టికల్ 21, 2):** ప్రతి పౌరుడికి గౌరవంగా జీవించే హక్కును కల్పిస్తాము. ముఖ్యంగా 6 నుండి 21 ఏళ్ల లోపు పిల్లలందరికీ




ఉచిత మరియు నిర్బంధ విద్యను ప్రాథమిక హక్కుగా అమలు చేస్తాము.

**4. దోపిడీ రహిత సమాజం (ఆర్టికల్స్ 23 – 24) నిర్మిస్తాం.**

బానిసత్వం నుండి విముక్తి (ఆర్టికల్ 23):మనుషుల అక్రమ రవాణా మరియు వెట్టిచాకిరీని పూర్తిగా నిషేధిస్తాము.

బాల్యానికి భద్రత (ఆర్టికల్ 24): 14 ఏళ్ల లోపు పిల్లలను ప్రమాదకరమైన కర్మాగారాల్లో లేదా పనుల్లో ఉంచడాన్ని నేరంగా పరిగణించి, బాలకార్మిక వ్యవస్థను అంతం చేస్తాము.

**5. మత స్వేచ్ఛ మరియు సంస్కృతి (ఆర్టికల్స్ 25 – 29)**

మత సామరస్యం (ఆర్టికల్ 25 – 28): ప్రతి ఒక్కరు తమ ఇష్టమైన మతాన్ని అనుసరించే, ప్రచారం చేసే స్వేచ్ఛను కలిగి ఉంటారు. మతపరమైన సంస్థలను నిర్వహించుకునే హక్కు మరియు పన్నుల నుండి మినహాయింపు ఉంటుంది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో బలవంతపు మత బోధన ఉండదు.

**మైనారిటీల హితం (ఆర్టికల్ 29):** అల్పసంఖ్యాక వర్గాల భాష, లిపి మరియు సంస్కృతిని కాపాడుకోవడానికి వారికి పూర్తి హక్కు కల్పిస్తాము.

ఈ వాగ్దానాలన్నీ భారత రాజ్యాంగం మనకు కల్పించిన పునాదుల మీద ఆధారపడి ఉన్నాయి. వీటిని అక్షరాలా అమలు చేయడమే మా లక్ష్యం. వెనుకబడిన వర్గాలకు సంబంధించిన 339–342 ఆర్టికల్స్‌ను మరింత శక్తివంతంగా అమలు చేస్తాం.

**సామాజిక న్యాయం, అభివృద్ధి హామీలు**

**1. విద్యా, సాంస్కృతిక మరియు రాజ్యాంగ రక్షణలు (ఆర్టికల్ 29 – 35)**

మైనారిటీల విద్యా హక్కు (ఆర్టికల్ 29 ‌ు 30):అల్పసంఖ్యాక వర్గాల భాష, లిపి మరియు సంస్కృతులను కాపాడతాము. వారు సొంతంగా విద్యా సంస్థలను స్థాపించుకుని, నిర్వహించుకునేలా పూర్తి సహకారం అందిస్తాము. ప్రభుత్వ గ్రాంట్లలో ఎటువంటి వివక్ష ఉండదు.

రాజ్యాంగ పరిహార హక్కు (ఆర్టికల్ 32): మీ హక్కులకు భంగం కలిగితే నేరుగా సుప్రీం కోర్టును ఆశ్రయించే మీ శక్తివంతమైన హక్కును మేము గౌరవిస్తాము. న్యాయం మీ ముంగిటకే వచ్చేలా చూస్తాము.

2. సంక్షేమ రాజ్యం – ఆదేశిక సూత్రాలు (ఆర్టికల్ 36 – 46)

సామాజిక భద్రత (ఆర్టికల్ 38 ‌ు 39): సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా చూస్తాము. పురుషులకు, స్త్రీలకు సమాన పనికి సమాన వేతనం అందేలా చట్టాలను కఠినతరం చేస్తాము.

గ్రామ స్వరాజ్యం (ఆర్టికల్ 40): పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేసి, గ్రామాలకు స్వయంపాలన అధికారాన్ని మరియు నిధులను నేరుగా అందిస్తాము.

**ఉపాధి, సామాజిక భరోసా (ఆర్టికల్ 41, 42, 43):** వృద్ధాప్యంలో, అనారోగ్య సమయంలో ప్రభుత్వ అండగా ఉంటుంది. కార్మికులకు కనీస వేతనం, గౌరవప్రదమైన పని వాతావరణం మరియు పరిశ్రమల నిర్వహణలో భాగస్వామ్యం కల్పిస్తాము.

**ఉమ్మడి పౌర స్మృతి (ఆర్టికల్ 44):** దేశవ్యాప్తంగా పౌరులందరికీ సమానమైన పౌర చట్టాల దిశగా అందరి ఆమోదంతో అడుగులు వేస్తాము.

**ముక్కుపచ్చలారని పిల్లల సంరక్షణ (ఆర్టికల్ 45):** ఆరేళ్ల లోపు పిల్లలందరికీ పౌష్టికాహారం మరియు ముందస్తు పాఠశాల విద్య (Early Childhood Care) అందేలా చర్యలు తీసుకుంటాము.

SC, ST & బలహీన వర్గాల విద్య, ఆర్థికాభివృద్ధి (ఆర్టికల్ 46): ఎస్సీ, ఎస్టీ ఇతర బలహీన వర్గాల విద్యా, ఆర్థిక ప్రయోజనాలను ప్రత్యేక శ్రద్ధతో కాపాడతాము. వారిని సామాజిక అన్యాయం, దోపిడీ నుండి రక్షిస్తాము.

**3. వెనుకబడిన వర్గాల సాధికారత (ఆర్టికల్ 339 – 342)**

గిరిజన ప్రాంతాల అభివృద్ధి (ఆర్టికల్ 339):షెడ్యూల్డ్ తెగలు మరియు ప్రాంతాల పరిపాలనపై ప్రత్యేక దృష్టి సారిస్తాము. గిరిజన సంక్షేమం కోసం కేంద్రం నుండి ప్రత్యేక నిధులు, పర్యవేక్షణ ఉండేలా చూస్తాము. కమిషన్ బలోపేతం (ఆర్టికల్ 340):సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల (బీజం) కష్టాలను గుర్తించి, వారి స్థితిగతులను మెరుగుప రచడానికి సాధికారిక కమిషన్ల సిఫార్సులను యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తాము.

**ఎస్సీ, ఎస్టీ జాబితాల క్రమబద్ధీకరణ (ఆర్టికల్ 341, 342):** షెడ్యూల్డ్ కులాలు మరియు తెగల జాబితాలో మార్పులు, చేర్పుల విషయంలో రాష్ట్రాల సూచనలను పరిగణనలోకి తీసుకుని, అర్హులైన ప్రతి సామాజిక వర్గానికి రిజర్వేషన్లు మరియు రాజ్యాంగ ఫలాలు అందేలా పారదర్శకంగా వ్యవహరిస్తాము.

**మా నినాదం: రాజ్యాంగ రక్షణ – అందరికీ సమాన ప్రాతినిధ్యం!**

రాజ్యాంగం కల్పించిన ఈ హక్కులు అమలుకు కృషి చేయడం రాజ్యాంగం పరిధి లోకి వస్తుంది. కనక రాజ్యాంగం వెలుపల ఉద్యమాలు దేనికి? బీజేపీ, ఆరెస్సెస్ ఇలా రాజ్యాంగం లో గల అంశాలను ఆధారంగా ఎన్నికల్లో గెలుస్తున్నారు. బీసీలు, ఎస్సీలు, వామపక్షాలు,మావోయిస్టులు వారికి ప్రాధాన్యత అనిపించిన అంశాలను తీసుకుని అధికారం లోకి రావచ్చు. ఉదాహరణకు టిఆఎస్ రెండవ మూడవ ఆర్టికల్స్ ఆధారంగా ఉద్యమించి రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసింది. అధికారం లోకి వచ్చింది.

**నవ భారత్ – ఆర్థిక వికాసం :** మా హామీ అని ఇవన్నీ రాజ్యాంగ పరిధిలోనే సాధ్యం అనిచెప్పవచ్చు. ఇలా ప్రజల్లో చైతన్యం వచ్చినపుడు భారతదేశం సమూలంగా మారడం మొదలవుతుంది.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# వెలుగుమట్ల బాధితులకు కూల్చిన చోటే అందరికీ ఇళ్ళు కట్టించాలి

**ముషీరాబాద్, ఏప్రిల్ 8 (జనం సాక్షి) :** వెలుగు మట్ల సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారం కాలేదని, అది రాష్ట్ర వ్యాపిత సమస్యగా మారక ముందే రేవంత్ సర్కార్ యుద్ధ ప్రాతిపదికన ఈ సమస్యను పరిస్కరించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ ఇంద్ర పార్క్ వద్ద గల ధర్నా చౌక్ లో సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ఖమ్మం జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య అధ్యక్షతన ప్రజా ధర్నాను నిర్వహించారు. సిపిఐ (ఎం-ఎల్ ) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జెవి చలపతిరావు, సీపీయం రాష్ట్ర నాయకులు బండారు రవి కుమార్, సిపిఐ రాష్ట్ర నాయకులు బోస్, ఎంసిపిఐ (యు )రాష్ట్ర నాయకులు వరి కుప్పల వెంకన్న, సిపిఐ (ఎం-ఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా లు మాట్లాడుతూ వెలుగుమట్ల బాధితులకు ప్రభుత్వం ఉచితంగా "కూల్చిన చోటనే అందరికీ ఇల్లు కట్టించాలని" డిమాండ్ చేశారు. కొంతమందికి ఇల్లు కట్టిస్తామని చెప్పి ,పట్టా కాగితాలు ఇచ్చి సమస్య అయిపోయిందని చేతులు దులుపుకునే విధంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరించడం అన్యాయమన్నారు. కేవలం 400



మందికి ఇల్లు కట్టిస్థామని, మిగతా 700 మంది బాధితులకి మొండి చెయ్యి చూపించడం దారుణమైన విషయం అన్నారు. వెలుగుమట్ల లోని మొత్తం 61 ఎకరాల్లో గల భూదాన్ భూమి ఏమిలేని పేదలకు, నిరుపేదలకు చెందాలని ప్రభుత్వం పై తీవ్ర ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పేదలకు నివాసం కోసం ఇండ్లను ప్రభుత్వం ఇవ్వడం అనేది బాధ్యత గా ఉండాలన్నారు. అది పేదల హక్కు అని పాలకులు, ప్రభుత్వం ఇకనైనా గుర్తించాలని తెలియ చెసారు. వెలుగుమట్ల లో పేదలందరికీ నివాస గృహాన్ని కల్పించడం కోసం జరుగుతున్న ఈ పోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు,బుద్ధి జీవులు బల పరచాలని కోరారు. ఈ ధర్నాలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, జర్నలిస్టు మన తొలి వెలుగు రఘు, కాళోజి టీవీ దాసరి శ్రీనివాస్,సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సాధినేని వెంకటేశ్వర్ రావు,ఆవూరి మధు, కె. గోవర్ధన్, పి ఓ డబ్ల్యు జాతీయ నాయకులు వి.సంధ్య, జి. ఝాన్సీ, సిఎల్‌సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ రావు. ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జతిన్ కుమార్,ప్రధాన కార్యదర్శి విజయంధర్ రావు, మూసి బచావో ఆందోళన నాయకురాలు మంజుల, తెలంగాణ ఐక్య ఉద్యమ నాయకులు దేశాయ్ కరుణాకర్ రెడ్డి, పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు మహేష్, ఏఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

## ధర్నాకు తరలిన ఆర్టిజన్ ఉద్యోగులు



**నారాయణఖేడ్, ఏప్రిల్ 8 (జనం సాక్షి) :** వివిధ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్తు ఆర్టిజన్ ఉద్యోగులు బుధవారం జోగిపేటలోని విద్యుత్తు డివిజన్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాకు ఖేడ్ నుంచి ఆర్టిజన్ ఉద్యోగులు ఆర్టిజన్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర చైర్మన్ వెంకట్ నాయక్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈసందర్భంగా వెంకట్ నాయక్ మాట్లాడుతూ ఆర్టిజన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి, పొరుగుసేవలు, ఒప్పంద పద్ధతిన పనిచేస్తున్న కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించి పీఆర్సీని అమలుచేయాలని డిమాండ్ చేశారు. తరలి వెళ్లినవారిలో సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రాజు, జోగిపేట డివిజన్ కన్వీనరు పవన్, అంబాదాస్, ఖేడ్ సబ్ డివిజన్ చైర్మన్ సాయిలు, కన్వీనర్ ప్రవీన్ కుమార్, రమేష్, మల్లేష్, శ్రీకాంత్, ఆర్టిజన్ ఉద్యోగులు ఉన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**పెబ్బేరు, ఏప్రిల్ 8 (జనం సాక్షి) :** రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే తూడి మెఘారెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. పెబ్బేరు చుట్టూ పక్కల పరిధిలో మొక్కజొన్న రైతుల సౌకర్యార్థం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను సంప్రదించి పెబ్బేరులో మొదటిసారి మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం మొక్కజొన్న రైతులకు రూ. 2400 మంచి మద్దతు ధర కల్పిస్తోందని, రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, కమిటీ డైరెక్టర్లు కాంగ్రెస్ నాయకులు ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి బహిరంగ సభను విజయవంతం చేయాలి

**రేవల్లి, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** గొల్లపల్లి రిజర్వాయర్ కోసం సర్వే చేసినప్పటికీ పక్కనే ఏదుల రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడంతో మరో రిజర్వాయర్ ఇక్కడ అవసరం లేదనే ఉద్దేశంతో రిజర్వాయర్ కు తూము ఏర్పాటు చేసి గొల్లపల్లి చీర్కపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని స్వచ్ఛందంగా విరమించుకున్నామని రేవల్లి మండల బిఆర్ ఎస్ పార్టీ నాయకులు మాజీ జెడ్పిటిసి బోర్ల భీమన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు శివరాంరెడ్డి అన్నారు. బుధవారం రేవల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండు సంవత్సరాలు దాటిందని నేటికీ గత ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం మాని రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపడతారా? లేదా అనే విషయాన్ని స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఆంధ్ర పాలకుల కన్నా దారుణంగా ఉందని విమర్శించారు. వంద రోజులు దాటిన రైతుల దీక్షకు మద్దతుగా పార్టీ నాయకులు హరీష్ రావు వస్తున్న సందర్భంగా ప్రతి గ్రామం నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనవసరపు రిజర్వాయర్ల నిర్మాణం మానుకొని ఎన్నికల ప్రచారంలో మీరు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, ప్రజలు మీ హామీలను నమ్మి ఓటు వేశారని, ఎప్పుడు నెరవేరుస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు.



కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నది మీరు బిల్లులు మంజూరు చేయకపోవడం వల్లనే ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. మా ప్రభుత్వంలో అలాంటివి సంఘటనలు జరగ లేదని అన్నారు. గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు రోడ్ల నిర్మాణాలు చేపడితే కమిషన్లు రావని ప్రాజెక్టులపై పడ్డారని వాటి నిర్మాణాలను కమిషన్ల కోసమే నిర్మిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మొదట పోలికపాడు గ్రామంలో రిజర్వాయర్ నిర్మించి, గొల్లపల్లి రిజర్వాయర్ దగ్గరికి రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి భీమన్న, మాజీ సర్పంచ్ శివరాంరెడ్డి, రేవల్లి గ్రామ ఉపసర్పంచ్ సుధాకర్ రెడ్డి, వార్డ్ మెంబర్ రాములు, పార్టీ నాయకులు సురేష్, కురుమతి రెడ్డి, శ్రీరాములు, పరమేష్ మల్లారెడ్డి, భాస్కర్ రెడ్డి, కృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కిషోర బాలికలందరికీ హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 8 (జనం సాక్షి) :** గర్భాశయ క్యాన్సర్ ను నివారించేందుకు హెచ్ పీ వీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో హెచ్ పి వి వ్యాక్సిన్, ఆసుపత్రుల నిర్వహణపై వైద్యాధికారులతోపాటు అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 14 ఏళ్లలోపు బాలికలకు గర్భాశయ క్యాన్సర్ ను నివారించేందుకు ప్రభుత్వం హెచ్ పీ వీ వ్యాక్సిన్ వేయడానికి అన్ని చర్యలు తీసుకుంటోందనీ తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో వసతి గృహాలులో ఉండే విద్యార్థినులకు ప్రతి 14 ఏళ్ల బాలికలకు హెచ్ పీ వీ వ్యాక్సిన్ వేయించేలా హెచ్ ఎం లు, వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శాఖ పరిధిలో వారి సహకారంతో హెచ్ పీ వీ వ్యాక్సిన్ వేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు.మహిళలకు వచ్చే గర్భాశయ క్యాన్సర్ ఎప్పటికీ రాకుండా ఉండేందుకు 14 - 15 సంవత్సరాల కిశోర బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఉచితంగా ఇవ్వడం జరుగుతోందని ఆయన తెలిపారు. ఆసుపత్రుల నిర్వహణపై కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో ఎన్ని కాన్పులు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లాలోని మక్తల్ మద్దూర్ కోస్గిలో ఆసుపత్రుల సమస్యలు ఉంటే తెలపాలని సూచించారు.ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ జయచంద్ర మోహన్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ ఫణీంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేందర్ గౌడ్,డి సిహెచ్ఎస్ మల్లికార్జున, మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ సంపత్ ,ఆర్.ఎం.ఓలు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహా భాగ్యం




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** సంపద కన్న ఆరోగ్యమే మహాభాగ్యమాన్ని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు.బుధవారం ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సురక్షిత మాతృత్వ దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వ ఆసుపత్రులలో మహిళకు గర్భ నిర్ధారణ అయినా నాటి నుండి ప్రసవమయ్యే వరకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. పూర్వకాలంలో శారీరక వ్యాయామం ఉండేదన్నారు. నేడు మారుతున్న అలవాట్లకు అనుగుణంగా శారీరక వ్యాయామం తగ్గిందన్నారు. మానసిక ఒత్తిడి ప్రతి ఒక్కరిలో చిన్న వయసులోనే పెరుగుతుందన్నారు.గర్భిణీ స్త్రీలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఆశ వర్కర్ల సహాయంతో మెరుగైన వైద్య సేవలు పొందాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో జరుగుతున్న ప్రసవాలు రంగారెడ్డి జిల్లాలో 57 శాతం ఉందన్నారు. ఎక్కువ మొత్తంలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, శిశు మరణాల రేటును పూర్తిగా తగ్గించాలని వైద్యాధికారులకు సిబ్బందికి సూచించారు. జిల్లాలో మాతృ మరణాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు.హెచ్ పివి హ్యూమన్ పాపిలోమా వైరస్ అనే వ్యాక్సిన్ జిల్లాలో 22 సెంటర్లలో ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి లలితా దేవి,పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణంపై అధికారులు స్పందించాలి

- సర్వే నంబర్ 111లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై బీఆర్ఎస్ కౌన్సిలర్‌ల ఆగ్రహం
- 12 మంది కౌన్సిలర్ల సంతకాలతో అధికారులకు ఫిర్యాదు
- కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారంటూ ఆరోపణలు

**తాండూరు, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** పట్టణంలోని ప్రభుత్వ భూమి పరిరక్షణ పై మరోసారి వివాదం నెలకొంది. పట్టణంలోని సర్వే నంబర్ 111లో ఉన్న ప్రభుత్వ విజయ విద్యాలయ ఉన్నత పాఠశాల భూమి పై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు మరియు నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా 12 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన ఫిర్యాదు పత్రాన్ని మున్సిపల్ కమిషనర్, ఆర్డీఓ, ఎమ్మార్వోలకు అందజేశారు. ఈ ఫిర్యాదులో పాఠశాల భూమి పై షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పేరుతో ఆక్రమణ జరుగుతోందని స్పష్టం చేస్తూ..బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ దీపా నర్సింలు ఆదేశాలతో అధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన విలువైన భూమిని వాణిజ్య ప్రయోజనాల కోసం



ఉపయోగించడం తీవ్రంగా ఖండించారు. కోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా ఈ నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు.ఇది ప్రజా ప్రయోజనాలకు, విద్యా వ్యవస్థకు మరియు చట్టాలకు విరుద్ధమని పేర్కొంటూ వెంటనే ఈ అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ మరియు పాఠశాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని అధికారులను కోరారు. ప్రజల ఆస్తులను కాపాడటంలో అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఈర్షాద్, జావిద్, యోగానంద్, అనిల్, నాయకులు సంతోష్ గౌడ్, రుద్రుపాటిల్, ఏజాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మూడుచింతలపల్లి పీహెచ్‌సీ తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మేడ్చల్ -మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఆయన హాజరు పట్టికలు, మందుల నిల్వ రిజిస్టర్లు, రోగుల చికిత్స రికార్డులను పరిశీలించారు. ఎటువంటి అలసత్వం లేకుండా రికార్డులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలింతలతో ముఖాముఖి మాట్లాడి వారికి అందుతున్న పౌష్టికాహారం, వైద్య సేవలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై ఆరా తీశారు. శిశువుల ఆరోగ్య సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా పని చేయాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య అధికారులు, ఆరోగ్య సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమం విషయంలో రాజీ లేదు



**కౌడిపల్లి, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా మండల కేంద్రమైన కౌడిపల్లి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఆరోపణలల్లో వాస్తవం లేదని రీజినల్ కో ఆర్డినేటర్ గంగారామ్ నాయక్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన బుధవారం నాడు కౌడిపల్లిలోని గిరిజన సంక్షేమ పాఠశాలను రీజినల్ లెవల్ కమిటీతో తనిఖీ చేసి.. విద్యార్థులందరితో మాట్లాడారు. నిధుల దుర్వినియోగం జరిగనట్టుగా వస్తున్న ఆరోపణలు పూర్తి అవాస్తవమన్నారు. విద్యార్థుల్లో క్రమ శిక్షణ లోపించిన విషయాన్ని గుర్తించామని, వారికి తగిన రీతిలో క్లాసులు బోధించి, కౌన్సిలింగ్ నిర్వహించి గాడిలో పెట్టే ప్రక్రియ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కొంత మంది విద్యార్థులు ఎవరి ప్రలోభాలకు తలొగ్గి, రెడ్డెక్కినట్టుగా దృష్టికి వచ్చిందని, ఈ విషయంలో పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. పాఠశాలలో ప్రిన్సిపల్ అనుమతి లేకుండా ప్రవేశించడాన్ని నిషేదించామని, అలా వచ్చిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సేవాలాల్ జయంతి నిధులు దుర్వినియోగం చేశారని వచ్చిన ఆరోపణలు సరికావన్నారు. ఈ విచారణ కమిటీలో సీనియర్ ప్రిన్సిపాల్ సుమతి, అమర్ సింగ్, లలితదేవి పాల్గొన్నారు.

## లేబర్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా..

**మొయినాబాద్, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** ప్రభుత్వ పరంగా కార్మికులకు అన్ని సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని శంషాబాద్ డివిజన్ లేబర్ డిపార్ట్మెంట్ ఏఎల్వో బి. వాల్యానాయక్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి తోల్కట్ట శివశంకర్ గౌడ్, జిల్లా



లెబర్ సెల్ గౌరవ అధ్యక్షురాలు జ్యోతి భీంభరత్ కలిసి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లేబర్లకు ఉన్న సమస్యలను శివశంకర్ గౌడ్ తెలియజేశారు. కార్మికులకు కార్డులు అందజేయాలని వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ద్వారా కృషి చేయాలన్నారు. భవనం, నిర్మాణ రంగంలో వని చేస్తున్న కార్మికులకు సంక్షేమానికై 1996లో చట్టం చేయబడిందన్నారు. ఈ చట్ట పరిధిలో లబ్ధిదారులుగా నమోదు కాబటిన ప్రతి ఒక్కరికి సంక్షేమ మండలి ద్వారా లబ్ధి అందేలా చూడాలని కోరారు. ప్రమాదవశాత్తు పూర్తి శాశ్వత అంగవైఖల్యం కలిగిన వారికి 5 లక్షల ఆర్థిక సహాయం, పార్శిక అంగవైఖల్యం కలిగిన వారికి నాలుగు లక్షలు అందేలా చూడాలన్నారు. ఎంప్లాయిమెంట్ కంపెన్సేషన్ యాక్టు ప్రకారం అంగవైఖల్య శాతాన్ని బట్టి ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఇలా లబ్ధిదారులకు ఉన్న సమస్యలు అందజేసేందుకు ప్రభుత్వం ద్వారా తమవంతు కృషి చేయాలని తెలిపారు. అనంతరం ఏఎల్వో బి. వాల్యానాయక్ మాట్లాడుతూ లేబర్ కార్మికుల పట్ల తనవంతు సాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఆయనను కలిసిన వారిలో

# శేరిలింగంపల్లిలో మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించండి

- సిఎంసి కమిషనంకు అరికపూడి విజ్ఞప్తి

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో రోడ్లు, రక్షిత మంచినీరు, విద్యుత్తు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిని సృజనకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మాదాపూర్‌లోని న్యాక్ బిల్డింగ్ - సైబరాబాద్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై కమిషనర్ సృజనతో చర్చించారు. ఇందులో భాగంగా నియోజకవర్గ పరిధిలోని ప్రధాన లింకు రోడ్ల అభివృద్ధి నిమిత్తం ప్రత్యేక వినతి పత్రాన్ని అందజేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక ప్రజానీకం నివసిస్తున్న ప్రాంతమని, అత్యధిక ట్రాఫిక్ రద్దీ కలిగిన ప్రాంతం కూడా ఇదేనన్నారు. చిన్నచిన్న అవసరాల నిమిత్తం ప్రధాన రహదారుల పైకి వచ్చినప్పుడు తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో ఆయా కాలనీవాసులు చాలా వరకు ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారని, దీనికి సమగ్ర కార్యాచరణ ద్వారా తగిన పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ రద్దీ సరళీకరణ కోసం నిర్దేశించిన లింక్ రోడ్లను త్వరితగతిన పూర్తి చేస్తే ప్రజలకు చాలా వరకు ఉపయోగంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రధానంగా మాదాపూర్ హైటెక్స్ గౌసియ కేఫ్ నుండి కొత్తగూడా హర్ష టయోట వరకు 100 ఫీట్ల రోడ్డు పనులను సత్వరమే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అపర్ణా హిల్ పార్క్ నుండి గంగారాం చెరువు వద్దగల హనుమాన్ దేవాలయం సమీపంలో ముంబై జాతీయ రహదారికి కలిపే లింక్ రోడ్డు పనులనుకూడా వెంటనే చేపట్టి ఓ కొలిక్కి తీసుకురావాలని కోరారు. ముంబాయి జాతీయ రహదారిపై బెల్ కల్వర్టు నాలానుండి శ్రీదేవి థియేటర్ రోడ్డుకు కలిపే లింక్ రోడ్డు పనులకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ వెంటనే పూర్తి చేయాల్సిందిగా వివరించారు. వీటితోపాటు నియోజకవర్గ పరిధిలోని ఆయా డివిజన్లలో అసంపూర్తిగా మిగిలిపోయిన లింక్



రోడ్లను త్వరితగతిన పూర్తి చేసి ట్రాఫిక్ రద్దీని తగ్గించాలని, వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సిఎంసి కమిషనర్‌కు అరికపూడి సూచించగా దానికి ఆమె సానుకూలంగా స్పందించి తప్పకుండా నియోజకవర్గ అభివృద్ధిలో తాను భాగస్వామిగా మారుతానని, సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రణాళికలను సమీక్షించుకొని కార్యాచరణతో ముందుకు సాగుతామని భరోసానివ్వడం జరిగిందని అరికపూడి తెలిపారు.

# పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 8 (జనం సాక్షి) :** పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని, రేషన్ షాపులు నిర్వహణ అత్యంత పారదర్శకంగా . నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. బుధవారం, జిల్లాలోని రామాయంపేట గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని దామరచెరువు గ్రామంలో రేషన్ షాపును జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ముందుగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అందిస్తోన్న మౌలిక వసతులు, బోధన విధానం, ఉపాధ్యాయుల హాజరు, తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు అవుతుందో.. లేదో.. పర్యవేక్షించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే భోజన శాలను పరిశీలించి, ఆహారం నాణ్యత, వంటశాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రధానంగా గుడ్ల నాణ్యతను పరీక్షించి, వంట సామాగ్రి, సరుకులు, బియ్యం తదితరాలను తనిఖీ చేసి, గడువు తేదీలను సరిచూసుకోవాలన్నారు. పాఠశాల పరిసరాలు, తాగునీరు,



మరుగుదొడ్లు, మూత్రశాలలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. అదే విధంగా ప్రతి తరగతి గదిని సందర్శించి, విద్యార్థులకు బోధన చేశారు. ఈనెల 12వ తారీకు పదవ తరగతి సోషల్ ఎగ్జామ్ ఉన్న కారణంగా సోషల్ సబ్జెక్టు పై అక్షాంశాలు ,రేఖాంశాలు నిశితంగా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులభ విధానాల ద్వారా కలెక్టర్ బోధించారు. అలాగే విద్యార్థులలో పాఠ్యాంశాలపై అవగాహన పెంచే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ సబ్జెక్టు పై విద్యార్థులు బోర్డు మీద ఉదాహరణలతో బోధించాలన్నారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా జిల్లా కలెక్టర్ మాట్లాడి, పాఠ్యాంశాలను చదివించి, అందులోని ప్రశ్నలు అడుగుతూ, వారి బోధన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ మేరకు చదువుపై ఆసక్తి పెంచుకునేలా ప్రోత్సహించారు. అంతేకాకుండా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి,. పరీక్షల సమయంలో సరైన ఆహారం తీసుకోవాలని, కంటినిండా నిద్ర పోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పట్టుదలతో కష్టపడి చదివి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. రేషన్ షాపును పరిశీలించి స్టాక్ వివరాలు, లబ్ధిదారులకు మూడు నెలల రేషన్ సక్రమంగా అందుతుందా లేదా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన 99 ప్రగతి ప్రణాళికలో భాగంగా రామాయంపేటలో విస్తృతంగా పర్యటించడం జరిగిందని తెలిపారు రేషన్ కార్డులు కలిగిన లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ పారదర్శకంగా జరుగుతుందని ఎటు వంటి సమస్యలకు తావు లేకుండా పౌరసరఫరాల శాఖ అధికారులు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. ఈ పరిశీలనలో రామాయంపేట తాసిల్దార్ రజని , కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కోసం బారులు తీరిన వినియోగదారులు



**పుల్కల్, ఏప్రిల్ 8 (జనం సాక్షి) :** స్మరణ సాయి గ్యాస్ ఏజెన్సీ వద్ద గ్యాస్ కోసం బుధవారం ఉదయం నుంచి వినియోగదారులు బారులు తీరారు. గత కొద్దిరోజులుగా గ్యాస్ కొరత ఏర్పడటం తో వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు.బుధవారం ఉదయం మండల కేంద్రంలో ఉన్న గ్యాస్ ఏజెన్సీ వద్ద కు గ్యాస్ సిలిండర్ ల వాహనం వచ్చింది తెలియడంతో గ్రామస్తులే కాకుండా, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి భారీ ఎత్తున చెరుకుని క్యూలో నిలబడ్డారు.వినియోగదారులు భారీ ఎత్తున కార్యాలయానికి చేరుకున్నారని తెలుసుకున్న స్థానిక పోలీసులు కార్యాలయం వద్దకు చేరుకొని అందరికీ గ్యాస్ లు అందుతాయి ఎవరు ఇబ్బందులకు గురి కావొద్దు అంటు వినియోగదారులకు ఏ ఎస్సై వెంకటేశం నచ్చజెప్పారు.దీంతో క్యూలో నిలబడ్డ వినియోగదారులందరు సమయమనం పాటించి అందరూ గ్యాస్ లు తీసుకున్నారు.

## పక్కగా ఇండ్ల గణన బ్లాక్ తయారు చేయాలి



**మెదక్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 8 (జనం సాక్షి) :** పక్కగా ఇండ్ల గణన బ్లాక్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో జనగణన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జనగణలో భాగంగా పక్కాగా ఇండ్ల గణనా బ్లాకులు తయారు చేయాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో 9 మంది అధికారులు టీం గా ఏర్పడి క్లస్టర్ లో జరుగుతున్న గణనలో పలు సందేహాలు నివృత్తి చేస్తారని తెలిపారు. జనాభా, గ్రామ ,మండల, పట్టణ ,సరిహద్దుల పై పలు సూచనలు చేస్తారని తెలిపారు. టీం సభ్యులు, జనాభా గణాంక అధికారులు సమన్వయంతో ఇండ్ల గణన బ్లాక్ లిస్టు పక్కగా తయారు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఈడియం సందీప్, తాహాసిల్దారులు, గణాంక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లి రిజర్వాయర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

**రేవల్లి, మార్చి 9 (జనంసాక్షి) :** ఏదుల మండల కేంద్రంలోని గొల్లపల్లి చీర్కపల్లి రిజర్వాయర్ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో 101 రోజులుగా రైతులు దీక్ష చేస్తున్న ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం చాలా బాధాకరమని రేవల్లి మండల మాజీ జడ్పిటిసి బోర్ల భీమన్న, బీఆర్ఎస్ నాయకులు శివరాం రెడ్డి అన్నారు. రిజర్వాయర్ ప్రతిపాదన రైతుల కోసమా? లేక కమీషనర్ల కోసమా? అని ప్రశ్నించారు. ప్రజల కోసమే అయితే ప్రజల అనుమతి లేకుండా, ప్రజల మేలుకోరే ప్రభుత్వమే అయితే 90% పూర్తయిన ఏదుల ఎర్రగట్టు వీరాంజనేయ స్వామి రిజర్వాయర్ను పూర్తి చేయకుండా కొత్త రిజర్వాయర్ ప్రతిపాదన తేవడం సరైన విధానం కాదని అన్నారు. ప్రజల సంక్షేమం కోరే ప్రభుత్వమే అయితే రిజర్వాయర్ పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని అన్నారు. ఢిల్లీ పెద్దలకు అమరబోయే పద్ధతి సరైనది కాదని ప్రజాప్రతినిధిగా ప్రజా అవసరాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని అసలు అక్కడ రిజర్వాయర్ అవసరం ఏంటో ప్రజలకు తెలిపాలని ఎమ్మెల్యే మెగా రెడ్డికి సూటిగా ప్రశ్నించారు. ధర్నా చౌక్ లో రేపు చేపట్టబోయే భారీ బహిరంగ సభకు అనుమతులు ఇచ్చినట్టే ఇచ్చి



అర్ధరాత్రి సమయంలో ఎందుకు రద్దు చేశారని అన్నారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ నాయకులు శివరామిరెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల నిర్ణయంతో ప్రాజెక్టుపై తమ నిర్ణయం స్పష్టంగా తెలియజేయాలని అన్నారు గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు ఎవరు అడుగుతున్నారని రిజర్వాయర్ కడుతున్నారు అని అన్నారు. ఈరోజు ఏదుల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన నాయకులు కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అనడం విడ్డూరంగా ఉందని అన్నారు కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకునేది మీ ప్రభుత్వంలో బిల్లులు చెల్లించకపోవడం వలన ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల పరిపాలన ఆంధ్ర నాయకుల పాలన కంటే నీచంగా మారిందని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా బండరాయి పాకుల గ్రామంలో ముంపు బాధితులకు ఇంకా ఇవ్వవలసిన ప్లాట్ల విషయంలో శానాయపల్లి గ్రామస్తులకు ఎన్నికల సమయంలో మీ భూముల సెంటు భూములు కూడా కేటాయించమని ఎమ్మెల్యే మేఘ రెడ్డి వారికి వాగ్దానం చేశారని గుర్తు చేశారు. అలాంటప్పుడు బండరాయిపాకుల గ్రామస్తులకు ప్లాట్లు ఇవ్వడం ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. రేపు జరగబోయే మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సుధాకర్ రెడ్డి, వార్డ్ మెంబర్ టి. రాములు, తెప్ప సురేష్, కురుమత్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మిద్దె శ్రీరాములు, కృష్ణ, పరమేశు, కవిరాజు, మల్లారెడ్డి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



**చేర్యాల, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ తెలంగాణ సాంస్కృతిక సారధి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం చేర్యాల మండలం వేచరేణి గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం రోడ్డు భద్రత నియమాలు ప్రమాదాల నివారణకు ప్రజలను వాహనదారులను చైతన్య పరచగా ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పర్వాటకం వెంకటలక్ష్మి-దుర్గారెడ్డి హాజరై మాట్లాడారు. మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ తప్పకుండ వాడాలని సూచించారు. యువత గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని విలువైన జీవితాలు ఆగం చేసుకోవద్దని కోరారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు బాధ్యత నేర్పించాలని ప్రజలు మూఢనమ్మకాలను వీడాలని శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఏదైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 100 కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నవీన్ కుమార్, వార్డు సభ్యులు,సారధి బృందం టీమ్ లీడర్ శ్యామ్ సుందర్, సారధి కవి గాయకులు పిన్నింటి రత్నం, సనువాల కనకయ్య, పన్నీరు శ్రీనివాస్, గెంటే హరిప్రసాద్, ఏల్ల సిద్దులు, తండ బిక్షపతి, రాచపల్లి శైలజ తదితరులు ఉన్నారు.

# కొమురవెల్లి రైల్వే స్టేషన్‌వెంటనే ప్రారంభించాలి

**కొమురవెల్లి, ఏప్రిల్ 8 (జనం సాక్షి) :** కొమురవెల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైల్వే స్టేషన్ పనులు ప్రారంభించి మూడు సంవత్సరాలు గడిచిన పనులు పూర్తి అయి నెలలు గడుస్తున్న రైల్వే స్టేషన్‌ను ఇంకా ఎందుకు ప్రారంభించడం లేదని సిపిఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు ఈరోజు బుధవారం రోజున సిపిఎం పార్టీ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా కొమురవెల్లి లో రైల్వే స్టేషన్ పనులు ప్రారంభమైనాయని ముఖ్యంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మండలంలో ఉన్న మూడు గ్రామాల సర్పంచుల తీర్మాన లెటర్ ని రైల్వే శాఖ రీజినల్ మేనేజర్ గారికి అదేవిధంగా గత స్థానిక ఎంపీ గారికి వినతి పత్రాలు పోరాటాలు చేశామని ఆయన గుర్తు చేశారు. పోరాటాల ఫలితంగా ఏర్పాటుచేసిన



రైల్వే స్టేషన్ గత జాతరలోనే ప్రారంభిస్తామని బిజెపి నాయకులు పదేపదే అంటూ ఇక్కడ ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన అన్నారు కొమురవెల్లి మల్లన్న జాతరకి తెలంగాణ ప్రాంతంలో ఉండే కాక ఇతర రాష్ట్రాల నుండి కూడా ప్రయాణికులు వస్తారని ఈ రైల్వే స్టేషన్ ప్రారంభిస్తే అనేకమందికి ఉపయోగపడుతుందని దీనిని వెంటనే ప్రారంభించి ఈ ప్రాంత ప్రజలకి కొమురవెల్లికి వచ్చే వారికి ప్రయాణం సౌకర్యంగా ఉంటుందని ఆయన అన్నారు వెంటనే కొమురవెల్లి రైల్వే స్టేషన్ ను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్ మావో చేర్యాల కొమరవెల్లి మండల కార్యదర్శులు బండ కింద అరుణ్ కుమార్ తాడూరు రవీందర్ నాయకులు తేలు ఇస్తారి ఆముదాల రంజిత్ రెడ్డి కానుగుల రాజు తుప్పతి రాజు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి



**మల్దకల్, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** రైతులు పండించిన మొక్కజొన్న ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వంకొనుగోలు చేయాలని, వెంటనే రైతుల ఖాతాలలో రెండు మూడు రోజులలో నగదును జమ చేయాలని సిపిఐ మండల కార్యదర్శి ఎల్కూరు జి రంగన్న డిమాండ్ చేశారు.రైతులు ఆరు కాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు,ఒకపక్క రైతుల ధాన్యాన్ని వ్యాపారస్తులు కొన్నా రైతుల ఖాతాలో నెలలు గడిచిన నగదును జమ చేయడం లేదు ఇలాంటి కారణాలవల్ల రైతులు అప్పులు కట్టుకోలేక అటు కుటుంబాల ఆర్థిక పరిస్థితులను నిలదొక్కుకోలేక పెళ్లిళ్లకు అవసరమయ్యే ఖర్చుల విషయంలో రైతులు చాలా రకాలు ఇబ్బందులు పడుతున్నారని, రైతులను ఇబ్బందులకు గురికాకుండా చూడాలని ప్రభుత్వం ప్రవేటు ఆర్గనైజర్లు చూసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్దకల్ మండల కార్యదర్శి జి.రంగన్న, ఎల్కూర్ సిపిఐ సహాయ కార్యదర్శి వెంకటేష్, ఎల్కూరు మొక్కజొన్న రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా విజయవంతం



**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో డైరీ సైన్స్,లైఫ్ సైన్స్ విద్యార్థుల కోసం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతంగా నిర్వహించబడినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మదన్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాబ్ మేళాలో సుమారు 80 మంది అభ్యర్థులు పాల్గొన్నారని తెలిపారు. సిరవిన్ బయాలజికల్ లిమిటెడ్ లైబిలిటీ పార్ట్నర్షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ డ్రైవ్‌లో శంషాబాద్ ప్రాంతానికి చెందిన పలు కంపెనీలు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. అనిమల్ ఫార్మ్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్, జూనియర్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 20 మందికి పైగా అభ్యర్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారిలో డైరీ సైన్స్ మరియు లైఫ్ సైన్స్ విద్యార్థులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో లైఫ్ సైన్స్ అధ్యాపకులు కోదండరాములు, డైరీ సైన్స్ అధ్యాపకుడు దశరథం యాదవ్, అలాగే అధ్యాపకులు అంజయ్య, వనిత, ఉమాదేవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఐలాపూర్ భూముల్లో హైడ్రాకు అడుగుపెట్టే హక్కు లేదు

- హైకోర్టు న్యాయవాది ముఖీమ్
- పాల్గొన్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

**అమీన్పూర్, ఏప్రిల్ 8 (జనం సాక్షి) :** బడుగు బలహీనవర్గాల భూములపై కన్నేసిన రేవంత్ సర్కార్ హైడ్రా పేరుతో దోపిడీకి పాల్పడుతుందని హైకోర్టు న్యాయవాది ముఖిమ్ ఆరోపించారు. బుధవారం ఎమ్మార్ పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తో కలిసి ఐలాపూర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. హైడ్రా పై ధ్వజమెత్తిన న్యాయవాది ముఖీమ్ మాకు అనుకూలమైన డిక్రీ ఉందన్నారు. రెవెన్యూ అధికారులు, హైడ్రా అధికారులు ఐలాపూర్ భూములలో ప్రవేశించే హక్కు లేదన్నారు. ఐలాపూర్ భూముల్లో హైడ్రా అధికారులు తమ వాహనాలతో నిత్యం తిరుగుతూ గ్రామస్తులను ఆ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కోర్టు పరిధిలో ఉన్న ఐలపూర్ భూములపై డ్రోన్ల ద్వారా నిఘా పెట్టిన అమీన్ పూర్ రెవెన్యూ అధికారుల చర్యలను ఖండిస్తున్నామని తెలిపారు. సంవత్సరం క్రితం ఐలాపూర్ రాజగోపాల్ నగర్ పేరుతో నూతనంగా ఏర్పడిన సొసైటీ హైడ్రా అధికారి రంగనాథ్ తో కలిసి ఐలాపూర్ భూములలో భారీ భూకుంభకోణానికి తెరలేపినట్లు తమకు విశ్వసనీయ సమాచారం ఉందన్నారు. త్వరలోనే ఆ గుట్టు రట్టు



చేస్తామని అన్నారు. ఐలాపూర్ భూముల వ్యవహారంలో రిట్ అప్పీల్ పెండింగ్ ఉందని రిట్ అప్పీల్ ద్వారా హైడ్రా అధికారులు ఐలపూర్ భూముల్లోకి ప్రవేశించకూడదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ హైడ్రా అధికారి రంగనాథ్ జోక్యం తగదని హైడ్రా తన నిబంధనలకు లోబడి పనిచేయాలని సూచించారు. గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎవరూ హైడ్రాకు భయపడవద్దని న్యాయస్థానాలు మనకు రక్షణ కవచంలా ఉన్నాయని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఐలాపూర్ భూముల రైతుల పక్షాన గళం వినిపించేందుకు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. ఐలాపూర్ భూముల వ్యవహారంలో హైడ్రా, రెవెన్యూ అధికారులు నిబంధనలకు అనుగుణంగా సంయమనంతో పనిచేసే విధంగా ఆయా శాఖలను కట్టడి చేయాలని గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేయకుండా కేసులు తుది తీర్పు వచ్చేంతవరకు రైతులను ఇబ్బంది పెట్టకుండా వ్యవహరించే విధంగా ఆదేశాలు ఇవ్వాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు. కోర్టు పరిధిలో లేని వివాదాస్పదం కాని భూముల వ్యవహారంలోకి హైడ్రా, రెవెన్యూ, రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకోవద్దని ఎమ్మార్పీఎస్ తరపున విజ్ఞప్తి, సూచన చేశారు. రైతులకు ఉండే చట్టబద్ధమైన హక్కులను హైడ్రా కాలరాయొద్దని ఆ భూములలో వ్యవసాయం, నిర్మాణాలు చేసుకునే హక్కులు వారికి ఉంటాయని ప్రభుత్వాన్ని ఉద్దేశించి రైతుల తరఫున హితవు పలికారు. హైడ్రా పరిధిని ప్రశ్నిస్తూ నిబంధనలకు అనుగుణంగా ఈ సంస్థ పని చేస్తుందా లేదా అనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేయాలని కోరారు. హైడ్రా తన పరిధి మించి వ్యవహరిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో దానిని అరికట్టే బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిధిలో ఉన్నదని అన్నారు. హైడ్రా తన పరిధిని విస్మరించి వ్యవహరించదానికి రాష్ట్ర ప్రభుత్వం వెన్నంటి ఉన్నదని వినిపిస్తున్న ఆరోపణలకు అవకాశం ఇవ్వకుండా పారదర్శకతను నిరూపించుకునే అవసరం ఎంతైనా ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి మందకృష్ణ మాదిగ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐలాపూర్ రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జూలపల్లి వెంకటేశ్వర స్వామి చింతగట్టు పార్కు అభివృద్ధి పనులు ప్రారంభం



**మహమ్మదాబాద్, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** జూలపల్లి అటవిలో అభివృద్ధి పనులు ప్రారంభం. మండలంలోని, జూలపల్లి అటవీలొ చింతగట్టు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో ఉన్న పార్కును, బుధవారం నాడు అభివృద్ధి పనులను మహ్మదాబాద్ మండల్ ఫారెస్ట్ రేంజర్ అబ్దుల్ హై, డిప్యూటీ రేంజర్ రాఘవేందర్, జూలపల్లి గ్రామ సర్పంచ్,పద్మమ్మ,పార్కు పనులకు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా,ఫారెస్ట్ రేంజర్ అబ్దుల్ హై,సర్పంచ్ పద్మమ్మ మాట్లాడుతూ..చింతగట్టు వెంకటేశ్వర స్వామి ఆలయ సన్నిధిలోఉన్న పార్కుపనులను త్వరగా పూర్తిచేసి ఈపార్కును చుట్టుపక్కల ప్రజలు తరలి వచ్చి ఆనందించే విధంగా,పార్కును తీర్చిదిద్దాలి.అని అన్నారు. ఈ పార్కులో పండ్ల చెట్లను పెంచేందుకు కృషి చేస్తున్నాము పార్కును అందరూ వచ్చే చూసి ఆనందించే విధంగా ఏర్పాటు చేస్తామని, ఫారెస్ట్ రేంజర్ అబ్దుల్ హై,డిప్యూటీ రేంజర్ రాఘవేందర్ అన్నారు,కార్యక్రమంలో జూలపల్లి గ్రామ సర్పంచ్,పద్మమ్మ,వార్డు మెంబర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గుడుంబా తయారీపై కొయ్యూరు పోలీసుల మెరుపు దాడి



**భూపాలపల్లి బ్యూరో/కాళేశ్వరం ,ఏప్రిల్ 09 (జనం సాక్షి) :** భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలం కొయ్యూరు పోలీస్‌లు అక్రమ గుడుంబా తయారీపై ప్రత్యేక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా మల్హర్ మండలం కొండంపేట గ్రామానికి చెందిన కొరకాని సమ్మయ్య అక్రమంగా గుడుంబా తయారు చేస్తుండగా పట్టుబడ్డాడు. అతని వద్ద నుండి 20 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని సుమారు 600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన చీర్ల రాజేశ్వరి గుడుంబా తయారు చేస్తుండగా పట్టుబడింది. ఆమె వద్ద నుండి 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని సుమారు 50 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఈ ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ గుడుంబా తయారీ మరియు విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. కొయ్యూరు ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మండల విద్యాధికారి

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఫైల్ కోసం లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం
- రిటైర్ అవుతున్న హెచ్ఎం ఫిర్యాదుతో ఇద్దరు అరెస్ట్



**గూడూరు,ఏప్రిల్ 08(జనంసాక్షి):** ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రశంసా పత్రం పొందిన ఉపాధ్యాయుడు అంతలోనే అవినీతిమయంలో పడిపోయి ఏసీబీ వలలో చిక్కాడు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగా గ్రామం వాగ్య తండాలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న దయ్యాల రవీందర్ ఈ నెల 30న రిటైర్ కానున్న నేపథ్యంలో,ఆయనకు సంబంధించిన సర్వీస్ బుక్, మరియు పదవీ విరమణ ప్రయోజనాల కోసం అవసరమైన ఫైళ్లను ముందుగానే కార్యాలయానికి పంపాల్సి ఉండగా,సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ప్రక్రియను పూర్తి చేయాలంటే లంచం ఇవ్వాలని ఒత్తిడి తీసుకువచ్చారని రవీందర్ పేర్కొన్నారు. క్లస్టర్ పాఠశాల హెచ్ఎం,గెజిటెడ్ అధికారి,ఇంచార్జ్ మండల విద్యాధికారి జె.రవికుమార్ పలుమార్లు డబ్బులు ఇవ్వాలని కోరినప్పటికీ, తాను అంత మొత్తాన్ని ఇవ్వలేనని నిరాకరించినట్లు తెలిపారు. చివరికి ఎంఈఓకు రూ.10,000 మరియు స్కూల్ అసిస్టెంట్ చంద్రమౌళికి రూ.5,000 ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. లంచం ఇవ్వడం ఇష్టం లేక,రవీందర్ వరంగల్‌లోని ఎసిబి కార్యాలయాన్ని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఎసిబి అధికారులు పథకం ప్రకారం బుధవారం అయోధ్యపురం ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమయం కోసం వేచి ఉండి ఎంఈఓకు రూ. 10,000, స్కూల్ అసిస్టెంట్‌కు రూ.5,000 ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పదవీ విరమణకు సిద్ధమవుతున్న రవీందర్ ఉత్తమ ఉపాధ్యాయునిగా అనేక ప్రశంసాపత్రాలు అందుకున్నారని,విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించిన ఆయనను లంచం పేరుతో ఇబ్బందులకు గురిచేయడం దురదృష్టకరమని అధికారులు తెలిపారు. ఈ ట్రాప్ ఆపరేషన్‌లో డీఎస్పీ(ఎసిబి)సాంబయ్య ఆధ్వర్యంలో ఇన్స్పెక్టర్లు ఎల్.రాజు,ఎస్.రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు. ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ,ఎవరైనా ప్రభుత్వ పనుల కోసం లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

## వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ

- జిల్లా కలెక్టర్ సత్యా శారదా దేవి, ఎమ్మెల్యే నాగరాజు
- అస్తవ్యస్త పరిస్థితులపై ఆగ్రహం
- నిర్లక్ష్య సిబ్బందిపై కలెక్టర్ చర్యలకు ఆదేశాలు



**వర్ధన్ పేట్ , ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని బుధవారం జిల్లా కలెక్టర్ సత్యా శారదా దేవితో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వహణలో కనిపిస్తున్న అస్తవ్యస్త పరిస్థితులు, సిబ్బంది నిర్లక్ష్యంపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ స్వయంగా ఆసుపత్రిలోని బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను పరిశీలించారు. విధులకు గైర్హాజరైన పలువురు వైద్యులు మరియు సిబ్బంది తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వారికి వెంటనే మెమోలు జారీ చేయాలని సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యంతో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసుపత్రిలోని వార్డులు మరియు పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై ఆమె తీవ్రంగా స్పందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను పిలిచి అక్కడికక్కడే మందలిస్తూ, రోగులు నయం కావాల్సిన ఆసుపత్రి వాతావరణం ఇంత అపరిశుభ్రంగా ఉండటం అనేది అసహనీయమని పేర్కొన్నారు. వెంటనే పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచాలని, లేకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆసుపత్రి వార్డులను సందర్శించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల సరఫరా, సిబ్బంది స్పందన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి రాజీ పడబోమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్య రక్షణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు నమ్మకమైన వైద్య సేవలు అందించే కేంద్రాలుగా ఉండాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్08 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో నిర్మాణం చివరి దశలో ఉన్న అత్యవసర వైద్య సేవల విభాగాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్, శస్త్ర చికిత్స గదులు, ఐసీయూ, డయాలసిస్ కేంద్రం, గైనిక్ విభాగం, ఫైర్ సేఫ్టీ తదితర విభాగాలను పరిశీలించారు. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన, కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలని సూచించారు. అలాగే బ్లడ్ బ్యాంక్ రికార్డులను తనిఖీ చేసి, గతంలో రక్తం పొందిన వారికి ఫోన్ ద్వారా వివరాలు ధృవీకరించారు. రికార్డులు పకడ్బందీగా నిర్వహించడంతో పాటు వైద్యులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఇక గుల్జార్ మార్కెట్ బస్తీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేసి, రోగులకు సేవాభావంతో వైద్యం అందించాలని, ఆసుపత్రి పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, డీఎంహెచ్ఓ రాజేందర్, తహసీల్దార్ రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గర్భిణులు ఉచిత వైద్య సేవలు వినియోగించుకోవాలి

- తల్లి శిశువు ఆరోగ్యానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద
- హాజరైన వర్ధనపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- సీకేఎం ప్రసూతి హాస్పిటల్ లో సురక్షిత మాతృ దినోత్సవం





**వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 08 (జనం సాక్షి) :** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య, ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ సి.కే.ఎం ప్రసూతి ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు , జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లి ప్రాముఖ్యతపై మాట్లాడి, తల్లి మరియు శిశువు ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవలసిన జాగ్రత్తలు, పోషకాహారం, సమయానుకూల వైద్య పరీక్షలు, సురక్షిత ప్రసవంపై వివరించారు. గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. తల్లి-శిశు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఆడపిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడు రాజ్యాంగం ద్వారా సూచించిన విధంగా 18 సంవత్సరాలు దాటిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. సమాజంలో ఆడపిల్లలైనా మగవాళ్ళైనా అందరూ సమానమే అని చెప్పారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ గర్భిణి తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉచిత వైద్య సేవలను పొందాలన్నారు. సీకేఎం హాస్పిటల్కు కావలసిన బెడ్స్ ఇతర వస్తువులను తాను సినిమా కూర్చ నున్నట్లు తెలిపారు. సి.కే.ఎం ప్రసూతి ఆసుపత్రిలోని ఓపీ మరియు ఇతర వార్డులను ఎమ్మెల్యే, కలెక్టర్ కలిసి సందర్శించి గర్భిణీలకు అందిస్తున్న వైద్య సేవలను నేరుగా తెలుసుకున్నారు. అక్కడ చికిత్స పొందుతున్న గర్భిణీలతో మాట్లాడి, వారికి అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వైవి గణేష్, సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారులు, జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు.

## ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం



**భూపాలపల్లి బ్యూరో/ కాళేశ్వరం, ఏప్రిల్ 09 (జనం సాక్షి) :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులపై భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఆసుపత్రి సూపరింటెండెంట్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఆసుపత్రిని సందర్శించి, అన్ని విభాగాలను సమగ్రంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని క్యాజువలిటీ, ల్యాబ్ , ఏం.ఆర్.ఐ, ఔట్ పేషెంట్ గదులు పరిశీలించి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. క్యాజువాల్టీ లో 6 మంచాలు మాత్రమే ఉన్నాయని అత్యవసరంగా ఒకే సమయంలో ఎక్కువ మంది రోగులు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైద్యులు తెలుపగా నూతనంగా 15 మంచాలతో ఒక క్యాజువాల్టీ నిర్మాణం చేపడతామని ప్లానింగ్,అంచనాలు తయారు చేసి ఇవ్వాలని టి.జి.ఎం.ఐ.డి.సి అధికారులను ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి ల్యాబ్ ను పరిశీలించి అన్ని రకాలైన పరికరాలు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పారిశుద్ధ్యం సరిగా లేకపోవడం, వార్డులు మరియు పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం గమనించిన ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు అందాల్సిన ప్రాథమిక సౌకర్యాలు సరిగా లేకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడం వంటి అంశాలపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి నిర్వహణపై బాధ్యత వహిస్తున్న పర్యవేక్షకుడిని హెచ్చరించారు. ఆసుపత్రిలో పారిశుధ్యం, నిర్వహణ, సిబ్బంది సమయ పాలన మెరుగుపరచాలని ఆదేశించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తక్షణమే తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య పనులు కట్టుదిట్టంగా అమలు చేయాలని సిబ్బంది హాజరు, పనితీరుపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇకపై ఇలాంటి నిర్లక్ష్యం కొనసాగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలోని మహిళా క్యాంటీన్ ను పరిశీలించి రోగి బంధువులతో మాటాడారు. క్యాంటీన్ లో పరిశుభ్రత తో కూడిన నాణ్యమైన వంటకాలను అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే క్యాంటీన్ లో టిఫిన్స్ రుచిచూశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్,అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్,ఆసుపత్రి పర్యవేక్షకులు డా రాజేంద్రప్రసాద్, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులు పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేయాలి

**భూపాలపల్లి బ్యూరో/ కాళేశ్వరం , ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** జాతీయ మత్స్య అభివృద్ధి , ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం లో భాగంగా జాతీయ మత్స్య డిజిటల్ పోర్టల్ నందు ప్రతి ఒక్క మత్స్య రైతులు వారి వ్యక్తిగతంగా వివరాలు, వృత్తి వివరాలు అనగా చేపల పెంపకం , అమ్మకం , ఫుడ్ ప్రాసెసింగ్ లాంటి చేపల వృత్తిపై ఆధారపడిన ఇతర వివరాలు నమోదు చేసుకొని రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మత్స్య శాఖ అధికారి విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ht tp: //nfdp.dof.gov.in అనే వెబ్ సైట్ లో నమోదు చేసుకోవాలి అని లేనిచో దగ్గరలోని మీ సేవ లేదా కామన్ సర్వీస్ సెంటర్ లో నమోదు చేసుకొని జిల్లా మత్స్య శాఖా కార్యాలయానికి తెలియచేయాలని ఆయన కోరారు. ఈ నమోదుకు సభ్యుని ఆధార్ కార్డు, ఆధార్ లింకు కలిగిన మొబైల్ నెంబరు, బ్యాంకు ఖాతా వివరాలు , చేపల వృత్తికి సంబంధించిన ధ్రువపత్రాలు అవసరమవుతాయని ఆయన తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి మత్స్య శాఖ నుండి వచ్చే ఏ పథకాలకైనా అర్హత లభిస్తుందని తెలిపారు.

## అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**స్టేషన్ ఘన్పూర్, ఏప్రిల్ 08 (జనం సాక్షి) :** ప్రస్తుత ప్రమాణాలకు అనుగుణంగా అంగన్వాడీ టీచర్ల పనితీరు మెరుగు పరిచేందుకు ఆధునిక సాంకేతికతతో కూడిన స్మార్ట్ ఫోన్లను అందిస్తున్నట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తెలిపారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణి కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య , స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనం తరం అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి వ్యవస్థను ఆధునికీకరించే దిశగా తీసుకుంటున్న చర్యలు అభినందనీయమ ని అన్నారు. అంగన్వాడి టీచర్లపై ఉన్న పేపర్ వర్క్ భారాన్ని తగ్గిస్తూ, స్మార్ట్‌ఫోన్లు అందుబాటు లోకి తీసుకురావడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. ఇంటర్నెట్, డిజిటల్ సదుపా యాల వినియోగంలో మహిళలు వెనుకబడి ఉన్నారని పలు సర్వేల్లో వెల్లడైం దని గుర్తు చేశారు. ఈ డిజిటల్ జెండర్ గ్యాప్‌ను అధిగమించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్వాడి సిబ్బందికి మొబైల్ ఫోన్లు అందించడం ద్వారా కీలక అడుగు వేసింద ని అన్నారు. పిల్లల పౌష్టికహారం అందించడంతో పాటు ఆరోగ్యావంతమైన తెలంగాణ నిర్మాణం లో అంగన్వాడీల పాత్ర అత్యంత కీలకమైనదని తెలిపారు. అత్యధిక పోషక విలువలు ఉన్న బాలామృతం అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా శిశు సంక్షేమానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలలోనే ప్రీ స్కూల్స్ ఏర్పాటు చేసి ఇంగ్లిష్ మీడియం బోధన అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక పాఠశాలలకు అనుబంధంగానే ప్రీ స్కూల్స్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్ర మంలో సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించాలి

- ఏఎంసీ చైర్మన్ భూషణ్



**ఖానాపూర్ ఏప్రిల్ 08 (జనం సాక్షి) :** అత్యవసర సేవలలో ఒకటైన పెట్రోల్ బంక్ సేవలు వినియోగదారులకు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలు అందించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగల భూషణ్ అన్నారు. బుధవారం మండలంలోని సత్తెనపల్లి గ్రామంలో కడం మాజీ ఎంపీపీ చక్రపాణి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత్ పెట్రోల్ బంకును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిసరాల వినియోగదారులు పెట్రోల్ బంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సీర్ల విజయ్ ఆనంద్, మాజీ జెడ్పిటిసి సత్యనారాయణ, నాయకులు మల్లారెడ్డి, సదర్ లాల్, దేవన్న, బాబురావు పాల్గొన్నారు.

# గర్భిణులు నిరంతర వైద్య పర్యవేక్షణలో ఉండాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో



**మహబూబాబాద్ బ్యూరో, ఏప్రిల్ 08 (జనం సాక్షి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మహబూబాబాద్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా గర్భిణీ స్త్రీల ఆరోగ్యం, సురక్షిత ప్రసవం, తల్లి-శిశు సంక్షేమం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ, తల్లి ఆరోగ్యం కుటుంబం మరియు సమాజ అభివృద్ధికి కీలకమని తెలిపారు. గర్భిణీ స్త్రీలు గర్భధారణ ప్రారంభ దశలోనే నమోదు చేసుకొని, నిరంతర వైద్య పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. కనీసం నాలుగు సార్లు ఆంటెనాటల్ చెకప్‌లు చేయించుకోవడం ద్వారా గర్భధారణలో వచ్చే సమస్యలను ముందుగానే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, ఔషధాలు, పోషకాహార పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ రావు,మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా ఆసుపత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలని, దీనివల్ల తల్లి మరియు శిశువు ప్రాణాలను రక్షించవచ్చని అన్నారు. ప్రసవ సమయంలో ఎదురయ్యే అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ ఆసుపత్రులు సమగ్ర సదుపాయాలతో సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. తల్లి-శిశు మరణాల శాతాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ ఆధ్వర్యంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, కంబాలపల్లి, మల్యాల గ్రామాలకు చెందిన గర్భిణీ స్త్రీలను 102 అంబులెన్స్ వాహనాల ద్వారా గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌కు తీసుకువచ్చి ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు అవసరమైన రక్తపరీక్షలు, బీపీ పరీక్షలు, హీమోగ్లోబిన్ స్థాయిల పరిశీలన, మరియు ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించబడ్డాయి. అలాగే పోషకాహారం ప్రాముఖ్యత, రక్తహీనత నివారణ, మరియు ప్రసవానికి ముందు, తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్ర అవగాహన కల్పించారు. గైనకాలజిస్టులు డాక్టర్ రాధిక, డాక్టర్ శశి జోష్ణ మాట్లాడుతూ గర్భిణీలు 12 వారాల లోపు నమోదు చేసుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. 28 వారాల వరకు ప్రతి నెల, 28 నుండి 36 వారాల వరకు ప్రతి 15 రోజులకు ఒకసారి, 36 వారాల తరువాత ప్రతి వారం వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ కేసులను ముందుగానే గుర్తించడానికి అవసరమైన రక్తపరీక్షలు, స్కానింగ్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని చెప్పారు. గర్భిణీలు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, తగిన విశ్రాంతి తీసుకోవడం, సమతుల్య ఆహారం తీసుకోవడం మరియు ప్రసవానికి ముందుగానే ఆసుపత్రి ఎంపిక చేసుకోవడం చాలా అవసరమని వివరించారు. కుటుంబ సభ్యులు కూడా గర్భిణీలకు మద్దతుగా ఉండి, అవసరమైన సమయంలో ఆసుపత్రికి తీసుకెళ్లే విధంగా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధీర్ రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్లు డాక్టర్ వీరన్న, డాక్టర్ కరుణాకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ సారంగం, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సాగర్, హెల్త్ ఎడ్యుకేటర్లు కె.వి.రాజు, గీత, శారద, హెచ్ఈఓలు లోక్య, స్వామి, అనిల్ కుమార్ ,హరినాథ్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలును పారదర్శకంగా చేపట్టాలి

**● మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**కనగల్లు, ఏప్రిల్ 8 (జనం సాక్షి) :** మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర రోడ్లు, భవనముల ఴ సినిమాటో గ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నిర్వాహకులకు సూచించారు. బుధవారం మండలంలోని కనగల్ ఐకెపి కేంద్రాన్ని కలెక్టర్ బి చంద్రశేఖర్ తో కలిసి పరిశీలించారు. అనంతరం జీయడవెల్లి, కురంపల్లి గ్రామాలలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎంతో శ్రమించి ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలుదారులు మరియు మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాలకు వచ్చిన తేమశాతం 17 లోపు ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన లారీలను ఏర్పాటు చేయాలని ఎట్టి పరిస్థితుల్లోనూ లారీల కొరత ఉండవద్దని కాంట్రాక్టర్ తో మాట్లాడి కనగల్లు ఆరు లారీలు జీయడవెల్లికి 8 లారీలు అందుబాటులో ఉంచి దారి పొడవున ఉన్న ధాన్యం రాశులను తూకం వేసేలా చర్యలు



తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచన చేశారు . రైతు పండించిన సన్నధాన్యానికి 500 వందల బోనస్ ఇవ్వడంతోపాటు దొడ్డు రకం ధాన్యానికి మద్దతు ధర పెంచడం జరిగిందని తెలిపారు. ఐకెపి ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం నిల్వ ఉంచేందుకు 30 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కూడిన గోదాములను నిర్మించి ఇస్తామని మంత్రి తెలియజేశారు. కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తో పాటు ఆర్డీవోలు, సివిల్ సప్లై, మార్కెటింగ్, తాసిల్దార్, అధికారులు ప్రతిరోజు పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో లైటింగ్ సౌకర్యాన్ని కల్పించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. రైతు క్షేమంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని రైతులే రాష్ట్రానికి వెన్నుముక్కని ఈ సందర్భంగా వెల్లడించారు. పగిడిమర్రి, శబ్దలాపురం, రేగట్టే, పొనుగోడు, మదనాపురం, రామచంద్రాపురం బోయన్ పల్లి గ్రామాలలో ఏర్పాటుచేసిన ఐకెపి కొనుగోలు కేంద్రాలను డిఆర్డిఏ పిడి ఎర్రబెల్లి శేఖర్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెసి శ్రీనివాస్, ఆర్డీవో వై అశోక్ రెడ్డి, డి సి ఓ పత్య నాయక్, మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయాదేవి, డి పి ఆర్ ఓ వెంకటేశం, తహసిల్దార్ పద్మ ఎంపీడీవో సతీష్ కుమార్ ఎక్స్ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు అనుపు రెడ్డి, సర్పంచులు ఓర్సు పెంటయ్య నర్సింగ్ మురళీధర్ గౌడ్, నాగవెల్లి నాగమణి,, వంపు నాగమణి జానయ్య, అందుగుల సువర్ణ వెంకటేశం తంగిరాల అంతయ్య, పరసనబోయిన వెంకటేశం,ఉప సర్పంచ్ మార్గం సత్యనారాయణ, మండల చంద్రయ్య, ఆర్ ఐ లు సునీత యాదగిరి ఏపి ఎం డి మ సేశ్వర రావు జిల్లా కిసాన్ సెల్ కన్వీనర్ గోలి జగాల్ రెడ్డి, సీసీలు ఇద్దయ్య ప్రభాకర్, విజయ, నబిత, మాజీ సర్పంచ్ లుగోలి నర్సిరెడ్డి, నర్సింగ్ కృష్ణయ్య, మెరుగు శివయ్య, వి బి కే లు కలమ్మ, వసుమతి, కొప్పుల లక్ష్మీ ప్రసన్న, కారింగ్ రమణ, పాలకూరి శ్రీలత, ఎల్ సుజాత, పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, విద్యుత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వివిధ హోదాలో ఉన్న ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యురాలు పాల్గొన్నారు.

## గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



**మునగాల, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** మునగాల మండలం నరసింహులగూడెం గ్రామంలో రైతులు సుమారు 400 ఎకరాలలో విస్తీర్ణంలో సాగు చేసిన మొక్కజొన్న పంటలు వర్షాలు బారిన నష్టపోకుండా, రైతులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని గ్రామంలో ఏర్పాటు చేయాలని నరసింహులగూడెం సర్పంచ్ కుంచం ఇందిర నరసయ్య ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ను కలిసి రైతుల కోసం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే మార్క్ ఫెయిడ్ ఎం.డి.తో మాట్లాడి రెండు మూడు రోజుల్లో గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. సందర్భంగా కలెక్టర్ రెండు మూడు రోజుల్లో ఏర్పాటు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. వరికి ప్రత్యామ్నాయ పంటగా మొక్కజొన్న పండిస్తున్న నరసింహులగూడెం రైతులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మొగిలిచర్ల సీతారాములు, మాజీ సర్పంచ్ జూలకంటి కొండారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట గోపి, వార్డు మెంబర్ మొగిలిచర్ల రమేష్, రైతులు షేక్ దస్తగిరి, ఎస్.కె సైదా, గొల్లపూడి వీరబాబు, జూలకంటి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సురక్షిత మాతృత్వ పద్ధతులపై నాటక ప్రదర్శన




**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక హెల్త్ వీక్ కార్యక్రమాలలో భాగంగా 3వ రోజు బుధవారం సురక్షిత మాతృత్వ పద్ధతులపై గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సురక్షిత మాతృత్వ పద్ధతులపై సందేశాత్మక నాటకాన్ని ప్రదర్శించిన ఆరోగ్య సిబ్బందిని అభినందించారు.గర్భిణీ స్త్రీల పరీక్షల ప్రాముఖ్యత, సాధారణ ప్రసవాలు, ఆసుపత్రిలో ప్రసవాల ప్రాముఖ్యతను వివరించారు.పీసీపీఎన్డీటీ చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, గర్భంలో శిశువు లింగ నిర్ధారణ నిషేధం, దానికి సంబంధించిన శిక్షలను వివరించారు.శిశువుల సంరక్షణపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థులకు కలెక్టర్ ప్రశంస పత్రాలను అందజేశారు. అంతకుముందు సురక్షిత మాతృత్వ పద్ధతులపై ఆరోగ్య సిబ్బంది నాటక ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం తల్లి శిశువుల మరణాలను తగ్గించడం కోసం ముందస్తు గుర్తింపు, సమయానుకూల రిఫరల్ సేవలను మెరుగుపరచడం, ఆరోగ్యవంతమైన తల్లి, ఆరోగ్యవంతమైన శిశువు, సంతోషకరమైన కుటుంబం కోసం సురక్షిత మాతృత్వాన్ని ప్రోత్సహించడం.సుమారు 80 మంది వైద్య సిబ్బంది ఇందులో పాల్గొన్నారు.వారిలో గర్భిణీ మహిళలు, ప్రసవానంతర మహిళలు,వారి సహచరులు, వైద్యులు, ఆశా వర్కర్లు, నర్సింగ్ అధికారులు, గవర్నమెంట్ నర్సింగ్ కళాశాల, సూర్యాపేట విద్యార్థులు పాల్గొన్నారు.నర్సింగ్ విద్యార్థులు సమాచారాత్మక పోస్టర్లను ప్రదర్శించి, గర్భిణీ స్త్రీల కోసం యాంటెనాటల్ కేర్ పై నాటికను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, మెడికల్ సూపరింటెండెంట్ జీజీహెచ్ శ్రావణ్ కుమార్, డీసీహెచ్ఎస్ గవర్నమెంట్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, పీవో ఎంహెచ్ఎన్, సీడీపీఓలు పాల్గొన్నారు.

## జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 8 (జనం సాక్షి) :** యాసంగి 2025-26లో రైతులు పండించిన మొక్కజొన్న పంటలను కొనుగోలు చేసేందుకు రెండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాల జిల్లాలోని ఐజ, శాంతినగర్ సొసైటీలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గద్వాల మార్కెట్ యార్డ్ పరిధిలో కూడా మొక్కజొన్న కేంద్రాలు తెరవడం జరుగుతుందని, రైతులు మొక్కజొన్నలను దళారులకు అమ్మి నష్టపోకూడదని, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కేంద్రాలలో అమ్ముకొని గిట్టుబాటు ధర పొందాలన్నారు.

## చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

**● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 7 (జనంసాక్షి) :** జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ రెగ్యులేషన్ యాక్ట్ నిబంధనల రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రులు తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ రెగ్యులేషన్ యాక్ట్ నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేయాలని, అర్హతలు ఉన్న వారికి సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని అన్నారు.గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు నిర్వహించినచో వాటిని మూసి వేయాలని అన్నారు.ఈ నిబంధనలను ఉల్లంఘించే ఆసుపత్రులపై, వాటి ప్రాంగణాలను సీజ్ చేయడంతో సహా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.నవీకరించబడిన రికార్డులు, వైద్య బృందాలచే క్రమమైన తనిఖీలు, అమలు కోసం పోలీసుల సమన్వయంతో నిర్వహించాలన్నారు. తనిఖీ చేసిన 10 రోజుల్లోగా నిబంధనలను పాటించని ఆసుపత్రులను సీజ్ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.పిసిపిఎన్ డిటి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, అన్ని రికార్డులను నవీకరించాలని పేర్కొన్నారు.అన్ని అబార్షన్ ఆడిట్ చేయాలని,




అబార్షన్ జరుగు కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అన్నారు.జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెండెం వెంకట రమణ మాట్లాడుతూ జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ నుండి 23 ప్రొవిజినల్, 28 పర్మినెంట్ అనుమతులు ఇచ్చామని, 31 ఎస్టాబ్లిష్మెంట్స్ తిరస్కరించమని, అర్హతలేని వైద్యుల స్కానింగ్ సెంటర్ మూసివేశామని తెలిపారు.ఈ కారక్రమంలో అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, జిజిహెచ్ సూపరింటెండెంట్ శ్రావణ్ కుమార్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ ఆనంద్, డిడబ్ల్యూఓ నర్సింహారావు, డీఈఓ అశోక్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ మాధవ్ కుమార్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కోటిరత్నం, డాక్టర్ ప్రసిద్ద్, డాక్టర్ నాజియా, డాక్టర్ శ్రీశైలం, డిప్యూటీ డిఈఎం సంజీవ్ రెడ్డి, ఉపేందర్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నివారణపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి




**ఖమ్మం, ఏప్రిల్ 8 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డి కమిటీ సభ్యులు ఖమ్మం జిల్లాను సందర్శించారు.ఈ సందర్భంగా రఘునాథపాలెం మండలంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, ఆంగన్వాడీ టీచర్లు , ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం జిల్లా సంక్షేమాధికారి వేల్పుల విజేత అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పిల్లల విద్య హక్కు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామ స్థాయిలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు) మరింత చురుకుగా పనిచేసి, బాలల సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమాధికారి వేల్పుల విజేత మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. త్వరలోనే రఘునాథపాలెం మండలాన్ని బాల్య వివాహ రహిత మండలంగా అభివృద్ధి చేస్తామని దీనికి స్పందించిన సర్పంచులు కూడా తమ సంఘీభావాన్ని వ్యక్తం చేస్తూ, గ్రామ స్థాయిలో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టేందుకు కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా ఆరోగ్య శాఖ అధికారి రామారావు మాట్లాడుతూ పోలియో రహిత జిల్లా గా ఖమ్మం జిల్లా ఉందని, ఆరోగ్యమైన బాలలను తయారు చేయడం లో మా వైద్య ఆరోగ్య శాఖ పని చేస్తుందని ఆయన అన్నారు. బాలల హక్కుల కమిటీ మెంబెర్ చందన మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని దాని కొరకు ప్రతి సర్పంచ్ దగ్గర బడికి వెళ్లే పిల్లలు ఎంతమంది బడికి వెళ్ళని పిల్లలు ఎంతమంది, స్కూల్ మానివేసిన పిల్లలు ఎంతమంది అనే లెక్క తప్పకుండా ఉండాలని దాని ఆధారం గా బాలల పరిరక్షణ ప్రణాళికలు తయారుచేయాలనీ తెలియచేసారు. మరొక సభ్యురాలు సరిత మాట్లాడుతూ తల్లిదండ్రులు, టీచర్స్ ఎంత ముఖ్య భూమిక పోషిస్తారో, గ్రామ పెద్దలు గా సర్పంచులు కూడా పిల్లల పరిరక్షణ బాధ్యత తీసుకోవాలని ఆమె అన్నారు అనంతరం ఖమ్మం రూరల్ కేజీబీవీ సందర్శించి పిల్లలతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

## పిఎన్జీతో వంట గ్యాస్ సరఫరాకు కసరత్తు



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 8 (జనం సాక్షి) :** భవిష్యత్తులో ఎల్పిజి గ్యాస్ కొరతను అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పిఎన్ జీ( పైపుడ్ నాచురల్ గ్యాస్) తో కమర్షియల్ అవసరాలకు వంట గ్యాస్ సరఫరాకు కసరత్తు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.బుధవారం సిజిడి (సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్) జిల్లా కమిటీ సభ్యులతో పిఎన్జి గురించి జిల్లా కలెక్టర్ చాంబర్లో మాట్లాడారు. పైప్ లైన్ ద్వారా కమర్షియల్ అవసరాలకు గ్యాస్ పంపిణీ చేసేందుకు జిల్లాలో ఉన్న సవాళ్లను దృష్టిలో ఉంచుకొని, ప్రణాళికతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పైపుడ్ నాచురల్ గ్యాస్ సరఫరాకు మెగా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారం అందించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతానికి జిల్లాలో వంట గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, రోజు మన జిల్లాకు అవసరమైన సిలిండర్లు వస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు సుమారు 2800 బుకింగ్స్ జరుగుతున్నాయని, వినియోగదారులు గ్యాస్ బుక్ చేసిన మూడు రోజుల్లోనే డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సైదులు, వెంకటరమణ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్, రంగారావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్డబ్ల్యూఎస్, మొగులప్ప డిఆర్డిఓ మెగా కంపెనీ ప్రతినిధి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికల ఆరోగ్య రక్షణకు హెచ్పీవీ వ్యాక్సిన్

**● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో బుధవారం వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హెచ్పీవీ టీకా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ను నివారించడంలో హెచ్పీవీ టీకా ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. 14 నుండి 15 సంవత్సరాలలోపు ఉన్న బాలికలు తప్పనిసరిగా ఈ టీకాను తీసుకోవాలని సూచించారు.గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నియంత్రణలో ఈ వ్యాక్సిన్ ప్రభావవంతంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.బాలికల ఆరోగ్యం కోసం తల్లిదండ్రులు అవగాహన పెంచుకొని హెచ్పీవీ టీకా వేయించేందుకు ముందుకు రావాలని కోరారు.జిల్లాలో 14 నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల మొత్తం 11664 మంది బాలికలను గుర్తించినట్లు తెలిపారు.వీరందరికీ హెచ్పీవీ టీకా అందించే కార్యక్రమాన్ని ఆరోగ్య శాఖ చేపట్టిందని పేర్కొన్నారు.జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో టీకా వేస్తారని సంక్షేమ శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించి వాక్సిన్ వేయించాలని సూచించారు.ఈ కారక్రమంలో అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, జిజిహెచ్ సూపరింటెండెంట్ శ్రవణ్ కుమార్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ ఆనంద్, డిడబ్ల్యూఓ నర్సింహారావు, డీఈఓ అశోక్, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ చంద్ర శేఖర్, డాక్టర్ మాధవ్ కుమార్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కోటి రత్నం, డాక్టర్ ప్రసిద్ద్, డాక్టర్ నాజియా, డాక్టర్ శ్రీశైలం, డిప్యూటీ డిఈఎం సంజీవ్ రెడ్డి, ఉపేందర్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జైవీర్రెడ్డిపై అసత్య ప్రచారాలు చేస్తే ఖబడ్దార్

**● పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండేటి మల్లయ్య**



**మాడుగులపల్లి, ఏప్రిల్ 8 (జనం సాక్షి) :** నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ చేస్తున్న అసత్య ప్రచారాలను పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండేటి మల్లయ్య తీవ్రంగా ఖండించారు బుధవారం నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం ధర్మపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ సందర్భంగా కొండేటి మల్లయ్య మాట్లాడుతూ నోముల భగత్ తన అవాకులు చవాకులు మానుకోవాలని, నోరు జాగ్రత్తగా పెట్టుకోవాలని హెచ్చరించారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని విమర్శించారు నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే జైవీర్రెడ్డి నియోజకవర్గ ప్రజలందరికీ ప్రజా పాలన ను చేరువ చేస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే, అది చూసి ఓర్వలేకనే జానారెడ్డి కుటుంబంపై ఇలాంటి అసత్య ప్రచారాలకు ఒడిగడుతున్నారని మండిపడ్డారు జానారెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో అనేక కీలక మంత్రి పదవులు నిర్వహించి చలకుర్తి, సాగర్ నియోజకవర్గాల్లో చేసిన అభివృద్ధి ఏపాటిదో ఈ ప్రాంత ప్రజలందరికీ సుపరిచితమేనని అన్నారు గత మున్సిపాలిటీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే తగిన బుద్ధి చెప్పినా, భగత్ తీరు మారకపోవడం విచారకరమన్నారు కేవలం రాజకీయ ఉనికి కోసమే తప్పుడు ఆరోపణలు చేస్తే నియోజకవర్గ ప్రజలు చూస్తూ ఊరుకోరని, ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజలు మీకు తగిన గుణపాఠం చెబుతారని, ఖబర్దార్ భగత్ అంటూ తీవ్రంగా హెచ్చరించారు ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంకిటి సత్యం, ధర్మాపురం సర్పంచ్ కొత్త దశరథ,కాంగ్రెస్ నాయకులు చింత రెడ్డి సైదిరెడ్డి,మాజీ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి,వెంకన్న,వెంకటేశ్వర్లు, శంకర్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తుల కోసం కాకుండా పార్టీ కోసం పని చేయాలి

**నిజామాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (జనం సాక్షి) :** వ్యక్తుల కోసం కాకుండా బిజెపి జెండా కోసం పనిచేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా పిలుపునిచ్చారు. పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఇందూరు అర్బన్ ప్రశిక్షణా తరగతులు మంగళవారం విజయలక్ష్మి గార్డెన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ కండువా వేసుకోవాలంటే అదృష్టం ఉండాలని, ఈ అదృష్టం మనందరికీ కలగడం పూర్వజన్మ సుకృతం అన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రతి ఒక్కరు కష్టపడాలన్నారు. జాతీయ వాదం హిందువుల కోసం పనిచేసే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని కొనియాడారు. ప్రధాని మోదీ 12 ఏళ్లలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రధానంగా ఆత్మనిర్భర్ భారత్ ను ప్రారంభించి" వోకల్ ఫర్ లోకల్ "అనే నినాదంతో దేశాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. దేశాన్ని ఆర్థికంగా, సాంకేతికంగా, ఉత్పత్తి రంగంలో స్వయం సమృద్ధిగా మార్చేందుకు తీసుకున్న ముఖ్య కార్యక్రమం అన్నారు. స్వదేశీ ఉత్పత్తులను పెంచుకోవడం స్థానిక పరిశ్రమలను అభివృద్ధి చేయడం స్వయం ఉపాధిని ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశం అని చెప్పారు. విదేశీ దిగుమతులపై ఆధారాన్ని తగ్గించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం అన్నారు. ఆత్మనిర్భార్ భారత్ ద్వారా దేశ ఆర్థికంగా బలపడుతుందని, ఉద్యోగాలు పెరుగుతాయన్నారు. ప్రపంచంలో భారత దేశ స్థానం మరింత మెరుగవుతుందని వివరించారు.2014 ముందు కేవలం 16 ఐఐటీలు ఉంటే ప్రస్తుతం 23 కు పెరిగాయని అలాగే 7 ఎయిమ్స్ హాస్పిటల్స్ ఉంటే ప్రస్తుతం 25 కు పెరిగాయని గుర్తు చేశారు. 60 ఏళ్లలో చేసిన అభివృద్ధికి రెట్టింపుగా ప్రధాని మోదీ ఈ 12 సంవత్సరాలలో చేశారన్నారు. "మేక్ ఇన్ ఇండియా" దిశగా అడుగులు వేస్తూ దేశాభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు.పార్టీలో ఎన్ని సంవత్సరాల నుంచి పని చేసినా ఎప్పటికప్పుడు ప్రశిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనాలని జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి తెలిపారు. శిక్షణలో వివరించే అనేక అంశాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పార్టీలో ప్రతి సంవత్సరం శిక్షణ తరగతులు ఉంటాయని, మారుతున్న కాలానికి అనుగుణంగా తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయా అంశాలపై నిష్ణాతులు, రాష్ట్ర స్థాయి శిక్షణ పొందిన వారు విపులంగా తరగతులు చెప్పడం



జరుగుతుందన్నారు. కావున ప్రతి కార్యకర్త ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, రాష్ట్ర నాయకులు మేడపాటి ప్రకాష్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంకర్ లక్ష్మీనారాయణ, అర్బన్ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.




## వాట్సప్ నుంచి యూజర్ నేమ్ ఫీచర్..
# తొలుత వీరికే

**న్యూఢిల్లీ:**వాట్సప్ నుంచి ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఫీచర్ ఎట్టకేలకు సిద్ధమైంది. ఫోన్ నంబర్ ఇవ్వకుండా ఇతరులతో సందేశాలు పంపేందుకు/కాల్స్ చేసేందుకు ఉపయోగపడే యూజర్‌నేమ్ ఫీచర్‌ను వాట్సప్ రోల్‌ఔట్ చేస్తోంది. కొన్నేళ్లుగా దీన్ని అభివృద్ధి చేస్తూ వస్తున్న వాట్సప్.. సుదీర్ఘ విరామం తర్వాత ఐఓఎస్, ఆండ్రాయిడ్ యూజర్లకు విడుదల చేసింది. తొలుత పరిమిత సంఖ్యలో యూజర్లకు ఈ ఫీచర్ అందుబాటులోకి తెచ్చింది. దశలవారీగా అందరికీ అందుబాటులోకి రానుంది.సాధారణంగా ఎవరితోనైనా చాట్ చేయాలంటే మన వ్యక్తిగత ఫోన్ నంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. కొత్త వ్యక్తులకు ఇలా ఫోన్ నంబర్ ఇవ్వడం కొందరికి ఇబ్బందిగా అనిపించొచ్చు. ఒకవేళ వాట్సప్‌లో సదరు వ్యక్తిని బ్లాక్ చేసినా ఇతర మార్గాల్లో మిమ్మల్ని సంప్రదించే అవకాశం ఉంటుంది. అలా కాకుండా యూజర్ నేమ్ ఇస్తే మీ ఫోన్ నంబర్ వారికి తెలిసే అవకాశం ఉండదు. కాబట్టి అందులో బ్లాక్ చేస్తే ఇకపై వారు మిమ్మల్ని సంప్రదించడం కుదరదు. ముఖ్యంగా మీ ఫోన్ నంబర్‌ను షేర్ చేయడానికి ఇష్టపడని సందర్భాల్లో ఈ ఫీచర్ చాలా ఉపయోగపడనుంది.యూజర్ నేమ్ అనేది కనీసం 3 అక్షరాల నుంచి 35 అక్షరాల వరకు పెట్టుకోవచ్చు. ఇందులో జీ-ళి, 0-9, డాట్, అండర్ స్కోర్ మాత్రమే వాడాల్సి ఉంటుంది. లిలిలి, చివర్లో .ఇసీఎ, .నివబి వంటివి ఉపయోగించకూడదు. అదనంగా 4 అంకెలతో యూజర్ నేమ్ కీ కూడా సెట్ చేసుకోవచ్చు. దీనివల్ల ఎవరైనా మిమ్మల్ని మొదటిసారి కాంటాక్ట్ చేయాలంటే వారికి మీ యూజర్ నేమ్‌తో పాటు ఆ కీ కూడా షేర్ చేయాల్సి ఉంటుంది. ఇది స్పామ్ మెసేజ్‌లను తగ్గించడానికి సహాయపడుతుంది. ఒకవేళ మీరు ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లో వాడుతున్న యూజర్ నేమ్‌నే వాట్సప్‌లో కూడా వాడాలనుకుంటే ఆ ఖాతాలను అకౌంట్స్ సెంటర్ ద్వారా లింక్ చేయాల్సి ఉంటుంది. ఒకే రకమైన యూజర్ నేమ్ వాడకపోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.ప్రస్తుతానికి ఈ ఫీచర్ పరిమిత సంఖ్యలో వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉంది. వాట్సప్ ప్రొఫైల్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి అక్కడ యూజర్ నేమ్ సెట్ చేసుకునే ఆప్షన్ ఉందో లేదో చూడొచ్చు. లేకపోతే రాబోయే కొన్ని రోజుల్లో మీకు ఈ అప్‌డేట్ పొందే అవకాశం ఉంటుంది.




# సీజ్ ఫైర్ ఎఫెక్ట్..

## రూ.15 లక్షల కోట్లు పెరిగిన మదుపర్ల సంపద

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. ఇరాన్-అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం, అంతర్జాతీయంగా చమురు ధరలు అమాంతం పడిపోవడంతో సూచీలు దూసుకెళ్లాయి. సెన్సెక్స్ ఏకంగా 2900 పాయింట్లకు పైగా ఎగబాకగా.. నిఫ్టీ ఓ దశలో 24 వేల మార్కును తాకింది. చివరికి 24వేల మార్కుకు కాస్త దూరంలో నిలిచింది. దీంతో మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.15 లక్షల కోట్లు పెరిగి రూ.445 లక్షల కోట్లకు చేరింది.అంతర్జాతీయంగా సానుకూల సంకేతాల నేపథ్యంలో సెన్సెక్స్ ఉదయం 77,290.63 వద్ద (క్రితం ముగింపు 74,616.58) భారీ లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అవే లాభాలు కొనసాగాయి. ఇంట్రాడేలో 77,627.15 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 2946.32 పాయింట్ల లాభంతో 77,562.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 24,025.15 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 873.70 పాయింట్ల లాభంతో 23,995.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.59గా ఉంది.సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ స్టాక్స్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. ఇండిగో టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతీ, అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, ఇండిగో స్టాక్స్ 5 నుంచి 8 శాతం మేర లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో




బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 94 డాలర్ల వద్ద కొనసగుతుండగా.. బంగారం 4788 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.అటు ఆసియా-పసిఫిక్ మార్కెట్లు కూడా బుధవారం లాభాల్లో కొనసాగుతున్నాయి. దక్షిణ కొరియా కోస్పి 6 శాతానికి పైగా పెరిగింది. జపాన్ నిక్కీ 5శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 3 శాతం మేర పెరిగాయి. అమెరికా మార్కెట్లు మంగళవారం లాభాల్లో ముగిశాయి.

**మార్కెట్ల ర్యాలీకి కారణాలివే..**

ఇరాన్-అమెరికా మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణకు ఒప్పందం కుదిరింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొలిక్కి వచ్చే అవకాశం ఉందన్న అంచనాలను మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చాయి.ఇటీవల 95 డాలర్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన రూపాయి ఆర్‌బీఐ చర్యలతో కోలుకుంది. నేటి ట్రేడింగ్‌లో 47 పైసలు పెరిగి 92.59కు చేరుకుంది. ట్రంప్ సీజ్‌ఫైర్‌తో అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా దిగొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ ధర ఈ ఒక్క రోజే దాదాపు 16 శాతం తగ్గి 95.06కు పడిపోయింది. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడ్ దాదాపు 20 శాతం తగ్గింది.వృద్ధికి ఆటంకాలు, ద్రవ్యోల్బణ భయాలు ఉన్నప్పటికీ ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను పెంచకుండా ఉండటం కూడా స్టాక్ మార్కెట్లకు కలిసొచ్చింది.

## అమెజాన్‌లో మళ్లీ 14వేల లేఆఫ్‌లు..?

ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి పెద్దఎత్తున ఉద్యోగులపై వేటు వేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది వచ్చే నెలలో దాదాపు 14వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ఆసియా బిజినెస్ అవుట్‌లుక్ వెల్లడించింది. మేలో చేపట్టనున్న ఈ తొలగింపుల్లో అమెజాన్ వెబ్ సర్వీసెస్, రిటైల్‌తో పాటు మానవ వనరుల విభాగాలలోని ఉద్యోగులపై ప్రభావం పడనుందని నివేదికలు తెలిపాయి. అయితే ఈ విషయంపై అమెజాన్ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. 2025 చివరి నాటికి అమెజాన్ 14వేల ఉద్యోగులను తొలగించగా.. ఈ ఏడాది జనవరిలో 16వేల మందిపై వేటు వేసింది. ఇటీవల వేలాది మంది ఉద్యోగులను తొలగించిన కంపెనీల్లో ఒరాకిల్, మైక్రోసాఫ్ట్, టీసీఎస్, యాక్సెంచర్ ఉన్నాయి. మెటా సైతం 15వేలమంది ఉద్యోగులను తొలగించడానికి యోచిస్తున్నట్టు సమాచారం. ఇదీ చదవండి: పెరగనున్న హ్యూందాయ్ కార్ల ధరలు



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,38,350 (22 క్యారెట్లు) | ₹ 1,50,930 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,55,000

## పెరగనున్న హ్యూందాయ్ కార్ల ధరలు




దక్షిణకొరియా ఆటో మొబైల్ దిగ్గజం హ్యూందాయ్ మోటార్ కార్లపై ధరలు పెంచనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు అన్నిరకాల మోడళ్లపై 1శాతం వరకు ధర పెంచుతున్నట్టు, కొత్త ధరలు మే నుంచి అమల్లోకి రానున్నట్టు పేర్కొన్నారు. "వివిధ వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ధరల సవరణ చేపట్టాల్సి వచ్చింది. కార్లలో వేరియంట్లు, మోడళ్ల ఆధారంగా వాటి ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. వినియోగదారులపై భారం మోపాలనే ఉద్దేశం సంస్థకు లేదు. అందువల్లే స్వల్ప మొత్తంలో ధరలు పెంచేందుకు ప్రణాళిక రూపొందించాం" అని ఆటో మొబైల్ సంస్థ పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నాలుగో త్రైమాసికంలో 2,08,275 యూనిట్లు అమ్ముడయ్యాయి. గత త్రైమాసికంతో పోలిస్తే ఇది 8.7శాతం ఎక్కువ. ఇప్పటివరకు దేశీయంగా జరిగిన విక్రయాల్లో ఇదే రికార్డు అని కార్ల తయారీ సంస్థ హ్యూందాయ్ తెలిపింది.

## విమానయాన సంస్థలకు కేంద్రం ఊరట

ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న దేశీయ విమానయాన సంస్థలకు ఊరట కల్పించేందుకు గాను కేంద్రం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. దేశీయ విమానాల ల్యాండింగ్, పార్కింగ్ రుసుములను 25 శాతం తగ్గించుకోవాలని దేశంలోని ప్రధాన విమానాశ్రయాలకు ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలల పాటు ఈ తగ్గింపులు కొనసాగించాలని పేర్కొంది. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థలైన ఇండిగో, ఎయిరిండియాలకు భారీ దెబ్బ తగిలింది. ఈక్రమంలో విమానాశ్రయాలు వసూలు చేసే కొన్ని రుసుములను తగ్గించేలా చూడమని ఆయా విమానయాన సంస్థలు కేంద్రాన్ని అభ్యర్థించాయి. ఈ క్రమంలోనే కేంద్రం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ ఆదేశాలపై స్పందించింది. ఈ తాత్కాలిక ఛార్జీల తగ్గింపు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది. కాగా.. అమెరికా- ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో విమానయాన రంగం పుంజుకుంది.

## చమురు ధర 150 డాలర్లు దాటితే భారత వృద్ధి రేటు
# పతనమే..

### ద్రవ్యోల్బణం, కరెంట్ అకౌంట్ లోటు పెరిగే అవకాశం: మోర్గాన్ స్టాన్లీ

**న్యూఢిల్లీ:**అంతర్జాతీయ పరిణామాలు, ప్రత్యేకించి ఇరాన్, హర్మూజ్ జలసంధి సమీపంలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు మండిపోతున్నాయి. ఈ క్రమంలో బ్యారెల్ ముడిచమురు ధర ఒక త్రైమాసికంలో 150 డాలర్లను తాకితే, 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 6% కంటే దిగువకు పడిపోయే ప్రమాదం ఉందని గ్లోబల్ బ్రోకరేజ్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ తాజా నివేదికలో హెచ్చరించింది. అప్పుడు వృద్ధి రేటు 5.7 శాతానికి పరిమితం కావొచ్చని, కరోనా మహమ్మారి పరిణామాల తర్వాత దేశానికి ఇదే కనిష్ఠ వృద్ధి రేటు కానుందని అంచనా వేసింది. బ్యారెల్ బ్రెంట్ చమురు సగటు ధర 95 డాలర్లుగా ఉన్నప్పటికీ, దేశ వృద్ధి రేటు అంచనాను మోర్గాన్ స్టాన్లీ తన గత అంచనా 6.5% నుంచి 6.2 శాతానికి కుదించింది. ద్రవ్యోల్బణం అంచనాను 5.1 శాతానికి పెంచింది. ప్రస్తుతం ముడిచమురు ధర బ్యారెల్‌కు 111 డాలర్ల దగ్గరగా ఉండటం గమనార్హం.చమురు ధర రికార్డు స్థాయిలో బ్యారెల్ 150 డాలర్ల వద్దకు చేరితే, దేశంలో రిటెయిల్ ద్రవ్యోల్బణం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గరిష్ఠ లక్ష్య పరిమితి 6 శాతాన్ని మించుతుందని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది. చమురు ధరల ప్రభావం రిటెయిల్ ద్రవ్యోల్బణం కంటే టోకు ధరల సూచీపై ఎక్కువగా ఉంటుందని తెలిపింది. ముడిచమురు ధర బ్యారెల్ 95 డాలర్ల వద్ద ఉంటే.. టోకు ధరల ద్రవ్యోల్బణం రానున్న రోజుల్లో ఏటా 7% పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. దేశ కరెంట్ అకౌంట్ లోటు కూడా రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగి, దేశ జీడీపీలో 3 శాతానికి చేరుకోవచ్చని అంచనా వేసింది.



మూడు కారణాలు:దేశ వృద్ధి రేటు మందగించడానికి 3 అంశాలు కారణమవుతాయని నివేదిక విశ్లేషించింది. ఇంధనం, ముడిసరుకుల వ్యయం పెరగడం వల్ల ఉత్పత్తి క్షీణించడం, 2. ధరల పెరుగుదల, కొరత కారణంగా వినియోగం తగ్గడం, భౌగోళిక - రాజకీయ ఉద్రిక్తతల్లో ఉన్న ప్రాంతాలకు ఎగుమతులు పడిపోవడం.

**ఇతర అంతర్జాతీయ సంస్థలూ:**

ఇతర అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలూ భారత వృద్ధి అంచనాలపై అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. 2025-26 వృద్ధిరేటు 7.3% నుంచి 2026-27లో 6 శాతానికి తగ్గుతుందని మూడీస్ రేటింగ్స్ పేర్కొంది. ఓఈసీడీ సైతం 2026-27 వృద్ధి అంచనాను 6.2% నుంచి 6.1 శాతానికి తగ్గించింది.

స్థిరంగా వడ్డీ రేటు: ద్రవ్యోల్బణ ముప్పు ఉన్నప్పటికీ, ఆర్‌బీఐ తన పాలసీ రేటును ఈ ఏడాది పొడవునా 5.25% వద్దే స్థిరంగా కొనసాగించొచ్చని బ్రోకరేజ్ సంస్థ భావిస్తోంది. ఆర్‌బీఐ ఎంపీసీ నిర్ణయాలు నేడు (బుధవారం) వెల్లడి కానుండగా, వడ్డీ రేట్లలో మార్పు చేయకపోవచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. చమురు ధరల షాక్ నుంచి ఆర్థిక వ్యవస్థను రక్షించడానికి ప్రభుత్వం పన్ను కోతలు, సబ్సిడీల వంటి ఆర్థిక చర్యలపై ఆధారపడాల్సి వస్తుందని నివేదిక వివరించింది. దీనివల్ల 2026-27 బడ్జెట్‌లో నిర్దేశించుకున్న 4.3% లోటు కంటే అదనంగా 0.3 - 0.5% ద్రవ్యలోటు పెరిగే అవకాశం ఉందని మోర్గాన్ స్టాన్లీ వివరించింది.

## విమానయాన సంస్థలకు కేంద్రం ఊరట

ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న దేశీయ విమానయాన సంస్థలకు ఊరట కల్పించేందుకు గాను కేంద్రం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. దేశీయ విమానాల ల్యాండింగ్, పార్కింగ్ రుసుములను 25 శాతం తగ్గించుకోవాలని దేశంలోని ప్రధాన విమానాశ్రయాలకు ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలల పాటు ఈ తగ్గింపులు కొనసాగించాలని పేర్కొంది. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థలైన ఇండిగో, ఎయిరిండియాలకు భారీ దెబ్బ తగిలింది. ఈక్రమంలో విమానాశ్రయాలు వసూలు చేసే కొన్ని రుసుములను తగ్గించేలా చూడమని ఆయా విమానయాన సంస్థలు కేంద్రాన్ని అభ్యర్థించాయి. ఈ క్రమంలోనే కేంద్రం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ ఆదేశాలపై స్పందించింది. ఈ తాత్కాలిక ఛార్జీల తగ్గింపు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది. కాగా.. అమెరికా- ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో విమానయాన రంగం పుంజుకుంది. ఇందులోభాగంగా ఇండిగో షేర్లు ఈరోజు ఏకంగా 10శాతం పెరిగి.. అప్పర్ సర్క్యూట్‌ని తాకాయి.

## ట్రంప్ సీజ్ ఫైర్.. భారీగా దిగొచ్చిన చమురు ధరలు

ఇరాన్‌పై చేస్తోన్న యుద్ధానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు వారాల బ్రేక్ ఇచ్చిన సంగతి తెలిసిందే ఆయన అనూహ్యంగా కాల్పుల విరమణ ప్రకటించడంతో చమురు మంటలు కొంచెం చల్లారాయి బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్ ధర 95.06 డాలర్లకు పడిపోయింది. అంతకుముందు ఒక బ్యారెల్ ధర 110 డాలర్లకు దగ్గర్లో ఉండటం గమనార్హం. ఇక యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడ్ దాదాపు 20 శాతం తగ్గింది.ట్రంప్ ప్రకటనతో మార్కెట్లు వేగంగా స్పందించాయి. చమురు ధరలు పడిపోగా, అమెరికా మార్కెట్లు భారీగా పెరిగాయి. డౌ ఫ్యూచర్స్ 900 పాయింట్లు ఎగబాకింది. పశ్చిమాసియా ఘర్షణలు ప్రారంభమైన దగ్గరి నుంచి హర్మూజ్ అంతరాయాలతో చమురు ధరలు భగ్గుమంటోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ జలసంధి నుంచి ఇంధన నౌకల రవాణా ప్రారంభం కావొచ్చనే అంచనాలు సానుకూలతలకు దోహదం చేశాయి.







## వరుసగా రెండోసారి.. ఆర్‌బీఐ వడ్డీరేట్లలో మార్పుల్లేవ్

**న్యూఢిల్లీ:**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈమేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ నిర్వహించిన తొలి ద్వైమాసిక సమీక్ష ఇదే.ఫిబ్రవరిలో జరిగిన సమీక్షలోనూ ఈ వడ్డీరేట్ల (ఖీఎ ఎనిబివతీవబబి ఖీఙీవివబ)ను ఆర్‌బీఐ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది.ప్రపంచ ఆర్థికవ్యవస్థకు అనూహ్య సవాళ్లు ఎదురవుతున్నాయి. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు వృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయి.2026-27 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.9 శాతంగా నమోదుకావొచ్చని అంచనా వేస్తున్నాం.చమురు ధరల్లో పెరుగుదల ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపించనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం 4.6 శాతంగా ఉండొచ్చు.ఏప్రిల్ 3వ తేదీ నాటికి భారత ఫారెక్స్ నిల్వలు 696.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

## పశ్చిమాసియా సంక్షోభం వ్యాపారాలకు రూ.2.5లక్షల కోట్ల రుణ హామీ పథకం

దిల్లీ: పశ్చిమాసియా సంక్షోభ పరిణామాల ప్రభావంతో దేశీయంగా దెబ్బతిన్న వ్యాపారాలను, ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను (ఎంఎస్‌ఎంఈ) ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. దీనికోసం రూ.2.5 లక్షల కోట్లతో రుణ హామీ పథకాన్ని (క్రెడిట్ గ్యారంటీ) ప్రవేశపెట్టే యోచనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. యుద్ధం కారణంగా ఏర్పడిన పరిస్థితుల వల్ల, రుణ చెల్లింపులో విఫలం (డిఫాల్ట్) అయిన వారిని ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిపాదిత పథకం కింద.. రూ.100 కోట్ల వరకు ఉన్న రుణాలపై బ్యాంకులకు 90% క్రెడిట్ గ్యారంటీ లభించనుంది. ప్రభుత్వ పూర్తి అనుబంధ సంస్థ నేషనల్ క్రెడిట్ గ్యారంటీ ట్రస్టీ కంపెనీ (ఎన్‌సీజీటీసీ) ద్వారా బ్యాంకు రుణాలపై ఈ హామీ ఇస్తారు.ఈ పథకం అమలు కోసం కేంద్రం సుమారు రూ.17,000 - 18,000 కోట్లు సమకూర్చాల్సి ఉంటుందని అంచనా. కొవిడ్-19 మహమ్మారి సమయంలో ఇలాంటి పథకం అద్భుత విజయం సాధించిందని, వివిధ రంగాలకు చెందిన ఎన్నో వ్యాపారాలు మనుగడ సాధించేందుకు, బకాయిలు చెల్లించేందుకు అది ఎంతగానో ఉపయోగపడిందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. కరోనా వల్ల ఏర్పడిన విపత్కర పరిస్థితుల్లో ఎంఎస్‌ఎంఈలు, ఇతర అర్హత గల వ్యాపార సంస్థలు తమ నిర్వహణ బాధ్యతలను తీర్చుకునేందుకు వీలుగా 'ఆత్మనిర్భర్ భారత్ అభియాన్'లో భాగంగా 2020 మేలో ప్రభుత్వం 'ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీం(ఈసీఎల్‌జీఎస్)ను ప్రకటించింది.

## ఎన్నికల సంఘం-టీఎంసీ సమావేశంలో రసాభాస

బెంగాల్‌లో నేడు తృణమూల్ కాంగ్రెస్ బృందం-ఎన్నికల సంఘం మధ్య జరిగిన సమావేశంలో రసాభాస నెలకొంది. ఏడు నిమిషాల పాటు జరిగిన సమావేశం అనంతరం ఇరు వర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. సమావేశం అనంతరం టీఎంసీ రాజ్యసభ ఎంపీ డెరెక్ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాసిన లేఖను తాము ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు అందజేశామని పేర్కొన్నారు. అదేవిధంగా ఎన్నికల అధికారులకు భాజపాతో సంబంధాలున్న నిర్దిష్ట ఉదంతాలను ఆయన ముందు లేవనెత్తామన్నారు. దీంతో ఎన్నికల సంఘం అధిపతి ఆగ్రహంతో తమను సమావేశం నుంచి బయటకు వెళ్లిపొమ్మన్నారని ఆరోపించారు. మరోవైపు టీఎంసీ నేతల సమావేశంలో ఓ ఎంపీ అరుస్తూ గందరగోళం సృష్టించారని ఈసీ ఆరోపించింది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతున్న సమయంలో టీఎంసీ ఎంపీ ఇతర ఎన్నికల కమిషనర్లపై కేకలు వేస్తూ.. ఆయనను మాట్లాడకుండా అడ్డుకున్నారని తెలిపింది. బెంగాల్‌లో ఎటువంటి హింసాత్మక ఘటనలు, బెదిరింపులు, ప్రలోభాలు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది.

## మొదలైన ఎన్నికల సందడి

వరకు ఆమె రోడ్‌షో నిర్వహించారు. ఈ క్రమంలో ఆమె మద్దతుదారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఆమె ఇక్కడ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఆ తర్వాత ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 'నేను పుట్టింది, పెరిగింది భవానీపుర్‌లోనే. నా జీవితంలో అంతా ఇక్కడినుంచే మొదలైంది' అని వ్యాఖ్యానించారు. మొత్తం 294 స్థానాల్లోనూ టీఎంసీ అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ఆమె ప్రజలను కోరారు. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)లో భాగంగా.. పలువురి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడంపై మమత ఆందోళన వ్యక్తంచేశారు. 'ఓటర్ల జాబితా నుంచి అనేకమంది పేర్లను తొలగించడం నాకు చాలా బాధ కలిగిస్తోంది. ఓటరు తుది జాబితా ఇంకా ఎందుకు విడుదల చేయలేదో నాకు అర్థంకావడం లేదు. దీనికి వ్యతిరేకంగా మేం మళ్లీ కోర్టును ఆశ్రయిస్తాం' అని అన్నారు. భవానీపుర్ నుంచి మమత మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. దీదీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గం నుంచి భాజపా తన అభ్యర్థిగా సువేందు అధికారిని బరిలోకి దింపింది. ఇక, బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు (ఒబబవఎశ్రీఎ ఇశ్రీవఇబితిణీనిబ) ఏప్రిల్ 23, 29న రెండు విడతలుగా జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉండనుంది.

# గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- సురక్షిత మాతృత్వం ద్వారా తల్లి శిశు మరణాలు తగ్గింపు : జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 8 (జనం సాక్షి):** సురక్షిత మాతృత్వం ద్వారా తల్లి-శిశు మరణాల రేటును తగ్గించడం సాధ్యమవుతుందని, ప్రతి గర్భిణీ స్త్రీ ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకొని, సురక్షిత ప్రసవాన్ని నిర్ధారించుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు.

బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో వైద్య శాఖ అధ్వర్యంలో ఆరోగ్య వారోత్సవాలు ఏప్రిల్ 6 నుండి 11 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమములో బాగంగా కల్లెక్టరేట్ కార్యాలయ సమావేశ హాలు నందు జిల్లావిద్యా ఆరోగ్యా శాఖ అధికారి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమము లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తల్లి-శిశు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా సురక్షిత మాతృత్వంపై దృష్టి సారించాలని, గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న వైద్య సేవలు, పోషకాహార కార్యక్రమాలు మరియు ప్రసవ సదుపాయాలపై విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రతి గర్భిణీ స్త్రీ తప్పనిసరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రీ-నాటల్ చెకప్‌లు చేయించుకోవాలని, కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని సూచించారు. ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల వినియోగం, టీకాలు సమయానికి తీసుకోవడం, సమతుల ఆహారం తీసుకోవడంపై అవగాహన పెంచాలని తెలిపారు. తప్పని సరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వంద శాతం సురక్షిత ప్రసవాలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని, హోమ్ డెలివరీలను తగ్గించి ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీలను పెంచాలని, అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆశా, ఏఎన్ఎం సిబ్బంది గ్రామస్థాయిలో గర్భిణీలను గుర్తించి, వారికి అవసరమైన సేవలు అందేలా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. తల్లి-శిశు మరణాల రేటును తగ్గించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, తల్లి బిడ్డ క్షేమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడిలు ఆశలు, అధికారులు గర్భిణీ స్త్రీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమము లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్వర్ణ కుమారి, డిసిఎచ్ఎస్ డాక్టర్ ఆనంద్, డిఆర్‌డిఎ శ్రీనివాస్, జిజిఎచ్ఎస్ సుపరింతెన్డేంట్ రాజ్యలక్ష్మి, వరలక్ష్మి, ప్రోగ్రాం అధికారులు రవీందర్, పవిత్ర, డిడబ్ల్యూఓ కృష్ణవేణి, సంబంధిత అధికారులు, ఆశలు, తదితరులు పాల్గొన్నారు.

## పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదల

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి(జనంసాక్షి) :** పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని ప్రగతి నగర్ లో అత్యున్నత ప్రమాణాలతో అనాధ పాక్షిక మరియు నిరుపేద కుటుంబాల పిల్లలకు ఉచిత విద్యను రెసిడెన్షి విధానంలో ఆరవ తరగతి నుండి పీజీ వరకు ఉచిత విద్యను గత కొన్ని దశాబ్దాలుగా అందిస్తున్నటువంటి సంస్థ ఈ పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్చి 22 న కామారెడ్డి జిల్లా కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాల నిర్వహించిన 6 మరియు ఏడు 7 తరగతి లకు అర్హత పరీక్షను నిర్వహించడం జరిగింది. ఈ అర్హత పరీక్షలో సుమారు 42 మంది విద్యా ర్థులు పరీక్ష రాయడం జరిగింది. ఈ అర్హత పరీక్షకు సంబంధించినటువంటి ఫలితాలు బుధ వారం విడుదల కావడం జరిగింది. ఈ టాలెంట్ టెస్ట్ ను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించగా కామారెడ్డి జిల్లా నుంచి 42 మంది రాయగా అందులో 16 మంది విద్యార్థులు ఎంపిక కావడం జరిగింది.

వారికి టీఎస్ యుటిఎఫ్ కామారెడ్డి జిల్లా శాఖ పక్షాన అధ్యక్షులు ఆకుల బాబు జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఎంపిక అయిన విద్యార్థులు త్వరలోనే విద్యార్హతల బోనఫైడ్,కులం, రెసిడెన్షియల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావలసి ఉంది దానికి సంబంధించిన తేదీని విద్యార్థులకు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నీరడి నారాయణ, కోశాధికారి రూప్సింగ్, కార్యదర్శి నాంపల్లి, సాయి గౌతమ్, బాలయ్య, యేసు రత్నం తదితరులు పాల్గొన్నారు.

# చెత్తతో చెత్త రాజకీయాలు చేస్తున్న బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు

**పాడి కౌశిక్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ డబుల్ డ్రామాలు**

- మానేర్ రివర్ ఫ్రంట్ కోసం మానేర్ చుట్టూ తిరిగిన గంగులకు డంపు యార్డు కనబడలేదా?
- కరీంనగర్లో చెత్త పేరుకు పోవడానికి కారణం బిఆర్ఎస్, బిజెపి ప్రభుత్వాలు కాదా!
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఘాటు విమర్శలు



కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 08 (జనంసాక్షి):

కరీంనగర్ లో డంపు యార్డు విషయంలో బిజెపి, బీఆర్ఎస్ రెండు పార్టీలు చెత్తతో చెత్త రాజకీయాలు చేస్తున్నాయని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం రోజు కరీంనగర్ లో విలేకరుల సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో స్మార్ట్ సిటీ నిధులలో కోట్ల రూపాయలు కొల్లగొట్టి అవినీతి పాలన చేశారని మండిపడ్డారు. కరీంనగర్ లో గుట్టలు గుట్టలుగా చెత్త పేరుకు పోవడానికి ప్రధాన కారణం గత బిఆర్ఎస్ పార్టీ అసమర్థ పాలన కాదా? అని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. గత ఏడాది జనవరి 24 న కేంద్ర పురపాలక శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో తెగ హడావిడి చేసి డంపు యార్డ్ సమస్యకు పరిష్కారం చూపుతామన్న బండి సంజయ్ కుమార్ ఇప్పుడు డంపు యార్డు విషయంలో రెండు నాలుకల ధోరణి అవలంబిస్తున్నారని నరేందర్ రెడ్డి మండిపడ్డారు. చెత్తను తరలిస్తామని అడ్డగోలు హామీలు ఇచ్చి మున్సిపల్ ఎన్నికల్లోనూ ఓట్లు దండుకున్నారని, కరీంనగర్లో ఒకటి, హుజురాబాద్ లో మరొకటి మాట్లాడుతూ డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ లోని డంప్ యార్డ్ లో చెత్తను తొలగించే విషయంలో బండి సంజయ్ కేంద్రం నుంచి ఒక్క రూపాయి అయినా తెచ్చారా అని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వాటాను దాచి కరీంనగర్ ను కేంద్రమే అభివృద్ధి చేస్తుందని అబద్ధాలు చెప్పారని, ఇప్పటికైనా ప్రజలకు భ్రమలు కల్పించడం మానుకోవాలన్నారు. హుజురాబాద్ లో బీఆర్ఎస్, బిజెపి నేతలు దీక్షల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని, ఉరేసుకొని చస్తామంటూ పల్టీలు కొడుతున్నారని విమర్శించారు. బిఆర్ఎస్, బిజేపీ పార్టీల వారిని ప్రజలు ఉరికించి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని నరేందర్ రెడ్డి హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ఉరేసుకోవాల్సిన అవసరం లేదని, ప్రజలే ఉరివేస్తారని అన్నారు. కరీంనగర్ లోని డంప్ యార్డు లో చెత్తను పూర్తిగా తొలగించి వెస్ట్ ఎనర్జీ ప్లాంట్ ద్వారా ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి ఎటువంటి నిల్వ లేకుండా చేయాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి నెరవేరుస్తారన్నారు. చెత్త నిల్వ లేనప్పుడు అది సిర్సపల్లి లో ఏర్పాటు చేసిన, ఎక్కడ ఏర్పాటు చేసినా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగవని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికైనా డంప్ యార్డ్ విషయంలో బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో తాజొద్దీన్, పిట్టల రవీందర్, కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, నాయకులు గుండాటి శ్రీనివాస్ రెడ్డి, సరిల్ల ప్రసాద్, ఇక్రమ్ సిఖిందర్, కొట్టె ప్రభాకర్, ఖలీల్, దేవేందర్ పటేల్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో ఆర్‌జీఐ ఎయిర్‌పోర్ట్ పోలీసులు

**రూ.2 లక్షల లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.**



శంషాబాద్,ఏప్రిల్8(జనంసాక్షి)

అవినీతిని అరికట్టాల్సిన పోలీసు అధికారులే లంచం తీసకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఆర్‌జీఐ ఎయిర్‌పోర్ట్ పోలీస్ అవుట్‌పోస్ట్‌కు చెందిన ఇద్దరు పోలీసు అధికారులు ఏసీబీ వలలో చిక్కారు. మంగళవారం సాయంత్రం 6గంటల నుండి అర్ధరాత్రి 10గంటల వరకు విచారణ కొనసాగింది. రంగారెడ్డి జిల్లా ఏసీబీ డి.ఎస్.పి ఆనంద్ కుమార్ తెలిపిన ప్రకారం ఏఓ1 ఎస్ఐ యు.కె. సిద్దేశ్వర్ ,ఆర్‌జీఐ ఎయిర్‌పోర్ట్ పోలీస్ అవుట్‌పోస్ట్ ఏఓ-2 సంపతి కనకయ్య లు కలిసి ఓ వ్యక్తి నుంచి ఫేక్ పాస్పోర్ట్ కేసు నుంచి తప్పించేందుకు ఫిర్యాదుదారుని నుండి రూ.5 లక్షలు లంచం డిమాండ్ చేసి, అందులో భాగంగా రూ.2 లక్షలు తీసుకుంటుండగా పట్టుబడ్డారు. వారు శంషాబాద్‌లో నమోదైన ఒక కేసులో ఛార్జిషీట్ దాఖలు చేయడం, ఫిర్యాదుదారుని కుటుంబ సభ్యులను అరెస్టు చేయకుండా ఉండటం కోసం ఈ లంచం కోరినట్లు ఏసీబీ వెల్లడించింది. తదుపరి సోదాల్లో ఏఓ 2 నివాసంలో రూ.33.97 లక్షల నగదు, కొన్ని ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఇద్దరు అధికారులను అరెస్టు చేసి, నాంపల్లి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లంచం అడిగితే నిర్భయంగా ఫిర్యాదు చేయండి. రంగారెడ్డి జిల్లా ఏసీబీ డి.ఎస్.పి ఆనంద్ ప్రజలు ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం కోరితే, ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు లేదా వాట్సాప్ (9440446106) ద్వారా ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.

# అంగన్వాడీలకు స్మార్ట్ ఫోన్లు అందజేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, చిన్నపిల్లలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం
- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఆరోగ్య అవగాహన
- 552 అంగన్వాడీ కేంద్రాల బాధ్యులకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ



**ముస్తాబాద్, ఏప్రిల్ 8 (జనంసాక్షి):**

మహిళల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, చిన్నపిల్లలకు మెరుగైన సేవలు అందుతున్నాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఏప్రిల్ ఆరోగ్య అవగాహన వారోత్సవాల సందర్భంగా బుధవారం సురక్షిత మాతృత్వ దినోత్సవం కార్యక్రమం, జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీలకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.

జిల్లాలోని 552 మంది అంగన్వాడీ కేంద్రాల బాధ్యులకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. జిల్లా సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.. ప్రసవానంతర తల్లులకు కూడా ఆరు నెలలపాటు పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ వివిధ శాఖలకు అప్పగించారని, దీనిలో భాగంగా ఇప్పటివరకు అమలవుతున్న ప్రభుత్వ పథకాల వివరాలు ప్రజలకు తెలియజేయడం, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై నివేదిక సిద్ధం చేయడం జరుగుతుందని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు రాష్ట్రంలో విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ అరవింద్, వివిధ గ్రామాల అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు. ప్రభుత్వం మహిళలు, శిశువుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని, స్మార్ట్ ఫోన్ల ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు మరింత సమర్థవంతంగా సేవలు అందించగలరని అధికారులు తెలిపారు.



## అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం, అన్నప్రాసన

**మల్లాపూర్,ఏప్రిల్ 08(జనంసాక్షి) :** మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రం -1లో చిన్నారుల సమగ్ర వికాసం కోసం "అక్షరాభ్యాసం" (3-6 ఏళ్లు) మరియు "అన్నప్రాసన" (6 నెలలు) కార్యక్రమాలు గ్రామ పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమము ముఖ్య ఉద్దేశం చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడం, సరైన పోషకాహారాన్ని అందించడం అని అన్నారు. ఈ కార్యక్రమం లో కేంద్రం నిర్వాహకురాలు ఎం. రాధ, ఉప సర్పంచ్ సోమ రెడ్డి, వార్డు సభ్యులు కొంపెల్లి రాకేష్, ముష్కరి రమేష్,సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై కరీంనగర్ పోలీసుల ఉక్కుపాదం

- మార్చి నెలలో విస్తృత తనిఖీలు 120 ఎఫ్ఐఆర్‌లు, 139 వాహనాల స్వాధీనం, 161 మంది నిందితులపై కేసులు
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 08 (జనంసాక్షి):**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా, నిల్వ, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని పోలీస్ కమి షనర్ తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ... మార్చి నెలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 120 కేసులు నమోదు చేసి,139 వాహనాలను స్వాధీనం చేసుకుని,161 మంది నిందితుల పై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అక్రమ ఇసుక రవాణా కారణంగా ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా, రోడ్డు భద్రత, పర్యావరణ సమతుల్యత, ప్రజా శాంతి భద్రతల పై ప్రతికూ ల ప్రభావం పడుతున్న నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. టౌన్ డివిజన్ పరిధిలో 15 కేసులు, 12 వాహనాల స్వాధీనం, 15 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు. రూరల్ డివిజన్ పరిధిలో అత్యధికంగా 73 కేసులు, 79 వాహనాల స్వాధీనం, 98 మంది నిందితులపై కేసులు నమోదయ్యాయి. హుజురాబాద్ డివిజన్ పరిధిలో 32 కేసులు, 48 వాహనాల స్వాధీనం, 48 మంది నిందితులపై చర్యలు తీసుకున్నామన్నారు. కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 28 ఎఫ్ఐఆర్‌లు, 36 వాహనా ల స్వాధీనం, 40 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు. జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో 15 కేసులు, 24 వాహనాల స్వాధీనం, 24 మంది నిందితులు నమోదు అయ్యారు. ఎల్ఎండీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 కేసులు నమోదయ్యాయి. మాన కొండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 10 కేసులు, 10 వాహనాలు, 15 మంది నిందితులు గుర్తించబడ్డారు. కరీంనగర్-2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 9 కేసులు, 6 వాహనాలు, 9 మంది నిందితులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు.

2026 సంవత్సరంలో మార్చి నెల వరకు కమిషనరేట్ పరిధిలో మొత్తం 245 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, 357 వాహనాలను స్వాధీనం చేసుకుని, 422 మంది నిందితులపై కేసులు నమోదు చేసినట్లు సీపీ తెలిపారు. టౌన్ డివిజన్‌లో 24 కేసులు, 27 వాహనాలు, 32 నిందితులు, రూరల్ డివిజన్‌లో 139 కేసులు, 203 వాహనాలు, 241 నిందితు లు, హుజురాబాద్ డివిజన్ లో 82 కేసులు, 127 వాహనాలు, 149 నిందితులను అరెస్ట్ చేశారు. అక్రమంగా ఇసుక తవ్వకం, రవాణా, నిల్వ, విక్రయాల్లో పాల్గొనే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించాలని, సమాచారదాతల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అక్రమ ఇసుక రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని, ఇలాంటి కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించమని, సంబంధిత పోలీస్ స్టేషన్‌ల పరిధిలో తనిఖీలు, నిఘా మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు.

# హెల్త్ వీక్‌లో భాగంగా 'సేఫ్ మదర్‌హుడ్'పై వర్క్‌షాప్

**ఆరోగ్య సిబ్బందికి అవగాహన - ఉత్తమ సేవలకుగాను సన్మానం**




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మరియు ప్రజా ఆరోగ్య సంచాలకుల ఆదేశాల మేరకు ఏప్రిల్ 6 నుంచి 11 వరకు జిల్లాలో "హెల్త్ వీక్" కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్ద జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. సి. ఉమా గౌరి ఆధ్వర్యంలో ఆశా ఫెసిలిటేటర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు 'సేఫ్ మదర్‌హుడ్'పై వర్క్‌షాప్ నిర్వహిం చారు. ఈ వర్క్‌షాప్‌లో గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణ, ఆంటినేటల్ చెకప్‌లు, మాతృ మరణాల రేటు, సిజేరియన్ ప్రసవాలు, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషణ, సంబంధిత చట్టాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖలో విశిష్ట సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు, అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ అధ్యక్షత వహించి, ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవార్డు గ్రహీతలను అభినందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్య శాఖ పాత్ర అత్యంత కీలకమని, గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు సేవలను సమర్థవంతంగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డా. సత్యవతి, డా. లావణ్య రెడ్డి, డా. శ్రీదేవి, డా. గీతా ప్రసాద్, డా. పవన్ కుమార్ రెడ్డి, డా. కౌశిక్ పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణానికి అండగా టౌన్ ప్లాన్ అధికారులు

**ఆధారాలతో ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు**

- సర్వే నంబర్లు లేకుండా అనుమతులు
- అనుమతులు రెసిడెన్షియల్ నిర్మాణం కమర్షియల్
- అధికారుల తీరుపై మండిపడుతున్న ప్రజలు


OFFICE OF THE GREATER HYDERABAD MUNICIPAL CORPORATION TG-bPASS

WORK COMMENCEMENT LETTER
(COMMENCEMENT OF THE BUILDING PERMISSION as per GHMC TG-bPASS Act)

To,
Smt. KOTHA ANUSHA
D/o KOTHA VENKATAPUNNA RAO
R/o House No 2-22-1/45, Flat No 501,
Panchavati A. Bhagya Nagar Colony,
Kukatpally, Near Sai Baba Temple,
Hyderabad - 500 072.
TELANGANA.

Letter No: 469549/GHMC/0259/2025
Date: 30-01-2025

Dear Sir/Madam,

Sub: GREATER HYDERABAD MUNICIPAL CORPORATION -Proposed construction of Individual Residential Building on Plot No/House No: 29-495(OLD 28-157/38), Locality: DINAKARA NAGAR, Abadi: 29-495, Malkajgiri(V), Malkajgiri Circle 28, Secunderabad Zone, Malkajgiri(M), GHMC, Medchal - Malkajgiri(Dist) Post Verification Completed - Permission letter for work Commencement - Reg.

Ref: 1. Your Building Application File No : 469549/GHMC/0259/2025 dated: 06-01-2025.
2. Post verification dt 30-01-2025.

With reference to subject cited, it is to inform that You have obtained building permission for construction of Stilt For Parking + 3 Upper Floor in Plot No/House No: 29-495(OLD 28-157/38), Locality: DINAKARA NAGAR, Abadi: 29-495, Malkajgiri(V), Malkajgiri Circle 28, Secunderabad Zone, Malkajgiri(M), GHMC, Medchal - Malkajgiri(Dist). Instant Approval based on the self certification submitted by you and this authority has conducted the Post verification as per GHMC TG-bPASS Act, and it is observed that the permission obtained by you is found correct and you can proceed with the construction.

- If the abutting road width is less than 30 feet (9.00 Mts.), 15 feet (4.5 Mts.) from the center of the existing road has to be left for road widening in addition to front setback as per rule 4 (a) of G.O. Ms. No. 168 MA dt:07-04-2012 or required area affected under Master Plan road.
- The built up area shall be limited to the remaining area after leaving the road affected area and all sides setbacks.
- AS RECOMMENDED BY THE ACP, APPROVED
- As per the remarks of TPS, the proposal may be approved.
- "Inspected the site under reference and observed that there is existing building on the ground position which is in dilapidated condition and the site measurements are tallying on

**మల్కాజిగిరి ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** మౌలాలి సర్కిల్ పరిధిలోని వినాయక నగర్ త్రీ టెంపుల్స్ 100 ఫీట్ల రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాన్ని అడ్డుకో వడంలో స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు ఘోరంగా విఫలమయ్యారని ప్రజలు మండిపడుతున్నారు. స్పష్టమైన ఆధారాలతో ఫిర్యాదు చేసినా, సెక్షన్ ఆఫీసర్ సంగీత ఏసీపీ శ్రీనివాసరావు క్షేత్రస్థాయి పరిశీలన చేయకపోవడం వెనుక భారీ అవినీతి దాగి ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 100 ఫీట్ల రోడ్డులో కనీస సెట్‌బ్యాక్ వదలకపోవడం వల్ల భవిష్యత్తులో రహదారి విస్తరణకు ఆటంకం ఏర్పడుతుందని వాపోతున్నారు. ఎక్కడో ఉన్న ఇంటి నంబర్లను ఇక్కడకు ఎలా మారుస్తారని, సర్వే నంబర్లు లేకుండా స్టిల్టు అనుమతులు ఎలా ఇస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణదారు లకు వత్తాసు పలుకుతున్న అధికారుల తీరుపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గృహ నిర్మాణానికి అనుమతులు తీసుకొని వాణిజ్య భవనం నిర్మిస్తున్నాడు. సామాన్యుడు చిన్న ఇల్లు కట్టుకుంటే వంద నిబంధనలు చెప్పే అధికారులు, ఇంత పెద్ద రహదారిపై అక్రమంగా భవనం వెలుస్తున్నా పట్టించుకోకపోవడం దారుణం అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని టౌన్ ప్లానింగ్ అధికారులు ఇచ్చిన అనుమతులపై సమగ్ర విచారణ జరిపించి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న నిర్మాణానికి అండగా ఉన్న అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# వచ్చే ఖరీఫ్‌లో 150 ఎకరాల్లో ఆయిల్ పామ్ నాటే లక్ష్యం

**రైతులకు సాంకేతిక సూచనలు, నాణ్యమైన మొక్కల పంపిణీపై దృష్టి**

- ఆయిల్ పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం
- ఆయిల్ పామ్ పంట సాగు పై నిర్వహించిన సమీక్షలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష




**గోదావరిఖని, జనంసాక్షి :**

వచ్చే ఖరీఫ్ నాటికి గ్రామంలో అదనంగా 150 ఎకరాల్లో ఆయిల్ పామ్ నాటడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి తెలిపారు. బుధవారం పాలకుర్తి మండలం ఈసాల తక్కలపల్లి గ్రామంలో ఆయిల్ పామ్ పంట సాగు పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి మాట్లాడుతూ, ఆయిల్ పామ్ పంట రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం అందించే లాభదాయక పంటగా నిలుస్తుందని తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకొని రైతులు ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని సూచించారు. గ్రామంలో సుమారు 150 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నప్పటికీ, గత రెండు సంవత్సరాలుగా వివిధ కారణాల వల్ల నాటడం జరగలేదని తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఈ 150 ఎకరాల్లో తప్పనిసరిగా కొత్తగా ఆయిల్ పామ్ నాటేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో ప్రస్తుతం 210 మంది రైతులు 312 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారని పేర్కొంటూ, ఆయిల్ పామ్ నాటిన మొదటి మూడు సంవత్సరాల్లో మధ్యంతర పంటగా పత్తిని సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని రైతులకు సూచించారు.

రైతులకు తక్కువ ఖర్చుతో డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేయడానికి జిల్లా పరిపాలన ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతుల అందరికీ విద్యుత్ సరఫరా కల్పించబడుతుందని, 40 శాతం వ్యయాన్ని భరించే రైతులకు బోర్‌వెల్లు ఏర్పాటు చేయడానికి కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ పంటకు ఎకరాకు నాలుగు సంవత్సరాలపాటు సుమారు రూ.52 వేల విలువైన సబ్సిడీ ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు.

ఈ సందర్భంగా ఆయిల్ పామ్ పంటకు మొదటి విడతగా లబ్ధి పొందిన రైతులు స్వప్న, చంద్రయ్యలకు రూ.43 వేల విలువైన చెక్కులను జిల్లా కలెక్టర్ అందజేశారు. పంట సాగులో శాస్త్రీయ పద్ధతులు అనుసరించడం, నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటడం, నీటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. అలాగే రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు, అవగాహన కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో సాగు పురోగతిని నిరంతరం పరిశీలిస్తూ, సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి జగన్మోహన్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
9 ఏప్రిల్ 2026

# వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌పై దుండగుల రాళ్లదాడి

## గస్తీ పోలీసులు రావడంతో ముఠా పరార్

- ముఠాలో పోలీసులకు చిక్కిన ఇద్దరు మహిళలు




**హైదరాబాద్, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** ఒడిశా, బిహార్ రాష్ట్రాల తరహాలో తెలంగాణ లోనూ రైలుపై దాడి జరగడం కలకలం రేపింది. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ లక్ష్యంగా దుండగులు రాళ్లతో దాడికి తెగబడ్డారు. గస్తీలో ఉన్న పోలీసులు అప్రమత్తమవ్వడంతో దుండుగులు పారిపోయారు. ఈ క్రమంలో వారిని పట్టుకునేందుకు సినీఫక్కీలో పోలీసులు చేజింగ్ చేశారు. కానీ 30 మంది గ్యాంగ్ తప్పించుకుని వెళ్లింది. అయితే గ్యాంగ్‌లోని ఇద్దరు మహిళలు మాత్రం పట్టుబడ్డారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతి బయల్దేరిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ గతరాత్రి తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్ దాటుతున్న సమయంలో ట్రాక్ పక్కన 30 మంది గ్యాంగ్ మాటు వేసి ఒక్కసారిగా రాళ్ల వర్షం కురిపించింది. కిటికీలు, బోగీలకు రాళ్లు తగలడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. సరిగ్గా అదే సమయంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు ఆ గుంపును గమనించి అడ్డుకునే ప్రయత్నం చేశారు. గ్యాంగ్‌ను పట్టుకునేందుకు పోలీసులు యత్నించగా.. సుమారు 30 మంది గుంపు పోలీసులనే రౌండప్ చేసి దాడికి యత్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అదనపు బలగాల సాయం కోరారు. దీంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ క్రమంలో వారిని కిలోమీటర్ల మేర ఛేజ్ చేశారు. కానీ నందిగామ మండలంలోని పాత జాతీయ రహదారి పక్కనే ఉన్న ఎన్‌సీఎల్ వెంచర్ గుండా పరుగులు తీసి చీకట్లో తప్పించుకున్నారు. కానీ ఇద్దరు మహిళలు మాత్రం పోలీసులకు చిక్కారు. వారిని బిహార్, ఒడిశా, రాజస్థాన్‌కు చెందిన ముఠాలుగా పోలీసులు అనుమానిస్తున్నారు. అరెస్టయిన ఆ ఇద్దరు మహిళలను విచారించగా, తాము రుద్రాక్ష మాలలు అమ్ముకోవడానికి వచ్చామని చెబుతున్నారు. అయితే, అర్ధరాత్రి వేళ రైలుపై దాడికి గల కారణాలపై వారు సరైన వివరణ ఇవ్వడం లేదని, వారి వేషధారణ, ప్రవర్తనపై పోలీసులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వీరంతా పక్కా ప్రణాళికతోనే రైళ్లను లక్ష్యంగా చేసుకున్నారా? అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. పరారైన ఆ 30 మంది గుంపు కోసం పోలీసులు రాత్రంతా వెంచర్లలో గాలింపు చర్యలు చేపట్టారు. రాజస్థానీ వేషధారణలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నందిగామ, తిమ్మాపూర్ పరిసర గ్రామాల్లోని ప్రజలు అపరిచితులకు ఆశ్రయం ఇవ్వకూడదన్నారు రైల్వే ట్రాక్‌ల సమీపంలో అనుమానిత కదలికలు ఉంటే డయల్ 100 కి కాల్ చేయాలని కోరారు. ప్రస్తుతం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు ముమ్మరం చేశారని, ఈ ముఠా వెనుక ఏదైనా పెద్ద కుట్ర ఉందా లేదా వీరు దొంగతనాల కోసం ఇలా చేస్తున్నారా అనేది తేలాల్సి ఉంది.

# జలవిహార్‌లో ఆర్వో ప్లాంట్ పేలుడు

## ఇద్దరికి గాయాలు... ఆస్పత్రికి తరలింపు



**హైదరాబాద్, ఏప్రిల్8 (జనంసాక్షి) :** జలవిహార్‌లో ఆర్వో ప్లాంట్ పేలుడు ఘటన కలకలం రేపింది. నీటిని సరఫరా చేసే ఆర్వో ప్లాంట్ ఒక్కసారిగా బ్లాస్ట్ అవ్వడంతో భయాందోళనకు గురయ్యారు సందర్శకులు. బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. జలవిహార్ కు నీటిని సరఫరా చేసే ఆర్వో ప్లాంట్ పేలింది. ఈ ఘటనలో ప్లాంట్ దగ్గర పనిచేస్తున్న ఇద్దరు సిబ్బందికి తీవ్రగాయాలయ్యాయి. పేలుడు ధాటికి ఆర్వో ప్లాంట్ పరికరాలన్నీ తునాతునకలు అయ్యాయి. ఆర్వో ఫిల్టర్ లేదా కంప్రెషర్ లో అధిక ప్రెషర్ ఏర్పడడమే పేలుడుకు కారణమని భావిస్తున్నారు పోలీసులు. గాయపడిన ఇద్దరినీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడ్డ ఇద్దరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.సమ్మర్ కావడంతో జలవిహార్ కు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటోంది... ఇలాంటి సమయంలో ప్రమాదం జరగడం పట్ల సందర్శకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే..ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# ఉమ్మడి నిజామాబాద్‌లో పులి సంచారం

## ఆందోళనకు గురవుతున్న సమీప గ్రామాల జనం




**నిజామాబాద్, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల మధ్య పెద్దపులి సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. మాచారెడ్డి అటవీ ప్రాంతంలో పులి ఉందన్న సమాచారం స్థానిక గ్రామాల ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తోంది. కొన్ని రోజులుగా దోమకొండ, బిక్కనూర్, మాచారెడ్డిలో పులి సంచరిస్తోంది. గేదెలు, ఆవులను మేపేందుకు పశువుల కాపరులు వెళ్లగా.. ఆయా ప్రాంతాల్లో పశువులపై పెద్దపులి ఒక్కసారిగా దాడి చేస్తోంది. ఆహారం కోసం వాటిని చంపేస్తోంది. భయంతో పరుగులు తీసిన పశువుల కాపరులు.. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన అధికారులు మాచారెడ్డి అటవీ ప్రాంతాన్ని జల్లెడపడుతున్నారు. పులి కోసం ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. నిరంతర నిఘా పెట్టి దాన్ని పట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కెమెరాలకు చిక్కితే అనంతరం బోను ద్వారా దాన్ని బంధిస్తామని చెబుతున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఎవరూ భయపడవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు అధికారులు. ఒంటరిగా తిరగవద్దని హెచ్చరించారు. వ్యవసాయ పనులకు వెళ్లాల్సి వస్తే గుంపులుగా వెళ్లాలని తెలిపారు. పులిని పట్టుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నామని సమీప గ్రామల ప్రజలు సహకరించాలని కోరారు.

# 40 రోజుల యుద్ధంతో ఏం సాధించారు?

- కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా



**శ్రీనగర్, ఏప్రిల్8 (జనంసాక్షి) :** ఇరాన్‌పై 40 రోజుల యుద్ధంతో అమెరికా ఏమి సాధించిందని జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు. హార్ముజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు సిద్ధంగా ఉండాలనే షరతుపై మధ్యప్రాచ్యంలో రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించిన సంగతి తెలిసిందే. కాల్పుల విరమణలో భాగంగా వ్యూహాత్మక హార్ముజ్ జలసంధిని తిరిగి తెరిచారన్న మీడియా నివేదికలపై బుధవారం ఆయన స్పందించారు. యుద్ధ ప్రారంభం కావడానికి ముందే ఆ మార్గం 'తెరిచి వుండటంతో పాటు స్వేచ్ఛగా అందుబాటులో' ఉందని అన్నారు. ఈ 39 రోజుల యుద్ధం అమెరికా ఏమి సాధించిందని ఎక్స్‌లో పేర్కొన్నారు. 'అన్యాయమైన యుద్ధం' అని హ్యాష్ ట్యాగ్ పోస్ట్ చేశారు.

# 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి

- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

**ఏలూరు, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని 2027 నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. పెనుమంట్ర మండలం మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థలో నిర్వహించిన 'మారుతున్న వాతావరణ పరిస్థితులు - సుస్థిర వరి వ్యవసాయం' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. గత ఐదేళ్లలో గోదావరి జిల్లాల్లో కాలువలో కనీసం మట్టి తీయలేదని అన్నారు. గత ఐదేళ్లలో చేసిన రూ. 12 లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను దాదాపు నెరవేర్చామని, ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, భాజపా రాజ్యసభ ఎంపీ పాకా సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు.

# అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్

## రూ.1,234.91 కోట్లతో కూడిన పీఐబీ ప్రతిపాదనలు




**అమరావతి, ఏప్రిల్8 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రూ.2,534 కోట్లతో అమరావతిలో కేంద్రం భారీ నిర్మాణాలను చేపట్టనుంది. అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. అమరావతిలో కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం కోసం రూ.1,299.08 కోట్లు, నివాస సముదాయాల ఏర్పాటు కోసం రూ.1,234.91 కోట్లతో కూడిన పీఐబీ మెమోరాండం సిద్ధమైంది. ఈ ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగాలంటే కేబినెట్ సెక్రటేరియట్ వద్ద పెండింగ్‌లో ఉన్న ÷ల్‌కు క్లియరెన్స్ రావాల్సి ఉంది. అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ వెలువడిన గెజిట్ నోటిఫికేషన్‌ను ఏపీ అధికారులు ఇప్పటికే కేబినెట్ సెక్రటేరియట్‌కు సమర్పించారు. వచ్చే కేంద్ర క్యాబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు అనుమతి లభించే అవకాశం ఉంది. ప్రాజెక్టు తదుపరి అనుమతులకు కీలకమైన కేబినెట్ సెక్రటేరియట్ క్లియరెన్స్ మాత్రమే పెండింగ్ ఉంది. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఫైల్‌కు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆమోదం తెలిపారు. అమరావతిలో కేంద్ర నిర్మాణాల కోసం మొత్తం 22.53 ఎకరాల భూమిని కేటాయించారు. సీపీడబ్ల్యూడీ కోసం 22.53 ఎకరాల భూమిని ఏపీ ప్రభుత్వం ఆఫర్ చేసింది. ఇందులో 5.53 ఎకరాలు సెక్రటేరియట్ నిర్మాణానికి, 17 ఎకరాలు నివాస సముదాయాల ఏర్పాటుకు కేటాయించారు. కేబినెట్ సెక్రటేరియట్ నుంచి క్లియరెన్స్ వచ్చిన వెంటనే అమరావతిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ పనులు మరింత వేగవంతమయ్యే అవకాశం ఉంది.

# తెలంగాణ భవన్ ముట్టడికి ఉద్యమకారుల జేఏసీ యత్నం

## అడ్డుకున్న పోలీసుల.. స్వల్ప ఉద్రిక్తత



**హైదరాబాద్, ఏప్రిల్8 (జనంసాక్షి) :** తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సభ్యులు ముట్టడించారు. తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ వారు ఆందోళనకు దిగారు. పలువురు ఉద్యమకారులు తెలంగాణ భవన్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడం తో అదనపు బలగాలను అక్కడికి తరలిం చారు పోలీసులు. పోలీసుల తీరుపై ఉద్యమకారుల జేఏసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమకారులను బీఆర్ఎస్ పార్టీ పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. ఉద్యమకారుల సమస్యలపై ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎందుకు ప్రశ్నించడం లేదంటూ తెలంగాణ భవన్ వద్ద ఉద్యమకారుల జేఏసీ సభ్యులు ఆందోళన చేశారు. ఉద్యమకారుల ఆందోళనతో తెలంగాణ భవన్ వద్ద టెన్షన్ వాతావరణం నెలకొంది.

# కోర్టు తీర్పు వచ్చే వరకు ఆగలేరా?

## అప్పుడే వెళ్లి రైతులను వేధించాలా?

- హైడ్రా తీరుపై మండిపడ్డ మందకృష్ణ మాదిగ



**సంగారెడ్డి, ఏప్రిల్8 (జనంసాక్షి) :** ఐలాపూర్‌లోని సర్వే నంబర్ -1 నుంచి 220 వరకు గల 1265 ఎకరాల భూమి భూ వివాదంలో పేద రైతులను హైడ్రా ఇబ్బంది పెట్టడం సరికాదని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివాదాస్పద భూములతో సంబంధం లేని రైతులను భయభ్రాంతులకు గురిచేయటం దారుణమని మంద కృష్ణ మాదిగ చెప్పారు. కోర్టు పరిధిలో ఉన్న కేసుల్లో తీర్పు వచ్చేంతవరకు హైడ్రా అధికారులు సంయమనం పాటించాలని సూచించారు. ఈ మేరకు హైడ్రాపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ షాకింగ్ కామెంట్స్ చేశారు. బుధవారం అమీన్ పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలోని వివాదంలో ఉన్న భూముల రైతులను మంద కృష్ణ మాదిగ, హైకోర్టు అడ్వకేట్ ముఖీం పరామర్శించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడారు. కోర్టు పరిధిలో లేని భూములకు సంబంధించిన రైతుల జోలికి హైడ్రా, రెవెన్యూ అధికారులు రావొద్దని కోరారు. రైతులకు ఉన్న లీగల్ హక్కులకు భంగం వాటిల్లితే సహించబోమని హెచ్చరించారు. ఏదైనా కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా దృష్టి పెడితే ఏ సమస్య ఉండదని తెలిపారు. హైడ్రా తన పరిధిలో పనిచేస్తుందా, అతిక్రమిస్తుందా అనే అంశంపై ఒకసారి ముఖ్యమంత్రి పరిశీలించాలని అన్నారు. హైడ్రా పరిధిలో ఉన్న భూ వివాదాలు పరిష్కారానికి ప్రత్యేక కోర్టు అవసరం ఉందని చెప్పుకొచ్చారు. హైడ్రా అనవసర జోక్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు.

# ఎన్నికల సంఘంతో టీఎంసీ సమావేశం

- రసాభాసగా ముగిసిన భేటీ

**కోల్‌కతా, ఏప్రిల్8 (జనంసాక్షి) :** బెంగాల్‌లో బుధవారం తృణమూల్ కాంగ్రెస్ బృందం-ఎన్నికల సంఘం మధ్య జరిగిన సమావేశంలో రసాభాస నెలకొంది. ఏడు నిమిషాల పాటు జరిగిన సమావేశం అనంతరం ఇరు వర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. సమావేశం అనంతరం టీఎంసీ రాజ్యసభ ఎంపీ డెరెక్ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాసిన లేఖను తాము ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు అందజేశామని పేర్కొన్నారు. అదేవిధంగా ఎన్నికల అధికారులకు భాజపాతో సంబంధాలున్న నిర్దిష్ట ఉదంతాలను ఆయన ముందు లేవనెత్తామన్నారు. దీంతో ఎన్నికల సంఘం అధిపతి ఆగ్రహంతో తమను సమావేశం నుంచి బయటకు వెళ్లిపొమ్మన్నారని ఆరోపించారు. మరోవైపు టీఎంసీ నేతల సమావేశంలో ఓ ఎంపీ అరుస్తూ గందర గోళం సృష్టించారని ఈసీ ఆరోపించింది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతున్న సమయంలో టీఎంసీ ఎంపీ ఇతర ఎన్నికల కమిషనర్లపై కేకలు వేస్తూ.. ఆయనను మాట్లాడకుండా అడ్డుకున్నారని తెలిపింది. బెంగాల్‌లో ఎటువంటి హింసాత్మక ఘటనలు, బెదిరింపులు, ప్రలోభాలు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. టీఎంసీ అధికారిక బృందం తో సమావేశం అనంతరం ఆ పార్టీకి ఎన్నికల సంఘం అల్టిమేటం జారీ చేసింది. ఎటువంటి హింసాత్మక ఘటనలు జరగకుండా ఎన్నికల నిర్వహణకు సహకరించాలని సూచించింది. ఓటింగ్ సమయంలో బూత్ క్యాప్చరింగ్, బూత్ జామింగ్ వంటి ఓటర్లకు అంతరాయం కలిగించే చట్టవిరుద్ధమైన చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించింది.

# వనపర్తిలో హరీష్ రావు సభకు అనుమతి రద్దు

- హైకోర్టుకు వెళతామన్నా మాజీమంత్రి నిరంజన్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** కాంగ్రెస్ సర్కార్ ప్రజాపాలనలో అప్రజాస్వామిక విధానాలు కొనసాగుతున్నాయని బిఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. పరిగి రైతుల పరామర్శకు వెళ్లి బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలను అక్రమ అరెస్టు చేసిన సర్కార్.. వనపర్తిలో హరీశ్‌రావు బహిరంగ సభకు అనుమతులను రద్దు చేసింది. వనపర్తి నియోజకవర్గం రేవల్లి మండలంలో గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి వ్యతిరేకంగా గత 100 రోజులుగా రైతులు దీక్షలు చేస్తున్నారు. వారికి మద్దతుగా ఈ నెల 9వ తేదీన హరీశ్‌రావు బహిరంగ సభను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సమావేశానికి అనుమతి ఇవ్వాలని పోలీసులను కోరారు. ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు సభ కోసం అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ అకస్మాత్తుగా గతంలో ఇచ్చిన అనుమతులను ప్రభుత్వం రద్దు చేసింది. హరీశ్‌రావు సభకు అనుమతులు రద్దు చేయడంపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టుకు వెళ్లి సభకు అనుమతులు తెచ్చుకుంటామని తెలిపారు. ప్రజలు, రైతాంగం తరఫున ప్రశ్నిస్తున్న ప్రతిపక్షం గొంతు నొక్కేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి ఉద్యమాలు కొత్త కాదని తెలిపారు.



# రైల్వే పనులు చేస్తుండగా ప్రమాదం

**కొమురం భీమ్ ఆసిఫాబాద్, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** కాగజ్‌నగర్ పెద్దవాగు రైల్వే బ్రిడ్జి పనులు చేస్తుండగా కార్మికులకు ప్రమాదం జరిగింది. థర్డ్ లైన్ పనులు చేస్తూ కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ జారిపడి బాక్స్ బ్రిడ్జ్‌లో ఇద్దరు కార్మికులు ఇరుక్కుపోయారు. ఒకరిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు తోటి కార్మికులు. బ్రిడ్జి మధ్యలోనే మరొకరు ఇరుక్కుపోయారు. అతన్ని రక్షించేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఆ కార్మికుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# కేంద్ర మాజీమంత్రి మొహిసినా కిద్వాయ్ మృతి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ కేంద్రమంత్రి మోహ్సినా కిద్వాయ్ మరణించారు. వయస్సు రీత్యా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె నొయిడాలోని మెట్రో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం తెల్లవారు జామున మరణించినట్లు కుటుంబ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5.00గంటలకు అంత్యక్రియలు జరపనున్నట్లు ఆమె అల్లుడు రజీ ఉర్ రెహ్మాన్ కిద్వాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హయాంలో కిద్వాయ్ పలు కీలకమైన శాఖల బాధ్యతలను చేపట్టారు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యురాలిగాను పనిచేశారు. గతంలో ఆమె కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో,పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీలో కూడా సభ్యురాలిగా పనిచేశారు.

# కృష్ణపట్నం తీరంలో తమిళ జాలర్ల బోటు

- పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ బృందాలు

**నెల్లూరు, ఏప్రిల్8 (జనంసాక్షి) :** నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు సముద్ర తీరంలోకి అక్రమంగా చొరబడిన తమిళనాడుకు చెందిన ఒక బోటును టాస్క్‌ఫోర్స్ బృందాలు పట్టుకున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాల మేరకు తీర ప్రాంతంలో భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. నిరంతర నిఘా కొనసాగుతున్న వేళ, ఈ చొరబాటు కలకలం రేపింది. గత కొద్ది రోజులుగా కృష్ణపట్నం తీరంలో అక్రమ రాకపోకలు పెరగడంతో టాస్క్‌ఫోర్స్ బృందాలు గస్తీని ముమ్మరం చేశాయి. ఈ క్రమంలోనే తాజాగా పట్టుబడిన బోటుతో కలిపి ఇప్పటి వరకు మొత్తం నాలుగు బోట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల వరుసగా మూడు బోట్లను పట్టుకోగా, తాజాగా నాలుగో బోటు చిక్కింది. పట్టుబడిన ఈ బోట్లన్నింటినీ భద్రతా కారణాల దృష్ట్యా జువ్వలదిన్నె హార్బర్‌కు తరలించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల నేపథ్యంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు 24 గంటల పాటు నిరంతర గస్తీ నిర్వహిస్తున్నారు. ఆధునిక పరికరాలు, నిఘా నేత్రాల సహాయంతో అనుమానాస్పద కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ చొరబాటుదారుల ఆటకట్టిస్తున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370